



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 11 సంచిక : 188 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు శుక్రవారం 14 మార్చి 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 188 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE FRI 14 MARCH 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada,Visakhapatnam, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


# నన్ను ప్రపంచ బ్యాంక్ జీతగాడని విమర్శించారు

- విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకొచ్చిన తొలి ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వమేనన్న చంద్రబాబు
- దేశంలో కరెంట్ కొరత లేని ఏకైక రాష్ట్రంగా ఏపీని తయారు చేశామని వెల్లడి
- 1988లోనే విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చామన్న సీఎం



పెన్ పవర్ డెస్క్:విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకొచ్చిన తొలి ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వమేనని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 1988లో విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చామని... విద్యుత్ రంగాన్ని జనరేషన్, డిస్ట్రిబ్యూషన్, ట్రాన్స్ మిషన్ గా విభజించామని చెప్పారు. ఎనర్జీ ఆడిటింగ్ ను తీసుకొచ్చామని... దేశంలో కరెంట్ కొరత లేని ఏకైక రాష్ట్రంగా ఏపీని తయారు చేశామని తెలిపారు. అసెంబ్లీలో ఇంధన శాఖపై జరిగిన చర్చలో మాట్లాడుతూ ఆయన ఈ మేరకు వివరాలను వెల్లడించారు. వ్యవసాయానికి వినియోగించే విద్యుత్ కు ఛార్జీలను యూనిట్ చొప్పున వసూలు చేసే పరిస్థితి ఉండేదని... ఆ పరిస్థితి నుంచి శ్లాబ్ రేటుతో రైతులను ఆదుకున్నది టీడీపీ ప్రభుత్వమేనని చెప్పారు. 2014లో రాష్ట్రంలో 22.5 మిలియన్ యూనిట్ల కొరత ఉండేదని... 2014 డిసెంబర్ కు ఎక్కడా కరెంట్ కొరత లేకుండా చేశామని, 2018 నాటికి మిగులు విద్యుత్ ఉన్న రాష్ట్రంగా తీర్చిదిద్దామని తెలిపారు. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ ఇస్తున్నామని గర్వంగా చెపుతున్నానని అన్నారు. మీటర్ రీడింగ్ కోసం స్పాట్ బిల్లింగ్ తీసుకొచ్చామని తెలిపారు. తనను ప్రపంచబ్యాంకు జీతగాడు అని విమర్శలు చేశారని చెప్పారు.

**అంతర్జాతీయ అంశంగా పీపీఏల రద్దు**

విద్యుత్ మిగులు రాష్ట్రంగా ఉన్న ఏపీని.. వైకాపా ప్రభుత్వం లోటు పరిస్థితికి తీసుకెళ్లిందని చంద్రబాబు మండిపడ్డారు. పరిశ్రమలు కరెంట్ వాడితే సర్ఛార్జీ విధించిన ఘనత ఆ ప్రభుత్వానిదన్నారు. రాష్ట్రంలో తలసరి విద్యుత్ వినియోగం 23 శాతం మేర పెరిగిందని సీఎం చెప్పారు. సౌర, పవన విద్యుత్‌ను 7700 మెగావాట్లు మేర ఉత్పత్తి చేసిన మొదటి రాష్ట్రం ఏపీ అని చెప్పారు. 2019-24 మధ్య అసమర్ధ పాలనతో రాష్ట్రంలో మళ్లీ చీకటి రోజులు వచ్చాయన్నారు. ఆలోచన లేకుండా వైకాపా ప్రభుత్వం పీపీఏలను రద్దు చేసేసిందని.. ఆ విషయం అంతర్జాతీయ అంశంగా మారిపోయిందని గుర్తుచేశారు. దావోస్‌లోనూ దీనిపై చర్చ జరిగిందన్నారు. ఒక వ్యక్తి ఈగో కారణంగా రాష్ట్ర ఖజానా నుంచి రూ.9 వేల కోట్లు పీపీఏలకు చెల్లించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# యూనివర్సిటీల్లో తప్పు చేయాలంటేనే భయపడేలా చర్యలు

- అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఆంధ్రా విశ్వవిద్యాలయంలో అక్రమాలపై చర్చ
- వైసీపీ హయాంలో అనేక అక్రమాలు జరిగాయన్న టీడీపీ ఎమ్మెల్యేలు
- ఏయూలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపిస్తామన్న మంత్రి లోకేశ్



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో తప్పు చేయాలంటేనే భయపడేలా కూటమి ప్రభుత్వ చర్యలు ఉంటాయని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈరోజు అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఆంధ్రా విశ్వవిద్యాలయంలో అక్రమాలపై చర్చ జరిగింది. వైసీపీ హయాంలో అనేక అక్రమాలు జరిగాయని టీడీపీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్, గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ అంశంపై మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... ఆంధ్రా యూనివర్సిటీలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపిస్తామని అన్నారు. ఇన్‌ఛార్జ్ వీసీ ఇప్పటికే విచారణకు ఆదేశించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆ విచారణ నివేదిక

వివరాలు 2లో..

# నాగబాబు, బీద రవిచంద్ర సహా ఎమ్మెల్సీలుగా ఐదుగురు ఏకగ్రీవం

- టీడీపీ నుండి ముగ్గురు నామినేషన్లు
- బీజేపీ నుండి సోము వీర్రాజు, జనసేన నుండి నాగబాబు నామినేషన్లు
- ఏకగ్రీవమైనట్లు ప్రకటించిన రిటర్నింగ్ అధికారి



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు ఏక గ్రీవమయ్యాయి. ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఐదు నామినేషన్లు మాత్రమే దాఖలు కావడంతో ఏకగ్రీవ మైనట్లు

వివరాలు 2లో..

# జగన్ ను కలిసిన పిన్నెల్లికి చెందిన 400 కుటుంబాలు



- పిన్నెల్లిలో 400 వైసీపీ సానుభూతిపరుల కుటుంబాలపై గ్రామ బహిష్కరణ
- ఛలో పిన్నెల్లికి సిద్ధమవుతున్న వైసీపీ
- అందరికీ పార్టీ అండగా ఉంటుందన్న జగన్

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ ను గురజాల నియోజక వర్గం మాచవరం మండలం పిన్నెల్లి గ్రామస్తులు కలిశారు. గ్రామంలోని 400 సానుభూతిపరుల కుటుంబాలపై గ్రామ బహిష్కరణ వేటు వేశారు. ఇదే అంశంపై వైసీపీ హైకోర్టులో పోరాడుతోంది. ఛలో పిన్నెల్లి కార్యక్రమానికి వైసీపీ సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా పిన్నెల్లి గ్రామం వైసీపీ సానుభూతిపరులతో జగన్ మాట్లాడుతూ... పూర్తి న్యాయ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

వివరాలు 2లో..

# అమరావతి రైతులకు అండగా నిలిచా.. కేసులు పెట్టినా వెనకడుగు వేయలేదు



- బీఆర్ నాయుడుని సన్మానించిన అమరావతి రైతు ఐకాస
- ఉద్యమం సమయంలో చంద్రబాబు సూచనతో అమరావతి రైతులతో సమావేశమయ్యానన్న బీఆర్ నాయుడు
- అమరావతిలాంటి ఉద్యమాన్ని తాను ఇప్పటి వరకు చూడలేదని వ్యాఖ్య

వివరాలు 2లో..

# జగన్ ను భూబకాసురుడు అనడం కరెక్ట్ కాదు

- ప్రశ్నలకు ప్రభుత్వం నుంచి సరైన సమాధానాలు రావడం లేదన్న బొత్స
- తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపాటు
- అర్థంపర్థం లేని ఆరోపణలు చేస్తే తాము సమాధానాలు చెప్పలేమని వ్యాఖ్య



వివరాలు 2లో..

# రక్త ప్రవాహాన్ని తలపించేలా 'బ్లడ్ రెయిన్'...

## ఇరాన్ బీచ్‌లో టూరిస్టులు మస్త్

- ఇరాన్ బీచ్ లో 'బ్లడ్ రెయిన్'..
- రక్త ప్రవాహంలా సముద్రంలోకి చేరుతున్న వర్షపు నీరు
- ఎరుపు వర్ణంలోకి మారిన తీరప్రాంతం
- సోషల్ మీడియాలో వైరల్ గా మారిన వీడియో



పెన్ పవర్ డెస్క్:ఇరాన్ లోని రెయిన్ బో ఐలాండ్ లో రక్తంలా ఎర్రని రంగులో వర్షం కురిసింది. ఆకాశం నుంచి ధారగా కురుస్తున్న వర్షం అక్కడి కొండలపై చేరగానే ఎరుపు వర్ణంలోకి మారిపోతోంది. అది రక్తపు నీరులా ప్రవహించి సముద్రంలోకి చేరుతోంది. దీంతో బీచ్ మొత్తం ఎరుపు రంగులోకి మారి భయపెడుతోంది. ఏటా ఈ దృశ్యం చూసేందుకు లక్షలాదిగా పర్యాటకులు ఇరాన్ లో వాలిపోతుంటారు. తాజాగా కొంత మంది టూరిస్టులు రెయిన్ బో ఐలాండ్ లో వర్షాన్ని ఎంజాయ్ చేశారు. ఎరుపు రంగులో రక్తాన్ని తలపించేలా పారుతున్న వరద నీటిలో

వివరాలు 2లో..

# కోటరీలో ఉన్నదే మనం కదా..

## విజయసాయికి గుడివాడ అమర్ నాథ్ కౌంటర్

- విజయసాయిరెడ్డికి గుడివాడ అమర్ నాథ్ కౌంటర్
- జగన్ చుట్టూ ఉన్న కోటరీపై విజయసాయి విమర్శలు
- మొన్నటి దాకా కోటరీలో ఉండి... ఇప్పుడు కోటరీ గురించి మాట్లాడితే ఎలాగన్న అమర్ నాథ్
- విజయసాయి వ్యాఖ్యలను ప్రజలు హర్షిస్తారా? అని ప్రశ్న

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ చుట్టూ కోటరీ ఉంద ని... ఆ కోటరీ వల్లే తాను జగన్ కు దూరమయ్యానని మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి నిన్న వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. కోటరీని దూరం పెట్టకపోతే జగన్ కు భవిష్యత్తు ఉండదని అన్నారు. ఈ వ్యాఖ్యలపై వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ స్పందిస్తూ



వివరాలు 2లో..

# నాగం గారూ... ఎలా ఉన్నారు? ఆరోగ్యం ఎలా ఉంది?

## సీఎం చంద్రబాబు ఆత్మీయ పలకరింపు

- ఏపీ అసెంబ్లీలో చంద్రబాబును కలిసిన తెలంగాణ సీనియర్ నేత జనార్ధన్ రెడ్డి
- ఏపీలో వైఎస్ హయాంలో ఓబులాపురం గనుల దోపిడీపై టీడీపీ తరపున నాగం పోరాటం
- ఈ క్రమంలో ఆయనపై పలు కేసులు నమోదు
- ఆ కేసులను ఈరోజు కొట్టివేసిన విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టు
- కోర్టుకు హాజరైన తర్వాత చంద్రబాబును కలిసిన నాగం జనార్ధన్ రెడ్డి

పెన్ పవర్ డెస్క్:తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘ కాలం పనిచేసిన సీనియర్ నేత, మాజీ మంత్రి నాగం జనార్ధన్ రెడ్డి ఏపీ సీఎం చంద్ర బాబు నాయుడును అసెంబ్లీలో కలిశా రు. చాలాకాలం తరువాత తనను కలిసిన నాగంను సీఎం చంద్రబాబు



వివరాలు 2లో..

# ఎమ్మెల్సీలుగా విజయశాంతి, అద్దంకి దయాకర్, దాసోజు శ్రవణ్ ఏకగ్రీవం



పెన్ పవర్ డెస్క్:తెలంగాణలో ఎమ్మెల్యే కోటాలోని ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఐదు స్థానాలకు ఐదు నామినేషన్లు రావడంతో ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ నుండి ముగ్గురు, బీఆర్ఎస్ నుండి ఒకరు, సీపీఐ నుండి ఒకరు ఎమ్మెల్సీ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు.దీంతో, కాంగ్రెస్ అభ్యర్థులు

వివరాలు 2లో..

- ఐదు నామినేషన్లు రావడంతో ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ప్రకటన
- కాంగ్రెస్ నుండి ముగ్గురు, బీఆర్ఎస్, సీపీఐ నుండి ఒక్కొక్కరు చొప్పున ఏకగ్రీవం

# వైఎస్ వివేకా పీఏ పెట్టింది తప్పుడు కేసు

## పులివెందుల పోలీసులు

- వివేకా పీఏ కృష్ణారెడ్డి ఫిర్యాదుతో సునీత, రాజశేఖర్ రెడ్డి, రామ్ సింగ్ లపై కేసు నమోదు
- ఇది తప్పుడు కేసు అని తేలిందన్న పులివెందుల పోలీసులు
- జమ్మలమడుగు కోర్టులో చివరి ఛార్జ్ షీట్ ను దాఖలు చేసిన పులివెందుల డీఎస్పీ



పెన్ పవర్ డెస్క్:మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి పీఏ కృష్ణారెడ్డి పెట్టింది తప్పుడు కేసు అని పులివెందుల పోలీసులు నిర్ధారించారు. 2023 డిసెంబర్ 15న కృష్ణారెడ్డి ఫిర్యాదుతో వివేకా కుమార్తె సునీత, అల్లుడు

వివరాలు 2లో..

# కోటరీలో ఉన్నదే మనం కదా..

- మొదటి పేజీ తరువాయి

విజయసాయిపై సెటైర్లు వేశారు. వైసీపీలో ఉన్నప్పుడు ఢిల్లీలో ఆయన మాట్లాడిన మాటలకు... ఇప్పుడు విజయవాడలో మాట్లాడిన మాటలకు ఎక్కడా పొంతన లేదని విమర్శించారు. జగన్ చుట్టూ ఉన్న కోటరీ ప్రజలేనని చెప్పారు. అయినా ఏ పార్టీలో కోటరీ ఉండదో చెప్పండని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు చుట్టూ కోటరీ లేదా? అని అడిగారు. మొన్నటి వరకు కోటరీలో ఉన్న మనమే... ఇప్పుడు కోటరీ గురించి మాట్లాడితే ఎలాగని అన్నారు. ఒకరి మీద ప్రేమ పుట్టినప్పుడు.. మరొకరిపై ప్రేమ విరిగిపోతుందని చెప్పారు. ఇప్పుడు విజయసాయికి ఎవరి మీద ప్రేమ పుట్టిందో తెలియదని వ్యాఖ్యానించారు. పార్టీ మారిన వ్యక్తి నుంచి ఇంతకంటే ఏం ఆశిస్తామని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం మూడు వర్గాలు ఉన్నాయని... ఒకటి కూటమి వర్గం, రెండోది వైసీపీ వర్గం, మూడోది ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ వైపు చూసే వర్గం అని చెప్పారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కీలక పదవులను అనుభవించిన వాళ్లు

ఇప్పుడు పార్టీలు మారుతున్నారని విమర్శించారు. జగన్ అధికారంలోకి వచ్చి ఉంటే పార్టీ నుంచి వాళ్లు వెళ్లిపోయేవారా? అని ప్రశ్నించారు. విజయసాయి వ్యాఖ్యలను ప్రజలు హర్షిస్తారా? అని అడిగారు. ఆయన వ్యాఖ్యలను చూస్తుంటే మళ్లీ రాజకీయాల వైపు చూస్తున్నట్టు అనిపిస్తోందని చెప్పారు.

## ఎడిటర్ వ్యూ

### మారుతోన్న చైనా.... కాళ్ల బేరానికి

చైనా దేశం టోన్ మార్చింది. అంతర్జాతీయంగా భారత్‌కు పెరుగుతున్న పరపతి ఒకవైపు.. ప్రపంచంలో చైనా ఒంటరిగా మారుతుండటం మరోవైపు.. ఇక, ట్రంప్ చేసే టారిఫ్ వార్‌కి చైనా మార్కెట్లో ముచ్చెమటలు పడుతున్నాయి. భారత్‌లాగా దౌత్యం నేర్చుకోని డ్రాగన్ కంట్రీ.. పొగర్ని తగ్గించుకొని కలిసిపోదామనే పాట పాడుతోంది. ఆర్థికంగా భారత్ పరుగులుపెడుతుంటే.. అనుకున్న లక్ష్యాలు చేరుకోలేక చైనా నానాపాట్లు పడుతుంది. చిన్నా చితకా దేశాలకు అప్పులిచ్చి, వాళ్లను తన గుప్పెట్లోకి లాగాలనుకున్న డ్రాగన్ కంట్రీ.. అంతర్జాతీయంగా అభాసుపాలయ్యింది. స్వదేశంలో సవాలక్షా సమస్యలతో సతమతమవుతోంది. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లను నమ్ముకుంటే తీవ్రవాదం తప్ప తిరిగొచ్చేది ఏమీ లేదని అర్థమయ్యింది. ఇప్పుడు చైనాకున్న ఒకే ఒక్క దారి.. భారత్‌తో రాజీ పడటమే. అమెరికా వేసే టారిఫ్ బరువులు తట్టుకోవాలంటే.. భారత్ లాంటి భాగస్వామ్యం అత్యవసరం అయ్యింది. బ్రిక్స్ వేదిక ఎలాగూ ఉంది కాబట్టి భారత్‌తో బంధం పెంచుకోవాలని అనుకుంటుంది. చైనా-భారత్‌లు ఒకదానికి ఒకటి అతిపెద్ద పొరుగు దేశాలనీ.. రెండు దేశాలూ ఒకరి విజయానికి ఒకరు దోహదపడే విధంగా భాగస్వాములుగా ఉండాలని చైనా ఎల్లప్పుడూ నమ్ముతున్నట్లు చైనా విదేశాంగ మంత్రి వెల్లడించారు. అందుకే, డ్రాగన్-ఎలిఫాంట్‌లు కలిసి సహకారించుకోవాలని అన్నారు. అయితే, వాంగ్ కేవలం మంత్రి మాత్రమే కాదు, చైనాలో అతిపెద్ద, అధికార పార్టీ అయిన కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనాకు పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కూడా వాంగ్ ఉన్నారు. కాబట్టి, ఆయన మాట కచ్చితంగా చైనా అధ్యక్షుడి మాటతో సమానంగానే పరిగణించాల్సి ఉంటుంది. అందుకే, గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన దేశాలుగా ఉన్న భారత్-చైనాల సాంగత్యం స్ట్రాంగ్ అవ్వాలని కోరారు. ఇక, గ్లోబల్ సౌత్‌లో ఆధిపత్యం, అధికార రాజకీయాలు వంటివి లేకుండా ఇరు దేశాలు బాధ్యతగా వ్యవహరించాలని పిలునిచ్చారు. రెండు దేశాల చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలను కాపాడుకోవడమే కాకుండా అంతర్జాతీయ సంబంధాలను నియంత్రించే ప్రాథమిక నిబంధనలను కూడా నిలబెట్టాలని మంత్రి వాంగ్ ఆశించారు. చైనా-భారత్‌లు చేతులు కలిపితే.. అంతర్జాతీయ సంబంధాలలో గొప్ప ప్రజాస్వామ్యానికి ప్రాతినిధులుగా ఉంటామనీ.. గ్లోబల్ సౌత్‌ని బలంగా మార్చుకోడానికి అవకాశాలు బాగా మెరుగుపడతాయని అన్నారు. అయితే, చైనా మంత్రి వాంగ్ చెప్పిన మాటల్లో.. అభివృద్ధి చెందుతున్న రెండు అతిపెద్ద దేశాలుగా.. చైనా-భారత్‌లు ఒకరినొకరు తగ్గించుకునే బదులు ఒకరినొకరు సహకరించుకుందామనే ధోరణి కనిపిస్తోంది. అలాగే, ఒకరినొకరు రక్షించుకోవడానికి బదులుగా ఒకరితో ఒకరు కలిసి పనిచేయాలనే అభిప్రాయం ఉంది. చైనా తన అవసరం కోసం ఎంత ఆత్రుత పడుతుందంటే.. ఇటీవల వరకూ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలకు కారణమైన సరిహద్దు వివాదాలను ద్వైపాక్షిక సంబంధాలతో ముడిపెట్టొద్దని కోరుతోంది. ఇలాంటి చిన్న చిన్న అంశాలు రెండు దేశాల మధ్య దౌత్యాన్ని మొత్తంగా ప్రభావితం చేయకూడదని అంటోంది. ఈ క్రమంలో.. భారత్-చైనాలు రెండూ పురాతన నాగరికతలని చెబుతూ చారిత్రక సారుప్యతను కూడా తెరమీదకు తీసుకొస్తుంది. అందుకే, న్యాయమైన పరిష్కారం కోసం సరిహద్దు ప్రాంతాల్లో శాంతిని కొనసాగించడానికి రెండు దేశాలకు తగినంత జ్ఞానం, సామర్థ్యం ఉన్నాయంటూ చైనా మైత్రి మంత్రం చదువుతోంది.

తూర్పు లడఖ్‌లో సైనిక విరమణ ప్రక్రియను పూర్తి చేయడానికి రెండు దేశాలు ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయి. అయితే, ముందుగా భారత్ దీనిపై స్పందించింది. చైనాతో సంబంధాలను నార్మలైజ్ చేయడం కోసం జాగ్రత్తగా నడవాలని కోరుకుంది. అలాగే, ఇటీవల, చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌తో జరిగిన సమావేశంలో, భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఇందులో, ఇరుదేశాల మధ్య సంబంధాల్లో పరస్పర విశ్వాసాన్ని పునరుద్ధరించాలనీ.. సరిహద్దు శాంతిని సంయుక్తంగా నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. అమెరికాకు చైనాకు మధ్య టారిఫ్‌ల చిచ్చు రాజుకుంది. దీనితో, అమెరికా, చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు పెరిగాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనా వస్తువులపై 20% సుంకాన్ని విధిస్తున్నట్లు ప్రకటించారు. దీనికి ప్రతిస్పందనగా చైనా.. అమెరికా దిగుమతులపై ప్రతి-సుంకాలను విధించింది. ఈ చర్య ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య యుద్ధానికి కారణం అయ్యింది. అమెరికా సుంకాలు ప్రపంచ వాణిజ్య సంస్థ నియమాలను ఉల్లంఘిస్తున్నాయని చైనా ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆరోపించింది. అమెరికా-చైనాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నప్పటికీ, పరిష్కారం కోసం ప్రయత్నాలు కూడా చేస్తున్నారు. రాబోయే రోజుల్లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ప్రెసిడెంట్ ట్రంప్ మాట్లాడే అవకాశం ఉంది. ఇద్దరు నాయకులు ఇద్దరికీ ప్రయోజనం చేకూరే ఒప్పందంపై చర్చలు జరపుతారనే అంచాలు ఉన్నాయి. ఇవి వాణిజ్య ఉద్రిక్తతలను తగ్గించగలవని, ఆర్థిక అంతరాయాలను నివారించవచ్చని భావిస్తున్నారు. అయితే, ఈ వాణిజ్య యుద్ధం ప్రభావం అంతకుమించింది. అందుకే.. ట్రంప్ టారిఫ్‌లపై మండిపడిన చైనా.. “అమెరికా యుద్ధం కోరుకుంటే అది టారిఫ్ వార్ అయినా, ట్రేడ్ వార్ అయినా, లేదా మరే ఇతర యుద్ధమైనా.. మేము తుది వరకు పోరాడేందుకు సిద్ధం” అని చైనా రాయబార కార్యాలయం తేల్చి చెప్పింది. రెండు దేశాలు ఆర్థిక నష్టాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అమెరికా దిగుమతులపై చైనా విధించే సుంకాలు.. అమెరికన్ వ్యాపారాలు, వినియోగదారులను ప్రభావితం చేసే అవకాశం ఉంది. అయితే, చైనా వస్తువులపై అమెరికా విధించే సుంకాలు వల్ల ధరలు పెరిగి, డిమాండ్ తగ్గడానికి దారితీయవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. కాబట్టి, ఈ పరిస్థితుల్లో చైనాకు మరో అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న భారత్ సహకారాన్ని డ్రాగన్ కంట్రీ కోరకుంటుంది. అమెరికా, చైనాల మధ్య టారిఫ్ వార్ నడిచినప్పుడు భారత్ భారీగా లాభపడింది. ట్రంప్ మొదటి పదవీ కాలంలో చైనాపై సుంకాలు పెంచిన తర్వాత? భారత్ నుండి అమెరికాకు ఎగుమతులు పెరిగాయి. ఆ సమయంలో అమెరికాకు ఎగుమతులు చేసే దేశాల్లో భారత్ నాలుగో అతిపెద్ద లబ్దీదారుగా నిలిచింది. అలాగే, ప్రస్తుతం చైనా దిగుమతులపై అమెరికా భారీగా సుంకాలు విధించడంతో మరోసారి యూఎస్ ప్రత్నమ్నాయ సరఫరాదారుల కోసం చూస్తుంది. భారత్‌పై కూడా ట్రంప్ పరస్పర సుంకాలు విధించడం.. ఏప్రిల్ నుండి అవి అమల్లోకి వస్తుండగా.. భారత్ తెలివైన స్టెప్ తీసుకుంది. అమెరికా, భారత్ మధ్య ఫ్రీ ట్రేడ్‌ను తీసుకొచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. అంటే, ఇరు దేశాల మధ్య వాణిజ్యంలో సుంకాలు నామమాత్రంగా ఉంటాయి. దీనితో ఇప్పుడు ట్రంప్ కూడా భారత్ వైపు మొగ్గారు. ఈ పరిణామంతో భారత్ అమెరికా వాణిజ్య సంబంధాలు మరింత మెరుగ్గా నడుస్తాయి. ఇది కచ్చితంగా చైనా ఆర్థిక వ్యవస్థకు నష్టమనే చెప్పాలి. ప్రస్తుతం ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయంతో ప్రపంచ వాణిజ్య వ్యవస్థపై భారీ ప్రభావం పడే అవకాశం ఉంది. అలాగే, అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం మళ్లీ మొదలైతే.. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన ఈ రెండు దేశాలపైనే కాకుండా, ప్రపంచ దేశాలపైనా తీవ్ర ప్రభావం పడనుంది. ఈ తరుణంలో.. చైనా భారత్‌ను మచ్చిక చేసుకునే ప్రయత్నం చేస్తోంది. అమెరికాతో చెడినప్పటికీ.. భారత్‌తో వాణిజ్యాన్ని నడిపే విధంగా వ్యూహాలు రచిస్తోంది. ఎందుకంటే, భారతదేశంలో చైనా యాప్‌లు నిషేధానికి గురైనప్పటికీ.. సరిహద్దుల్లో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు వచ్చినప్పటికీ.. భారత్, చైనా మధ్య వాణిజ్యం లాభసాటిగానే సాగింది. ఇటీవల భారతదేశంతో చైనా ద్వైపాక్షిక వాణిజ్య గణాంకాలను చూస్తే.. 2021 నుండి 2022 వరకు, సుమారు $130 బిలియన్ల వాణిజ్యం జరిగింది. ఇది మునుపటి ఆర్థిక సంవత్సరం కంటే 44 శాతం ఎక్కువ. అలాగే, చైనాకు భారతదేశం ఎగుమతులు కూడా 202-21లో ఉన్న $17.51 బిలియన్లతో పోల్చుకుంటే.. 2021-22 నాటికి $26.46 బిలియన్లుగా పెరిగాయి. ఇక, ఒక దేశం ఎగుమతి ప్రధాన దేశంగా ఉండాలంటే.. అది దిగుమతి ప్రధాన దేశంగా కూడా ఉండాలి. దాని ధర కారణంగా చైనా భారతదేశానికి అత్యంత ముఖ్యమైన దిగుమతి వనరు. కాబట్టి, చైనాకు భారత్ అవసరం ఉంది. మరి, చైనా కొత్త బాణీ ఈ బంధాన్ని ఎక్కడ వరకూ తీసుకెళ్తుందో.. ఎప్పటిలాగే, మధ్యలో వదిలేస్తుందో చూడాలి.

# జగన్ ను భూబకాసురుడు అనడం కరెక్ట్ కాదు

**పెన్ పవర్ డెస్క్:**ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వం నుంచి సరైన సమాధానాలు రావడం లేదని శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. 2014 నుంచి జరిగిన స్కామ్‌లపై మాట్లాడాలని తాము అడిగామని... అమరావతి భూములు, స్కిల్ డెవలప్ మెంట్ స్కామ్, అగ్రిగోల్డ్ దందాలు అన్నింటిపై విచారణ జరపాలని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ ను భూబకాసురుడు అని అనడం సరికాదని చెప్పారు. నిరాధార ఆధారాలు చేయడం సరికాదని అన్నారు. కూటమి ప్రభుత్వానికి దశ, దిశ లేదని బొత్స విమర్శించారు. తమపై వచ్చిన ఆరోపణలను తాము ఖండించలేదని... మీ దగ్గర ఆధారాలు ఉంటే చూపించాలని కోరుతున్నామని చెప్పారు. సభలో లేని వ్యక్తి గురించి మాట్లాడటం కరెక్ట్ కాదని అన్నారు. అమరావతిలో జరిగింది భూకుంభకోణమని ఆరోపించారు. ఏ అంశంపై చర్చ జరిగినా సమాధానం చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అర్థంపర్థం లేని ఆరోపణలు చేస్తే తాము సమాధానాలు చెప్పలేమని అన్నారు.

# వైఎస్ వివేకా పీఏ పెట్టింది తప్పుడు కేసు

- మొదటి పేజీ తరువాయి

రాజశేఖర్ రెడ్డి, సీబీఐ ఎస్పీ రామ్ సింగ్ లపై అప్పటి పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ఆ ముగ్గురిపై పెట్టిన కేసు తప్పుడు కేసు అని విచారణలో తేలిందని పులివెందుల పోలీసులు తాజాగా వెల్లడించారు. ఈ మేరకు జమ్మలమడుగు కోర్టులో చివరి ఛార్జ్ షీట్ ను పులివెందుల డీఎస్పీ దాఖలు చేశారు. పులివెందుల మేజిస్ట్రేట్ సెలవులో ఉన్నందున ఛార్జ్ షీట్ ను జమ్మలమడుగు కోర్టులో సమర్పించారు. ఈ కేసులో 23 మంది సాక్షులను విచారించినట్టు ఛార్జ్ షీట్ లో పోలీసులు పేర్కొన్నారు.

# జగన్ ను కలిసిన పిన్నెల్లికి చెందిన 400 కుటుంబాలు

- మొదటి పేజీ తరువాయి

గ్రామంలోకి వస్తే చంపేస్తామని కూటమి నేతలు బెదిరిస్తున్నారని జగన్ కు వారు చెప్పారు. మీ అందరికీ పార్టీ అండగా ఉంటుందని జగన్ అన్నారు. గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేశ్ ఆధ్వర్యంలో పిన్నెల్లి గ్రామస్తులు జగన్ ను కలిశారు. చెన్నాయపాలెం, మాదెనపాడు, తురకపాలెం గ్రామాలకు చెందిన మరికొందరు కూడా జగన్ ను కలిశారు.

# అమరావతి రైతులకు అండగా నిలిచా.. కేసులు పెట్టినా వెనకడుగు వేయలేదు

**పెన్ పవర్ డెస్క్:**అమరావతి రైతులను గత వైసీపీ ప్రభుత్వం ఎన్నో విధాలుగా హింసించిందని టీటీడీ ఛైర్మన్, టీవీ5 ఛానల్ అధినేత బీఆర్ నాయుడు అన్నారు. వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల ప్రకటన చేసిన తర్వాత అమరావతి రైతులకు మద్దతుగా ఉండాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. రైతు బిడ్డగా అమరావతి రైతులకు అండగా నిలిచానని... కేసులు పెట్టినా వెనకడుగు వేయలేదని చెప్పారు. బీఆర్ నాయుడుకి వెలగపూడిలో రాజధాని రైతు ఐకాస ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు సూచన మేరకు అమరావతి రైతులతో తాను సమావేశమయ్యానని బీఆర్ నాయుడు తెలిపారు. విజయవాడ, రాజమండ్రిలో అమరావతి రైతులు, మహిళల పాదయాత్రలో పాల్గొన్నానని చెప్పారు. అమరావతిలాంటి ఉద్యమాన్ని తాను ఇప్పటి వరకు చూడలేదని అన్నారు. రాజధాని రైతులు, మహిళల కన్నీరులో వైసీపీ కొట్టుకుపోయిందని

చెప్పారు. అమరావతి ఉద్యమం విజయవంతం అయినందున ఈ నెల 15న శ్రీనివాసుడి కల్యాణం నిర్వహిస్తున్నామని... ఆ కార్యక్రమంలో అమరావతి రైతులందరూ పాల్గొన్నారని కోరారు.

# యూనివర్సిటీల్లో తప్పు చేయాలంటేనే భయపడేలా చర్యలు

- మొదటి పేజీ తరువాయి

అందిన వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ.. గతంలో ఏయూ వీసీగా పనిచేసిన ప్రసాదరెడ్డి వైసీపీ అధ్యక్షుడి తరహాలో వ్యవహరించారని మండిపడ్డారు. ఎంతో పేరున్న ఆంధ్రా విశ్వవిద్యాలయాన్ని రాజకీయ వేదికగా ఆయన మార్చేశారని ఆరోపించారు. ఏపీలోని ఇతర వర్సిటీల ప్రక్షాళన కూడా జరగాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. ఏయూ విషయంలో నిర్దిష్ట కాలంలో విచారణ జరగాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు.

# రక్త ప్రవాహాన్ని తలపించేలా ‘బ్లడ్ రెయిన్’...

- మొదటి పేజీ తరువాయి

గంతులు వేశారు. సముద్ర తీరంలోని గుట్టలపై పడిన వర్షం జలపాతంలా కిందకు దూకుతుంటే కేరింతలు కొట్టారు. ఈ ఎర్రని ప్రవాహాన్ని ఓ నెటిజన్ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దీంతో ఈ వీడియో వైరల్ గా మారింది. పకృతిలోని వింతలకు ఇదొక ఉదాహరణ అని, ఉన్నఫళంగా అక్కడికి చేరాలని ఉందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. రెయిన్ బో ఐలాండ్ ప్రాంతంలో చాలా ఏళ్ల క్రితం ఓ అగ్ని పర్వతం ఉండేదని, దాని నుంచి వెలువడిన లావా చల్లారి ఈ దీవి ఏర్పడిందని ఇరాన్ చరిత్రకారులు చెబుతున్నారు. అక్కడి మట్టిలో ఐరన్ ఆక్సైడ్ కంటెంట్ చాలా అధిక మోతాదులో ఉంటుందని, వర్షపు నీరు రక్త వర్ణంలోకి మారడానికి కారణం ఇదేనని వివరణ ఇచ్చారు. ఈ అరుదైన దృశ్యాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు రెయిన్ బో ఐలాండ్ కు వస్తుంటారని చెప్పారు.

# నాగబాబు, బీద రవిచంద్ర సహా ఎమ్మెల్సీలుగా ఐదుగురు ఏకగ్రీవం

- మొదటి పేజీ తరువాయి

ఎన్నికల అధికారి ప్రకటించారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ఈరోజు సాయంత్రంతో ముగిసింది. టీడీపీ నుండి ముగ్గురు, జనసేన, బీజేపీ నుండి ఒక్కొక్కరు చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. ఏకగ్రీవం కావడంతో జనసేన తరఫున నామినేషన్ దాఖలు చేసిన కొణిదెల నాగేంద్రరావు (నాగబాబు), బీద రవిచంద్ర (టీడీపీ), బి తిరుమల నాయుడు (టీడీపీ), కావలి గ్రీష్మ (టీడీపీ), సోము వీర్రాజు (బీజేపీ) ఏకగ్రీవమైనట్లు రిటర్నింగ్ అధికారి ఆర్ వనితారావు వెల్లడించారు. అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు.

# నాగం గారూ... ఎలా ఉన్నారు? ఆరోగ్యం ఎలా ఉంది?

- మొదటి పేజీ తరువాయి

ఆప్యాయంగా పలకరించారు. నాగం గారూ... ఎలా ఉన్నారు... ఆరోగ్యం ఎలా ఉంది... చాలా రోజులు అయ్యింది కలిసి అంటూ ఆత్మీయంగా పలకరించారు. పిల్లలు ఏం చేస్తున్నారు అని ఆరా తీశారు. నాగం కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్న చంద్రబాబు... ఆరోగ్యం కాపాడుకోవాలని ఆయనకు సూచించారు. ఓబులాపురం మైనింగ్ అంశంలో ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం నేతలు చేసిన ఉద్యమాలపై నాడు కేసులు నమోదు అయ్యాయి. ఆ కేసుల విచారణలో భాగంగా విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టుకు నాగం జనార్థన్ రెడ్డి గురువారం హాజరయ్యారు. ఆనాటి కేసులను ఎట్టకేలకు కొట్టివేయడంపై చంద్రబాబు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా జనార్థన్ రెడ్డి అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

భేటీ సందర్భంగా ఇరువురు నేతలు పలు పాత ఘటనలను గుర్తుచేసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నాడు చేసిన ప్రజా పోరాటాల గురించి చర్చించుకున్నారు. నాగం ఫైర్ బ్రాండ్‌గా ఉండేవారని...

పార్టీ ఆదేశిస్తే దూసుకుపోయేవాళ్లని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఎంతో ఎమోషన్‌గా ఉండేవారంటూ నాటి ఘటనలను ప్రస్తావించారు. నాలుగవసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబును చూడడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని నాగం వ్యాఖ్యానించారు. రెండు తెలుగు రాష్ట్రాలు బాగుండాలి... తెలుగు ప్రజలు అన్ని రంగాల్లో విజయాలు సాధించాలనేదే తన అభిమతమని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

# మంత్రి పదవి ఇవ్వడం రేవంత్ రెడ్డి చేతిలో లేదు.. ఢిల్లీ నుండి ఆదేశాలు రావాలి: మల్‌రెడ్డి రంగారెడ్డి

### మంత్రి పదవులు నిర్ణయించేది రేవంత్ రెడ్డి కాదన్న రంగారెడ్డి

### తనకు మంత్రి పదవి ఇవ్వాలని రేవంత్ రెడ్డికి ఉన్నా ఇవ్వలేకపోతున్నాడని వ్యాఖ్య

### విజయశాంతి ఢిల్లీకి వెళ్లి ఎమ్మెల్సీ పదవి తెచ్చుకున్నారని ఆరోపణ




తనకు మంత్రి పదవి ఇవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉన్నప్పటికీ ఆయన చేతిలో ఏమీ లేదని, ఢిల్లీ నుండి ఆదేశాలు రావాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవులు నిర్ణయించేది రేవంత్ రెడ్డి కాదని, పార్టీ అధిష్ఠానం ఢిల్లీలో నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించారు. తనకు మంత్రి పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రికి ఉందని, కానీ ఇవ్వలేకపోతున్నాడని అన్నారు. విజయశాంతి ఢిల్లీకి వెళ్లి ఎమ్మెల్సీ పదవిని తెచ్చుకున్నారని ఆరోపించారు. సుమారు రెండు వారాల క్రితం కూడా ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుండి కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచింది తాను ఒక్కడినేనని, కాబట్టి తనకు కచ్చితంగా మంత్రి పదవి ఇవ్వాలని వ్యాఖ్యానించారు. తనకు మంత్రి పదవి ఇవ్వకుంటే వచ్చే ఎన్నికలలో వేరే పార్టీ వాళ్లను నేనే గెలిపిస్తానని వ్యాఖ్యానించారు.

# ఎమ్మెల్సీలుగా విజయశాంతి, అద్దంకి దయాకర్, దాసోజు శ్రవణ్ ఏకగ్రీవం

- మొదటి పేజీ తరువాయి

విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, బీఆర్ఎస్ అభ్యర్థి దాసోజు శ్రవణ్, సీపీఐ అభ్యర్థి నెల్లికంటి సత్యం ఎమ్మెల్సీలుగా ఎన్నికైనట్లు ప్రకటించారు. వీరితో పాటు ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినప్పటికీ, నిబంధనల మేరకు లేవంటూ రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు నేటి సాయంత్రం

ఐదు గంటలకు ముగిసింది. గడువు ముగిసేవరకు ఐదు నామినేషన్లు మాత్రమే రావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు.

# అడ్డే లేని ఆక్రమణలు, ప్రభుత్వ భూమి అయితే మాకేమీ అంటున్న అక్రమార్కులు

## ప్రభుత్వ భూమిని అమ్మడానికి వారెవరు కొనడానికి వీరెవరు అంటున్న గ్రామస్తులు

**పామూరు,పెన్ పవర్,మార్చి 13**

పట్టణానికి కూత వేటు దూరంలోని మోట్రావులపాడు రెవెన్యూ పరిధిలో 91 సెంట్ల ప్రభుత్వ ఏ డబ్ల్యు ల్యాండ్ ను ప్రైవేటు వ్యక్తి ఆక్రమించుకునేందుకు కూలీలతో ఫెన్సింగ్ వేపించడం జరిగింది. అడ్డుకోవలసిన రెవెన్యూ సిబ్బంది చోద్యం చూస్తూ అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. సర్వేనెంబర్ 167/3 లో 91 సెంట్ల ప్రభుత్వ అనాధీన భూమి ఉంది. ప్రభుత్వ భూమిని కాపాడి ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించుకోవాలని గ్రామస్తులు కోరుతున్న అధికారులు మాత్రం అలసత్వం వీడడం లేదు. దీంతో ఆక్రమణదారుడు ఫెన్సింగ్ పనులు వేగంగా పూర్తి చేశాడు. సర్వే నెంబర్ లో మొత్తం 4 ఎకరాల భూమి ఉండగా 3 ఎకరాల 10 సెంట్లు కోర్టు వ్యవహారంలో ఉన్నది. మిగిలిన 90 సెంట్ల ప్రభుత్వ భూమిలో ఫెన్సింగ్ వేస్తున్నాడని గ్రామస్తులు రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పెన్ పవర్
ప్రకాశం

## తప్పుడు తూకాలతో రైతులకు

# కుచ్చుటోపి పెడుతున్న వ్యాపారి

మోసాలకు పాల్పడుతున్న రౌతు పల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే వ్యాపారి.

ఎలక్ట్రానిక్ కాటాలో సాంకేతిక పరిజ్ఞానంతో మోసానికి పాల్పడుతున్న వ్యాపారి.

రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేసిన మార్కాపురం తూనికల కొలతల అధికారులు.

తీవ్రంగా నష్టపోయి లబోదిబోమంటున్న రైతాంగం.

రైతులను మోసగిస్తున్న వ్యాపారిపై కేసు నమోదు?





**కొమరోలు పెన్ పవర్ మార్చి 13**

ఆరుగాలం ఇంటిల్లిపాది కష్టపడి భారీ పెట్టుబడులతో పండించిన పంటను ఒక వ్యాపారి మోసపు తూకాలతో రైతులకు కుచ్చుటోపి పెడుతూ అధికారులకు చిక్కిన సంఘటన కొమరోలు మండలం పొట్టి రెడ్డి పల్లె లో జరిగింది. కొమరోలు మండలం రౌతు పల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే వ్యాపారి గత దశాబ్ద కాలంగా రైతుల నుంచి పలు రకాల ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ వ్యాపారం సాగిస్తున్నాడు. ఆ మేరకు వ్యాపారి సత్యనారాయణ రౌతు పల్లి, రాజుపాలెం, వెన్నంపల్లె, ముక్తాపురం, బసువు పల్లె, వెంకటాపురం, ద్వారక చర్ల ,పొట్టి రెడ్డి పల్లె పొట్టి రెడ్డి పల్లె తో పాటు కొమరోలు ,గిద్దలూరు మండలాలలోని పలు గ్రామాలలో రైతుల నుంచి పలు రకాల ధాన్యం సేకరిస్తూ ఉన్నాడు. స్థానికుడైనందువల్ల రైతులు కూడా సత్యనారాయణకే ప్రాధాన్యత ఇస్తూ తాము పండించిన అన్ని రకాల ధాన్యం పంటలను అతనికే విక్రయించేవారు. రైతుల అమాయకత్వాన్ని తనపై ఉన్న అపార నమ్మకాన్ని సొమ్ము చేసుకోదలచిన ఆ వ్యాపారి తప్పుడు తూకాలతో రైతులను మోసగిస్తున్నట్లుగా తూనికలు కొలతల శాఖ అధికారుల తనిఖీలు వెల్లడయింది. ఇటీవల దాదాపు అన్ని గ్రామాలలో పప్పు సెనగ పంట చేతికి వచ్చింది దీనితో రైతులు కల్లాలలో నూర్పి చేసుకుని అపరాలను సత్యనారాయణకు విక్రయిస్తూ వచ్చారు అయితే కొమరోలు మండలం పుట్టి రెడ్డి పల్లి గ్రామంలో పప్పు సెనగ పంటను కొనుగోలు చేసేందుకు సత్యనారాయణ ఆ గ్రామానికి వెళ్ళాడు ఆ మేరకు రైతులు అతనికి అపరాల బస్తాలను అప్పగించారు వాటిని తన దగ్గర ఉన్న 100 కిలోల బరువు తూగే ఎలక్ట్రానిక్ కాట ద్వారా కాటా వేశాడు అయితే కొందరు రైతులకు అనుమానం వచ్చి అతని తెలియకుండా ముందుగా కాటా వేసిన ఒక బస్తాలు మరో ఎలక్ట్రానిక్ కాటా పై ఉంచి తూకం వేశారు దీనితో 70 కిలోలకు దాదాపు పది కిలోల మేర తరుగుదల గుర్తించారు వెంటనే మార్కాపురం తూనికలు కొలతల అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు అయితే రైతులు చేసిన ఫిర్యాదు వ్యాపారికి తెలియకపోవటంతో తన వ్యాపారాన్ని కొనసాగిస్తూ ఉన్నాడు ఈలోగా మార్కాపురం నుంచి వచ్చిన తూనికల కొలతలు ఇన్స్పెక్టర్ సిబ్బంది వ్యాపారి సత్యనారాయణ వద్ద గల ఎలక్ట్రానిక్ కాటాను తెరిచి పరిశీలించారు అందులో సాంకేతిక పరిజ్ఞానంతో మార్పులు చేసినట్లుగా గుర్తించారు ఆ మేరకు సత్యనారాయణ పై కేసు నమోదు చేసినట్లుగా రైతులు తెలిపారు ఆరుగాలం కష్టపడి భారీ పెట్టుబడులతో పండించిన పంట కొనుగోలులో మోసాలు చేస్తూ తమను నట్టేట ముంచుతున్న సత్యనారాయణ పై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు ఎంతో నమ్మకంగా ఉంటూ తమను మోసం చేయటం ఏమిటని రైతులు ప్రశ్నించారు.



## పెన్ పవర్ కదనానికి

# స్పందించిన అధికారులు

ఏమిటి ..మా సమస్య తీర్చలేరా..!

ఓవర్ హెడ్ ట్యాంక్ నుండి లీకేజ్ వాటర్ పరిష్కారం.

వాటర్ ట్యాంకుల నిర్వహణ పై దృష్టి .

వృధా నీరు అంగన్వాడి కేంద్రం స్థానిక గృహాల చుట్టూ చేరకుండా పరిష్కారం .

స్వచ్ఛభారత్ పై ప్రత్యేక దృష్టి .

ఈ ఓ ఆర్ డి విజయలక్ష్మి.






**పెన్ పవర్, కంభం మార్చి 13:**

ఓవర్ హెడ్ ట్యాంక్ లో నుంచి ఇళ్లలోకి సరఫరా అయ్యే నీరు సురక్షితమేనా.? ఇటీవల పెన్ పవర్ లో ప్రచురితమైన వార్తకు ఈ ఓ ఆర్ డి విజయలక్ష్మి సర్పంచ్ పల్నాటి బోదయ్య కంభం ఈవో పి . రమేష్ రెడ్డి గురువారం సమస్యను ఎట్టికేలకు కొంతమేర పరిష్కారం చేశారు. దీంతో అక్కడున్న అంగన్వాడి కేంద్రం వారు సమీప గృహాల వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆలనా పాలన లేక ట్యాంక్ నుంచి వచ్చే వృధా నీరు చుట్టుపక్కల లీకేజీ కావడంతో కొంతమేర పరిష్కరించారు. వాటర్ ట్యాంక్ సమీపంలో అంగన్వాడి కేంద్రం పరిసర నివాస గృహాలు ఉన్నాయి కాలు పెట్టాలంటే చిన్నపిల్లల నుండి పెద్దల వరకు భయపడుతున్నారు. ప్రస్తుతం ఆ సమస్య పరిష్కారమైంది. కంభం అర్బన్ కాలనీ నీటి సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంక్ సమీపంలో మురికి మయంగా మారిపోయింది. గురువారం అధికారులు స్పందించి ఎటికేలకు పరిష్కారం చేశారు. అంగన్వాడి కేంద్రానికి నిత్యం చిన్నపిల్లల నుండి గర్భిణీ స్త్రీలు వెళ్లాల్సింది చుట్టూ బురదమయం కావడంతో కేంద్రంలోకి కాలు పెట్టాలంటే భయపడుతున్నారు. కొంతమేర ఆ సమస్య పరిష్కారం కావడం ఊపిరి పీల్చుకున్నారు . సమీపంలోని ఒక గోడను కూడా కూల్చివేసి పరిష్కారం చేశారు. పరిసరాలపరి శుభ్రత పై దృష్టి పెట్టారు. క్రమం తప్పకుండా వాటర్ ట్యాంకు లను శుభ్రం చేసి నీరు అందిస్తామని తెలిపారు. పంచాయితీ అధికారులు స్పందించి వాటర్ ట్యాంక్ చుట్టూ చేరిన మురికి నీరు శుభ్రం చేయడం జరిగింది. అధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కారం చేసినందుకు ఆ ప్రాంత వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.





## భూ అక్రమాల కేసులను విచారణ

# వేగవంతం చేయాలి -జిల్లా కలెక్టర్ ఆదేశం



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 13**

భూఅక్రమాలపై నమోదైన కేసుల విచారణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్లో జిల్లా కలెక్టరు ఏ. తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టరు ఆర్.గోపాలకృష్ణ, అడిషనల్ ఎస్పీ నాగేశ్వర రావు లతో కలసి భూఅక్రమాలపై నమోదైన కేసుల విచారణ పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూఅక్రమాలపై నమోదైన కేసుల విచారణ వేగవంత చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. కేసులకు సంబంధించి అవసరమైన డాక్యుమెంట్స్ ను సంబంధిత రెవెన్యూ, మునిసిపల్, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సత్వరమే విచారణ అధికారులకు అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ ఏ. బాలంజనేయులు, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మి ప్రసన్న, ఒంగోలు డిఎస్పీ రాయపాటి. శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వర రావు, పలువురు సిఐ లు, తహసీల్దార్ వాసు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పది పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ఏర్పాటు సిద్ధం

**కొమరోలు మండలంలో మూడు పరీక్ష కేంద్రాల ఏర్పాటుకు చర్యలు -ప్రభుత్వ హైస్కూలు, సర్వైట్ హై స్కూల్ ,నరేష్ రెడ్డి హై స్కూల్ లలో కేంద్రాలు ఏర్పాటు.**

**మూడు కేంద్రాలలో పబ్లిక్ పరీక్షలు రాయనున్న 550 మంది విద్యార్థులు. -వివరాలు వెల్లడించిన కొమరోలు ఎంఈఓ 2 బొర్రా వెంకటరత్నం.**

**కొమరోలు పెన్ పవర్ మార్చి 13**

ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు కొమరోలు మండలంలో పరీక్ష కేంద్రాల ఏర్పాటు చేశామని కొమరోలు ఎంఈఓ 2 బొర్రా వెంకటరత్నం తెలిపారు .కొమరోలు మండలంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఎయి డెడ్ హై స్కూల్ల తో పాటు రాజుపాలెం లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మొత్తం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 550 మంది ఉన్నారని ఆయన చెప్పారు .వారు ఈ నెల 17వ తేదీ నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసేందుకు వీలుగా కొమరోలు లో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కొమరోలు ప్రభుత్వ హైస్కూల్లో ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసి, అందులో 175 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సౌకర్యం కల్పిస్తున్నట్లుగా ఆయన చెప్పారు. కొమరోలులోని సర్వైట్ హైస్కూల్లో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఆ కేంద్రంలో 175 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాటు చేశామని, అలాగే కొమరోలు లోని నరేష్ రెడ్డి హైస్కూల్లో ఇంకొక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు .ఆ పరీక్షా కేంద్రంలో వంద మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లుగా ఆయన పేర్కొన్నారు .కొమరోలు ప్రభుత్వ హైస్కూల్లో ఏర్పాటు చేసిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరిండెంట్ గా ఎం వెంకటాచారి, నీ ,డిపార్టుమెంటు అధికారిగా త్యాగరాజును ,జిల్లా విద్యాశాఖ అధికారి నియమించారని, అలాగే సర్వైట్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరిండెండెంట్ గా ఎస్కే అహ్మద్ ను, డిపార్ట్మెంట్ అధికారిగా బి జనార్దన్ రాజును నియమించారని, నరేష్ రెడ్డి హైస్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపర్డెంట్ గా బి అనురాధను, డిపార్టుమెంటు అధికారిగా యు శ్రీనివాసులను జిల్లా విద్యాశాఖ అధికారి నియమించారని ఆయన చెప్పారు. అదే విధంగా మూడు పరీక్ష కేంద్రాలకు త్వరలో ఇన్విజి లెటర్లను కూడా నియమిస్తారని ఆయన వివరించారు .పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు అవసరమని ఏర్పాట్లు చేస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. సీసీ కెమెరాలు పర్యవేక్షణలో ,పరీక్షా కేంద్రాల వెలుపల గట్టి పోలీసు బందోబస్తు తో పరీక్షలు నిర్వహించనున్నట్లుగా వెంకటరత్నం చెప్పారు. పదవ తరగతి విద్యార్థులకు ఇప్పటికే ఆయా పాఠశాలల్లో హాల్ టికెట్లు కూడా జారీ చేశారని,కావున విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఎలాంటి మానసిక ఆందోళన లేకుండా, ప్రశాంత



వాతావరణంలో పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించి, తల్లిదండ్రులకు ,పాఠశాలకు, కొమరోలు మండలానికి మంచి పేరు ప్రఖ్యాతలు సాధించి పెట్టాలని ఎంఈఓ 2 వెంకటరత్నం విద్యార్థులను కోరారు.

# మొల్ల జీవితం.. అందరికి ఆదర్శనీయం ..



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 13**

గిద్దలూరు లోని శాఖ గ్రంథాలయంలో కవయిత్రి మొల్లమాంబ 585 జయంతి వేడుకలను గురువారం ఘనంగానిర్వహించారు. ఈ సందర్భంగా మొల్ల మాంబ చిత్ర పటానికి పుష్ప మాల వేసి ఘనంగా నివాలర్పించారు, ఈ సందర్భంగా గ్రంథ పాలకురాలు ప్రసన్న కుమారి మాట్లాడుతూ తొలి కవయిత్రి మొల్ల జీవితం అందరికి ఆదర్శనీయమని, శతాబ్దాల నుంచి తెలుగు కన్నడ రాష్ట్రాలకు సన్నిహిత సంబంధాలతో మల్లె మొగ్గ లాంటి సరళమైన అందమైన పదాలతో అందరికి అర్థమయ్యేలా మొల్ల రాసిన రామాయణ ఉంటుదని,రాజుల సహకారం లేకుండా ఒక కావ్యం కూడ రాయలేని రోజుల్లోనే రామాయణం రచించి శ్రీరాముడికే అంకితం ఇచ్చిన దీర వనిత మొల్ల మాంబ అన్నారు. ఈ కార్యక్రమంలో విశాంత్ర ఉపాధ్యాయులు బి.రామిరెడ్డి. శాలివాహన సంఘ నాయకులు పారలీగల్ వాలంటీర్ అద్దంకి మధుసూదన్ రావు పాల్గొన్నారు.

# పరీక్ష సామాగ్రి పంపిణీ చేసిన యశ్వంత్



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 13**

ఎడ్యుకేషనల్ సొసైటీ. విద్యార్థుల విద్యాభివృద్ధికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు డాక్టర్ మొర్రి.పిచ్చయ్య సేవలు మరువలేనివని ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు గుమ్మా.పాండు అన్నారు. మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవాధ్యక్షులు, హిందీ ఉపాధ్యాయులు డాక్టర్ మొర్రి.పిచ్చయ్య తన సొంత నిధుల నుంచి ఖర్చు చేసి పరీక్ష సామాగ్రిని కొనుగోలు చేసి ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు పాండుకు గురువారం అందజేశారు. వీటిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యడవల్లిలో 10.వ తరగతి చదువుతున్న విద్యార్థులకు దాత పిచ్చయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పాండు మాట్లాడుతూ పిచ్చయ్య గతంలో ఈ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులుగా పనిచేశారని, ప్రతి సంవత్సరం ఈ పాఠశాలకు ఆర్థిక సహాయం చేస్తున్నారని తెలిపారు. డాక్టర్ పిచ్చయ్య మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో చదువుకొని ప్రభుత్వ ఉద్యోగం పొందాలనని, ఇదే పాఠశాలలో 10 సంవత్సరాలు హిందీ ఉపాధ్యాయునిగా పనిచేశానని, ఆ సమయంలో పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేశానని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకోని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు మోటివేషన్ స్పీచ్ తెలియజేసి, పరీక్షలల్లో పాటించవలసిన మెలకువలు తెలిపారు. పాఠశాల సిబ్బంది పాల్గొని పిచ్చయ్యను అభినందించగా, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

# నాట్స్ తెలుగు సంబరాలకు మాజీ ఎమ్మెల్యే కదిరికి ఆహ్వానం



**చంద్రశేఖరపురం పెన్ పవర్ మార్చి 13**

అమెరికా లోని ఫ్లోరిడా నగరంలో జూలై 4,5,6 తేదీలలో జరిగే నాట్స్ అమెరికా తెలుగు సంబరాలకు హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు కు ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్ )అధ్యక్షులు పాములపాటి మదన్ మోహన్ ఆహ్వాన పత్రికను శీలంవారిపల్లి గ్రామంలో గురువారం అందజేశారు.నాట్స్ ఆధ్వర్యంలో అమెరికా తెలుగు సంబరాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నామని తప్పని సరిగా హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు ను కోరారు.ఈ కార్యక్రమంలో సీఎస్ పురం ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య ,చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం అధ్యక్షులు నాయుడు నారాయణ ,మాజీ మండల టీడీపి అధ్యక్షులు గ్రంధి హేమ సుందరం ,మాజీ ఎంపిటీసి సభ్యులు మూరం కాశిరెడ్డి ,మాజీ నీటి సంఘం అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు ,కదిరి రమణయ్య ,చావా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా నరవ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



**పెన్ పవర్ గిద్దలూరు మార్చ్ 13**

గిద్దలూరు మండలం నరవ గ్రామంలో ఎత్తయిన కొండ పై వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు స్వస్తి శ్రీ శుభకృత్ నామ సంవత్సర ఫాల్గుణ శుద్ధ ఏకాదశి 9 వ తేదీ నుండి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి.9 వ తేదీ ఉదయం లక్ష్మీ నరసింహ స్వామి మూల మూర్తుల కు పంచామృతాభిషేకం అంకురార్పణ, ధ్వజారోహన ,దేవతా ఆహ్వానం తో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వెలసిన ఆలయాన్ని కొండ ను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.అదే రోజు రాత్రి

**అంగరంగ వైభవంగా గరుడ సేవ**
**అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు**



స్వామి వారి కళ్యాణాన్ని వేలాది మంది భక్తుల సమక్షంలో వేదం పండితులు కమణీయం గా నిర్వహించారు. ఆ తర్వాత స్వామి వారు సూర్య వాహనం శేష వాహనం, హనుమంత వాహనం పై గ్రామ పుర వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం రాత్రి స్వామి వారి గరుడ సేవ అత్యంత వైభవంగా సాగింది.శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఇరువురి దేవేరు ల తో కలిసి గరుడ వాహనము పై వీధుల్లో విహరించి భక్తుల ను అనుగ్రహించాడు.ఈ సందర్భంగా వివిధ వర్గాల వారు అబ్బురపరిచే విన్యాసాలు చేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ను నిర్వహించారు. కోలాటం ,కులుకు భజన ,తదితర కార్యక్రమాలు భక్తుల ను ఆకట్టుకున్నాయి. గురువారం రాత్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి గజోత్సవం నిర్వహించారు. స్వామి ఇరువురు దేవేరులతో కలిసి గజ వాహనం పై దర్శనం ఇచ్చారు. ఈ బ్రహ్మోత్సవాల ను పురస్కరించుకుని శనివారం నుంచి సాంప్రదాయ రీతిలో జాతీయ స్థాయిలో ఎడ్లు బండ లాగుడు పోటీ ల ను నిర్వహించి భారీ నగదు



బహుమతుల ను అందజేయనున్నారు. ఇక్కడి లక్ష్మీ నరసింహ స్వామి కి విశిష్ట త సంతరించుకుంది. ఈయన ఈ ప్రాంత వాసుల ఇలవేల్పు స్వామి బ్రహ్మోత్సవాల కు ఈ ప్రాంత వాసులే కాక రాష్ట్ర నలుమూలల నుండి ,రాష్ట్రేతరులు కూడా పాల్గొని అర్చించి స్వామి ని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి ఈ ఆలయంలో వెలిగించే ఆకాశ దీపాన్ని చూసిన తర్వాతే కొత్తకోట బురుజు లో భోజనం చేసి వాడని నరసింహా రెడ్డి స్వామి వారి కి ముఖ్య భక్తుడని ప్రతీతి.కాకుండా కాటం రాజు కూడా తన ఆవుల మంద తో వచ్చి ఆలయ కొండ దిగువ భాగమున బస చేసి స్వామి వారి ని దర్శించుకొని పునీతుడయ్యాడాని ప్రతీతి.

# మహిళలకు భరోసాగా నిలిచిన మన చంద్రన్నకు మా మహిళ లోకం జేజేలు

## టిడిపి ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

**దొనకొండ మార్చి 13 పెన్ పవర్**



మండలంలో మహిళల సాధికారితకు ఆర్థిక భరోసా కల్పిస్తూ మన ప్రియతమ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు నిన్న అసెంబ్లీలో మహిళలకు ఒక అన్నగా, ఒక కుటుంబ పెద్దగా ఇచ్చిన భరోసా కు మహిళలందరి తరఫున దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ గురువారం ఒక ప్రకటనలో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి మహిళను తన సొంత కాళ్లపై నిలబడే విధంగా ఆర్థిక పరిపుష్టతకు, కుటుంబానికి అండగా నిలబడే విధంగా, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో మన కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు సీ ఎం ప్రకటించడం మనకెంతో శు భపరిణామం. ఈ ఏడాది కాలంలో 1,75,000 మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలన్న లక్ష్యంతో ప్రపంచంలోని అత్యున్నత సంస్థలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంటున్నట్లు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా మహిళల ఆర్థిక పరిపుష్టితకు ఆనాడు బీజం వేసిన డ్వాక్రా సంఘాల అడుగులు నేడు మహిళల భరోసా కు బాసటగా నిలిచాయి. అదే స్ఫూర్తితో ప్రతి కుటుంబంలో మహిళలకు అండగా ఆర్థిక బలం చేకూర్చేందుకు అనేక కార్యక్రమాలను రూపకల్పన చేస్తున్నామన్నారు. ఇప్పటికే మన తెలుగుదేశం ప్రభుత్వంలో మహిళలకు అన్న ఎన్టీఆర్ ఆస్తిలో సమాన వాటా ఇచ్చారు. ఇక అభివృద్ధిలో కూడా పోటీపడే విధంగా ముందుకు వెళుతున్నట్లు అందుకు ప్రభుత్వం అండదండలు అందిస్తుందని తెలియజేయడం మన మహిళా లోకానికి గొప్ప వరంగా చెప్పవచ్చు. మహిళల రక్షణతో పాటు మహిళలకు అన్ని విధాల ప్రభుత్వం చేదోడు వాదోడుగా ఉండడం మనం గెలిపించుకున్న ప్రభుత్వానికి మన కలలను సహకారం చేయడం గొప్ప వరంగా చెప్పవచ్చు. మన ప్రియతమ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ , ఐటీ శాఖ మాత్యులు మనస్ఫూర్తి ప్రదాత లోకేష్ బాబు ఆలోచనల నేపద్యమే మహిళలు ఆర్థిక బలంగా భరోసాగా మాలాంటి మహిళలకు రాజకీయాలలో సముచితస్థానంగా డాక్టర్ లక్ష్మీ అభివర్ణించారు. రాబోయే కాలంలో శాసనసభ స్థానాల పునర్విభజన తర్వాత 75 మంది మహిళలు శాసనసభ్యులుగా ఉంటారని కూడా చంద్రబాబు చెప్పడం మాలాంటి యువ మహిళా నేతలకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని డాక్టర్ లక్ష్మీ అన్నారు. అందుకే మహిళలను చంద్రబాబు స్ఫూర్తితో కూటమి ప్రభుత్వ అభివృద్ధిని ఆదరించి ముందుకు వెళ్లాలని ఆమె కోరారు. దర్శి ప్రాంతంలో కూడా మహిళా సాధికారతకు, మహిళా రక్షణకు తాను ఎప్పుడు కట్టుబడి ఉంటానని మహిళలకు అండదండగా ఒక మహిళగా, ఒక డాక్టర్ గా మీ బాధను నా బాధగా మీ కుటుంబ బిడ్డగా వెన్నుదన్నుగా నిలుస్తానని డాక్టర్ లక్ష్మీ తెలిపారు.

# లయన్స్ ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీ

## - 17 న బహుమతి ప్రదానం



**కార్పొరేషన్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి13**

ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు కలాం ప్రకాశం ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా ప్రియదర్శిని న్యాయ కళాశాలలో న్యాయ విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించారు. వినియోగదారుల హక్కులను కాపాడటంలో వినియోగదారుల న్యాయస్థానాల పాత్ర అనే అంశం మీద వకృత్వ పోటీలు నిర్వహించడం జరిగిందని క్లబ్ ప్రెసిడెంట్ లయన్ చిట్టిబాబు తెలిపారు. ఈ పోటీలకు రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ.. న్యాయ కళాశాల గెస్ట్ ఫ్యాకల్టీ సుంకర సాయిబాబా , ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ మాజీ ప్రెసిడెంట్ రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ప్లానింగ్ మహంకాళి వెంకట శేషయ్య, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ షాకీర్ న్యాయ నిర్ణేతలు గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయ విద్యార్థులు పాల్గొని వినియోగదారుల హక్కుల పరిరక్షణలో వినియోగదారుల న్యాయస్థానాల పాత్ర, బాధ్యతలు గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, న్యాయ విద్యార్థులు పాల్గొన్నారు. ఈనెల 17న బహుమతుల ప్రధానం చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

# పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం భరోసా

## నియోజకవర్గ ఇన్ చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు

**ఆర్ సి ఇన్ చార్జ్ యర్రగొండపాలెం పెన్ పవర్ మార్చి 13**



పేదరికంలో ఉండి ఆరోగ్యం బాగుకోసం కార్పొరేట్ ఆసుపత్రులలో అధిక ఖర్చులతో వివిధ ఆపరేషన్లు చేయించుకున్న వారిని, ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఇచ్చి కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని, భరోసా కల్పిస్తుందని టిడిపి ఇన్ చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. గురువారం ఆ పార్టీ కార్యలయంలో నియోగకవర్గంలోని 26 మందికి,42,12,564 రుపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణి చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని ఆసుపత్రులలో నాణ్యమైన వైద్యం అందిస్తునే ,ఉచితంగా మందులను పంపిణి చేస్తుందని అన్నారు.పుట్టిన బిడ్డనుండి వయసు పై పడ్డవారికి అన్ని రకాల వైద్య సదుపాయాలను కూటమి ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.ఎవరు కూడా వైద్య సేవలు అందకుండా బాదపడకూడదనే ఉద్దేశంతో గ్రామీణ ప్రాంతాలలో సైతం వైద్యం అందేలా వైద్యులను నియమించడం జరిగిందని అన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయనిధి అందుకున్న వారు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, చిట్యాల వెంగళరెడ్డి,చెవుల అంజయ్య,పుల్లలచెరువు మండలనాయకులు శనగానారయణరెడ్డి, బోగోలు సుబ్బారెడ్డి, కాకర్లకోటయ్య, యంపిటిసి రఫి,తదితరులు పాల్గోన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు

## 755 మంది హాజరు



**పెన్ పవర్ గిద్దలూరు మార్చ్ 13**

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మొదటి సంవత్సరం విద్యార్థుల కు గురువారం నాటి తో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం నాడు కెమిస్ట్రీ 1, కామర్స్ 1 పరీక్ష లు జరిగాయి. మూడు పరీక్ష కేంద్రాల్లో 827 మంది విద్యార్థుల ను కేటాయించగా 755 మంది పరీక్ష ల కు హాజరయ్యారు.72 మంది గైర్హాజరు అయ్యారు. జీవన జ్యోతి కళాశాల లో 378 విద్యార్థుల కు గాను 362 మంది హాజరయ్యారు. సాహితీ జూనియర్ కళాశాలలో 273 విద్యార్థుల కు గాను 246 మంది హాజరయ్యారు. శ్రీ వివేకానంద జూనియర్ కళాశాల లో 176 మంది కి కాను 147 మంది హాజరయ్యారు.చీఫ్ సుపరింటెండెంట్ గా విజయ్ శంకర్ ,మురళి కృష్ణ,ఐ వి చంద్ర శేఖర్ రెడ్డి లు వ్యవహరించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ గా కె.సత్య రామిరెడ్డి ,భూపతి రెడ్డి లు తనిఖీ చేశారు. డిపార్ట్ మెంటల్ ఆఫీసర్లు గా సుంకరి కృష్ణయ్య,శిరీషా కుమారి వ్యవహరించారు.

# శిధిలావస్థలో పాత ఫిల్టర్ బెడ్

## - మరమ్మతులు చేయాలని సిపిఎం డిమాండ్






**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు మార్చి 13**

సిపిఎం పాదయాత్రలో భాగంగా గురువారం రాజాపానగల్ రోడ్డు, గద్దలగుంట, మామిడిపాలెం, సీతారాంపురం,జకరయ్య కాలనీ, యానాది కాలని, కొండమిట్ట ప్రాంతాలలో స్థానిక సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కొండమిట్ట లో ఉన్న ఓల్డ్ ఫిల్టర్ బెడ్ ని పరిశీలించి ఏమాత్రం పట్టించుకోని పాలకవర్గం, అధికారుల నిర్లక్ష్యం పై నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒంగోలు నగరంలోని దాదాపు సగం జనాభా కు ఈ ఫిల్టర్ బెడ్ ద్వారానే మంచినీటి సరఫరా జరుగుతుందని చెప్పారు. దీనిని 1968లో నిర్మాణం చేపట్టారని, సుమారు 57 సంవత్సరాలు పూర్తయిందని తెలిపారు. ఈ పాత ఫిల్టర్ బెడ్ స్లాబు, పిల్లర్ లుకూడా పగిలిపోయి ఇనుము బయటికి వచ్చిందని, ఎప్పుడు బిల్డింగు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఈ భవనం ఉన్నదని,ఏ క్షణమైన నిర్మాణం కూలిపోయే పరిస్థితిలో ఉన్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే నగరపాలక సంస్థ ఫిల్టర్ బెడ్ మరమ్మత్తులకు నిధులు వెచ్చించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అదే స్థలంలో మరొక నూతన ఫిల్టర్ బెడ్డు నిర్మాణం చేయాలన్నారు. అనుకోకుండా ఏదైన ప్రమాదం జరిగితే ప్రజలందరికీ మంచినీరు అందని పరిస్థితి నెలకొంటుందని పేర్కొన్నారు. పాలకవర్గం యొక్క వైఫల్యం, అధికారులకు శ్రద్ధ లేకపోవటం ప్రజల సమస్యల మీద శ్రద్ధ పెట్టనందున ఈ స్థితి ఏర్పడిందని అన్నారు. అనంతరం ఈ ప్రాంతాల్లో మంచినీరు దుర్వాసనతో వస్తున్నాయని ప్రజలు సమస్యలు తమ దృష్టికి తెచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జి.రమేష్, బి రఘురాం,నగర కార్యదర్శి వర్గ సభ్యులు త%ళి%బి శ్రీనివాసులు, నగర నాయకులు నగర నాయకులు బి వి రావు, ఎస్.డి హుస్సేన్, మహేష్ , షేక్ అమీర్, సి హెచ్ వినోద్ , తదితరులు పాల్గొన్నారు.

## ఆనందాల రంగుల హోళి అందరికి మంచి చేయాలి

### ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



**ఆర్ సి ఇన్ చార్జ్ యర్రగొండపాలెం పెన్ పవర్ మార్చి13**

భారతీయ సంస్కృతిలో ప్రత్యేకమైన స్దానం కలిగిన హోళి పండుగ, అందరి జీవితాలలో ఆనందాన్ని నింపాలని ప్రతి పనిలో గెలుపు రంగు జెండా ఎగురవేయాలని వైయస్సాఆర్ సిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మేల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం హోళి పండుగ జరుపుకుంటున్న నేపథ్యంలో ఆనందంగా జరుపుకోవాలని,హోళి అంటే కేవలం రంగులు చల్లుకోవడం మాత్రమే కాదని,ప్రేమ ,ఐక్యత, అనుబంధాలు కలబోసిన సంతొషాల నెలవు అని అన్నారు. నియోజకవర్గ ప్రజలందరు ఐక్యతరాగంతొ హోళి జరుపుకోవాలని కోరారు.

## గిద్దలూరు నియోజకవర్గ ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి13**

పచ్చటి పొలాలకు, అందమైన జీవనానికి ప్రతీక అయిన హోలీ పండుగ సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే " ముత్తుముల అశోక్ రెడ్డిహృదయపూర్వక హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ రంగుల పండుగ అందరి జీవితాల్లో ఆనందాన్ని, ఐక్యతను, ప్రేమను నింపాలని సత్సంగతి, శుభాభివృద్ధి, సంతోషంతో మీరు అనుకున్న లక్ష్యాలతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## కంటి దృష్టిని ఆకస్మికంగా హరించే వ్యాధి గ్లకోమా



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 12**

గిద్దలూరు పట్టణంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో గ్లకోమా వ్యాధిపై అవగాహన కార్యక్రమము నిర్వహించారు ఈ కార్యక్రమంలో ప్రముఖ కంటి వైద్య నిపుణులు డా.జి. కె. మోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని గ్లూకోమా వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా గ్లకోమావ్యాధి వారోత్సవాలు మార్చి 9 వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నారని. 2025 సంవత్సరపు గ్లకోమావ్యాధి వారోత్సవాల ముఖ్య ఉద్దేశము గ్లూకోమా వ్యాధి రహిత ప్రపంచ కొరకు ప్రతి ఒక్కరు ఐక్యమత్యముగా ఉండాలిని, .ప్రపంచవ్యాప్తంగా దాదాపు 80 మిలియన్ల మంది గ్లూకోమా వ్యాధితోబాధపడుతున్నారని, భారతదేశంలో కూడా దాదాపు 12 మిలియన్ల పైన ప్రజలు గ్లకోమావ్యాధి కంటి సమస్యలతో బాధపడుతున్నారన్నారు. కంటిశుక్లాల తర్వాత అత్యంత ప్రమాదకరమైన కంటి వ్యాధి గ్లకోమ వ్యాధి అన్నారు. గ్లకోమా వ్యాధి అనగా కంటిలో ఇంట్రా ఆక్యులర్ ప్రెషర్, నీటి ఒత్తిడి క్రమముగా పెరుగుతూ కంటి నరాలు క్రమంగా క్షీణించి దెబ్బతిని చివరికి అందత్వం కలిగించే వ్యాధిని గ్లూకోమా లేక నీటి కాసుల వ్యాధి అని అంటారని, కంటి దృష్టి లోపం ఏర్పడిన వెంటనే కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకొని, చికిత్సలు చేయించుకొని గ్లూకోమా వ్యాధి రాకుండా నివారించవచ్చునన్నారు గ్లకోమ వ్యాధి లక్షణాలు కాంతి దీపం చుట్టూ వలయాకారముగా వివిధ రంగులు కనిపించుట, కంటి దృష్టి ఒక గొట్టములో చూసినట్లుగా కనిపించుట, తరచుగా తలనొప్పి వాంతులు కావడం, వికారంగా ఉండటం, కంటి దృష్టిలోపాలు ,మసకలగా ఉండటం,కంటిలో నీరు కారటం, ఎరుపుగా, వాపుగా, దురదలు ఉండటం, నొప్పిగా ఉండటం, నలకల పడినట్టు గుచ్చుకున్నట్లు ఉండడం, కళ్ళు బరువుగా ఉండటం మొదలగు లక్షణాలుంటాయని తెలిపారు. గ్లూకోమా వ్యాధికి ప్రమాద కారకాలు 40 సంవత్సరాలు పైబడినవారు, గ్లూకోమా వ్యాధి గల వారి కుటుంబ నేపథ్యం అనగా వంశపారపర్యము షుగర్ వ్యాధి , బిపి వ్యాధి గలవారు, ఎక్కువగా స్టెరాయిడ్స్ మందులు ఉపయోగించటం వలన మొదలైన వాటి వలన కంటిలో నీటి ఒత్తిడి క్రమేపి శాశ్వతముగా అందత్వము కలుగుతుందన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు నిర్వహించుకుని వ్యాధిని నిర్ధారణ చేసుకొని సరైన కంటి చికిత్సలు చేయించుకుంటే కంటి దృష్టి లోపం ఏర్పడకుండా నివారించవచ్చునన్నారు. కంటిలో ఇంట్రా ఆక్యులర్ ప్రెషర్ అనగా కంటిలో నీటి ఒత్తిడి సాధారణంగా 15 మిల్లీమీటర్ల నుంచి 20 మిల్లీమీటర్ల వరకు మాత్రమే ఉండాలని ఈ నీటి ఒత్తిడి అనగా పీడనమును టోనోమీటర్ అనే పరికరం ద్వారా నిర్ధారిస్తారని అదేవిధంగా క్షేత్రస్థాయి కంటి దృష్టిని కూడా ద్వారా పెరిమీటర్ అనే పరికరం ద్వారా నిర్ధారిస్తారన్నారు కంటిలో నీటి ఒత్తిడి ఎక్కువగా పెరిగితే కంటిలోని ఆప్టిక్క్ డిస్క్ మీద పీడనం పెరిగి అనేక మార్పులు జరిగి క్రమంగా నరాలు క్షీణించి కంటి దృష్టిని శాశ్వతంగా కోల్పోతారని. గ్లకోమా వ్యాధి వలన కలిగే కంటిలోని ఇంట్రా ఆక్యులర్ ప్రెజర్ ను అనగా నీటి ఒత్తిడి వలన కలిగే పీడనమును మందుల ద్వారా కానీ లేజర్ శస్త్ర చికిత్సల ద్వారా గాని నివారించవచ్చుననన్నారు. అదేవిధంగా మార్చినెల 31వ తేదీ వరకు డా. జీకే మోహన్ రెడ్డి కంటి ఆసుపత్రి యందు బి.పి. షుగర్ వ్యాధి కలవారికి ఉచితంగా కంటి స్కానింగ్ , గ్లూకోమా వ్యాధి పరీక్షలు ఉచితంగా నిర్వహింస్తామని సంప్రదించవలసిన వారు 98497 65355 మొబైల్ నెంబర్ కు ఫోను చేయవలెనన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు రమాదేవి మాట్లాడుతూ కంటి దృష్టి లోపాలు ఏర్పడిన వెంటనే కంటి పరీక్షలు నిర్వహించుకొని సరైన చికిత్సలు తీసుకోవాలన్నారు. సర్వేంద్రియానం నయనం ప్రధానమన్నారు. ఉపాధ్యాయులు ఎం. శేఖర్ మాట్లాడుతూ ఆకు పచ్చని ఆకుకూరలు కూరగాయలు మంచి పోషకాహార విలువలు కలిగిన పదార్థాలను ఆహారంగా తీసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరెడ్డి, ఆదిలక్ష్మి కరుణాకర్ ,శ్రీనివాసులు, ఆసుపత్రి వైద్య సిబ్బంది పీరయ్య,విద్యార్థులు మొదలైన వారు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతులకు దుప్పట్లు మరియు పండ్లు పంపిణీ

### పంపిణీ చేసిన రిటైర్డ్ డాక్టర్ ఏలూరి రాజేంద్రప్రసాద్





**చంద్రశేఖరపురం పెన్ పవర్ మార్చి 13**

చంద్రశేఖరపురం పట్టణం లోని భవిత కేంద్రం లో చదువుతున్న విభిన్న ప్రతిభావంతులకు పెద్ద గోగులపల్లి గ్రామమునకు చెందిన ఏలూరి బసవమ్మ వర్ధంతి సందర్భంగా కుమారుడు రిటైర్డ్ డాక్టర్ ఏలూరి రాజేంద్రప్రసాద్ దుప్పట్లు మరియు పండ్లు పంపిణీ చేశారు ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల బంగారు భవిష్యత్తుకు భవిత కేంద్రాలు బాసటగా నిలుస్తాయని బాగా చదివి ఉత్తీర్ణత సాధిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు ఈ సందర్భంగా భవిత కేంద్ర సిబ్బంది డాక్టర్ ఏలూరి రాజేంద్రప్రసాద్ ను అభినందించారు ఈ కార్యక్రమంలో భవిత కేంద్ర సిబ్బంది వైద్య సిబ్బంది విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

## ఫాతిమా స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షా స్టేషనరీ పంపిణీ



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 13**

గిద్దలూరు మండలం క్రిష్టం శెట్టిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు ఫాతిమా స్వచ్ఛంద సేవ సంస్థ, ఉపాధ్యాయులు షేక్ ఖాసీంవలి, మంజు రేఖ లు పరీక్ష స్టేషనరీ పంపిణీ చేశారు. పరీక్ష అట్టలతో పాటు పెన్సిల్లు పెన్నులు విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా మానసిక ప్రశాంతతతో పరీక్షలు బాగా వ్రాసిమంచి మార్కులు సాధించాలని ఫాతిమా స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షులు నంద్యాల ఖాసిం వలి విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.కె కాసిం వలి ఉపాధ్యాయురాలు మంజరేఖ పాల్గొన్నారు.

## సి.ఎస్.పురం జడ్.పి.హెచ్.ఎస్ విద్యార్థులకు పెన్నులు పంపిణీ

### విద్యార్థులు పరీక్షల భయాన్ని విడనాడాలి



**చంద్రశేఖరపురం పెన్ పవర్ మార్చి 13**

చంద్రశేఖరపురం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు పరీక్షల దృష్ట్యా పెన్నులను చంద్రశేఖరపురం పట్టణమునకు చెందిన పఠాన్ ఖాజా రంతుల్లా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఖాదరున్నీషాబేగము నకు అందజేశారు. విద్యార్థినీ విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖాదరు న్నీషాబేగం పంపిణీ చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల భయాన్ని విడనాడి విద్యార్థులందరూ పరీక్షల సమయములో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా నిర్భయముగా పరీక్షలు వ్రాసి మంచి మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు అనంతరం పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు 10వ తరగతి హాల్ టికెట్లు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

## కాశి నాయన క్షేత్రం పై రాజకీయం ఎందుకు



**దర్శి మార్చి 13 పెన్ పవర్ :**

డిప్యూటీ సీఎం మరియు అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ గారు అటవీశాఖ అధికారులు పంపించి ఉచితంగా అన్నం పెట్టే ఆశ్రమాలను కూల్చడం ఎంతవరకు కరెక్ట్ కూటమి ప్రభుత్వంలో ఉన్న బిజెపి ఈ చర్య మీద ఏ విధంగా స్పందిస్తారు. పవన్ కళ్యాణ్ గారు అక్రమంగా కరకట్ట మీద కట్టుకున్న చంద్రబాబు నాయుడు గారి ఇల్లు ని కూల్చగలరా? సామాన్యులు అంటే ఎందుకు మీకు అంత చిన్న చూపు. ఈ దుచ్చరియా హిందూ మనోభావాలను దెబ్బతీయడం కాదా? మీరు దేవాలయాల మీద పెట్టిన శ్రద్ధ ఏదో ఇచ్చిన హామీల మీద పెడితే మంచిది. రాష్ట్ర అసంఘటిత కార్మికులు ఉద్యోగుల చైర్మన్ మరియు దర్శి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కైపు వెంకటకృష్ణారెడ్డి డిమాండ్ చేస్తున్నారు.

# ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 13**

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తొలి తెలుగు కవయిత్రి శ్రీశ్రీశ్రీ మొల్లమాంబ జయంతి వేడుకలు గురువారం ఏపి బిసి స్టడీ సర్కిల్ కార్యాలయం ఒంగోలు నందు ఘనంగా నిర్వహించారు. ఒంగోలు ఓల్డ్ రిమ్స్ నందు గల ఏపి బిసి స్టడీ సర్కిల్ నందు తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారి యం.అంజల అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా భాజపా జిల్లా అధ్యక్షులు సెగ్గెం శ్రీనివాసరావు హజరయ్యారు. జిల్లా శాలివాహన సంఘం అధ్యకుడు కె. నాగేశ్వరరావు (విక్కీ) అధ్యకులుగా వ్యవహరించారు. డాక్టర్ సుబ్బయ్య (ఈఎన్ఎస్) కొండేపి, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పీతాల చెన్నకేశవులు, జిల్లా లోని రాష్ట్ర జిల్లా శాలివాహన సంఘ నాయకులు పట్నం శ్రీనివాసులు, అముదాల పల్లి గంగాధర్, మొగిలిచర్ల సుబ్బారావు, దండు. రామాంజనేయులు, దండు శ్రీనివాసులు, కానుగుల, నాగేశ్వరరావు, కానుగుల వెంకట రాయలు, తాళ్లూరి సిద్ధయ్య, డి. మహలకమ్మ, చింతగుంట రమణమ్మ, ఒంగోలు, గిద్దలూరు సహాయ బి.సి. సంక్షేమాధికారులు, జిల్లా లోని కుమ్మరి శాలివాహన కుల సంఘ నాయకులు, జిల్లా బి.సి వెల్ఫేర్ కార్యాలయ సిబ్బంది, జిల్లా బి.సి. స్టడీ సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

# వరల్డ్ ల్యాబ్ టెక్నీషియన్ డే



**పెద్దదోర్నాల పెన్ పవర్ మార్చి 13**

వరల్డ్ ల్యాబ్ టెక్నీషియన్ డే సందర్భంగా పలు వైద్యశాలలో సిబ్బంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రము నందు ల్యాబ్ టెక్నీషియన్ గా పని చేస్తున్న శ్రీరామ శ్రీనివాసులు కు సన్మానం చేసి అనంతరంచింతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రము పరిధిలో నీ 50 మంది గిరిజన గర్భిణీ స్త్రీలకు రక్త పరీక్షలు నిర్వహించి వారికి ఐరన్ సిరప్ లు ప్రోటీన్ పౌడర్ లు ఉచితంగా అందించటం జరిగింది. పెద్ద దోర్నాల సిహెచ్ శ్రీ నందు లాప్ టెక్నీషియన్ గా పనిచేస్తున్న చిరంజీవిని వైద్యశాలలో పనిచేసే సిబ్బంది సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా విచ్చేసిన దోర్నాల సి. హెచ్. సి సీనియర్ వైద్యుడు డాక్టర్ ఆంజనేయులు గర్భిణీలు తీసుకొన వలసిన జాగ్రత్తలు ఐరన్ యొక్క అవశ్యకత ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు గురించి వివరంగా తెలియ చేయటం జరిగినది. చెంచు గిరిజన నాయకుడు మంతన్న మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు డాక్టర్ లు వైద్య సిబ్బంది సూచనలు తప్పనిసరిగా పాటించి, బాల్య వివాహాలు అరికట్టాలని దీని వల్ల స్త్రీలకు చాలా వరకు సమస్యలు తగ్గుతాయని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో చింతల వైద్యాధికారి డాక్టర్ యం. యాగ్నిక్, డాక్టర్ సంజీవ్ లావణ్య చింతల సి. హెచ్. ఓ పి. మంత్రు నాయక్ పి. హెచ్. యన్ సూర్య కుమారి, గ్రామ పెద్దలు వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాలుగోనటం జరిగినది.

# ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపిన ఆర్ కె వలి. రవి





**చంద్రశేఖరపురం పెన్ పవర్ మార్చి 13**

హోలీ పండుగ సందర్భంగా ప్రజలందరికీ చంద్రశేఖరపురం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఆర్ కె వలి జనసేన పార్టీ నాయకులు గూడంశెట్టి రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని రసాయన రంగులకు బదులు సహజ సిద్ధ రంగులతో సురక్షితముగా హోలీ పండుగ జరుపుకోవాలని కోరారు హోలీ పండుగ వచ్చిందంటే ఆ ఉత్సాహము ఎంత రంగుల మయముగా ఎంతో ఆనందోత్సలతో జరుపుకుంటామని అన్నారు. వసంతోత్సవ ములతో మొదలయ్యే ఈ పండుగ ప్రతి ఇంటికి నిత్య వసంతాలను తీసుకురావాలని సుఖ సంతోషాలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

# అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పశుపోషకులను ఆదుకోవాలి

**బాదినేనిపల్లిలో సంభవించిన అగ్ని ప్రమాదంలో కాలిపోయిన గడ్డి, చొప్ప, పొట్టు వాములు.**

**తీవ్రంగా నష్టపోయిన పశు పోషకులు.**

**నష్టాన్ని అంచనా వేసి రైతాంగాన్ని ఆదుకోవాలంటూ బాదినేనిపల్లి సర్పంచ్ జయరామిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి.**





**కొమరోలు పెన్ పవర్ మార్చి 13**

కొమరోలు మండలం బాదినేని పల్లి గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన పశుపోషకులను ఆదుకోవాలని బాదినేని పల్లె సర్పంచ్ జయరామిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బాదినేని పల్లె గ్రామం వెలుపల బుధవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో ఆ గ్రామానికి చెందిన పశుపోషకులు నిల్వ ఉంచుకున్న వరి గడ్డి ,జొన్న చొప్ప , కంది ,మినుము, వేరుశనగ, పప్పు సెనగ పొట్టు వాములు పాలిపోయాయని ఆయన చెప్పారు. ఆ సందర్భంగా పశు పోషకులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఒక్కొక్క రైతు కుటుంబం 10 నుంచి 15 గేదెలను పోషించుకుంటూ జీవనాధారం సాగిస్తున్నారని, వాటి కొరకు దూర ప్రాంతాల నుంచి ట్రాక్టర్లలో వరిగడ్డి, జొన్న సొప్ప, పలు రకాల పంటల పొట్టు తెచ్చుకొని వాములు వేసుకొని పశువులకు పశుగ్రాసం అందిస్తూ పోషించుకుంటూ ఉన్నారన్నారు. ఒక ట్రాక్టర్ పశు గ్రాసం విలువ పదివేల నుంచి 13,000 వరకు ఉంటుందని ఆయన చెప్పారు. బుధవారం సాయంత్రం మందుబాబులు గ్రామం వెలుపల మందు సేవిస్తూ సిగరెట్, బీడీ కాలుతున్న పీకలను సమీపంలోని ముళ్ళ చెట్లపై వేయటంతో మంటలు అంటుకొని వరుసగా దగ్గర దగ్గరగా ఉన్న గడ్డివాములు, చొప్ప వాములు ,పొట్టువాములు కాలిపోయాయని ఆయన చెప్పారు. దీనితో తమ గ్రామంలో జరిగిన ప్రమాదంలో దాదాపు 3 లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి మంటలు అర్పినప్పటికీ కాలిపోగా మిగిలిన వరిగడ్డి ,చొప్ప ,పొట్టు పొగ తో నిండి కమురువాసన వెదజల్లుతున్నాయని, అందువల్ల మిగిలిపోయిన పశుగ్రాసం పశువులకు ఉపయోగపడదని ఆయన చెప్పారు .కావున ప్రభుత్వ అధికారులు తమ గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోయిన పశుగ్రాసం వాముల నష్టాన్ని అంచనా వేసి పశుపోషకులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని జయరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఈనెల 15వ తేదీ నుంచి అన్ని పాఠశాలల్లో ఒంటిపూట బడులు నిర్వహణ

**ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పాఠశాలలు నిర్వహణ.**

**ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలి.**

**మధ్యాహ్నం 11:30 నుంచి విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం అందించాలి.**

**కొమరోలు ఎంఈఓ 2 బొర్రా వెంకటరత్నం.**



**కొమరోలు పెన్ పవర్ మార్చి 13**

కొమరోలు మండలంలోని అన్ని యాజమాన్యాల పరిధిలో గల పాఠశాలలలో ఈ నెల 15 తేదీ నుంచి 23వ తేదీ వరకు ఒంటి పూట బడులు నిర్వహించనున్నట్లుగా కొమరోలు ఎంఈఓ 2 బొర్రా వెంకటరత్నం తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి అన్ని పాఠశాలల్లో ఒంటి పూట బడులు నిర్వహించాలని ,ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పాఠశాలలు నిర్వహించాలన్నారు .డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం విద్యార్థిలకు 11:30 నుంచి అందించాలన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి మాసం నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటున్నందువల్ల విద్యార్థులు ఎండ వేడిమికి, వడగడుపునకు ఇబ్బందులు పడకుండా తగు ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. పాఠశాలలో తాగునీటి సౌకర్యం తప్పనిసరిగా చేయాలన్నారు. ఒంటి పూట బడులు ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించాలని, 2025-26 విద్యా సంవత్సరానికి పాఠశాలలను జూన్ 12వ తేదీన పునః ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ఒంటి పూట బడులు నిర్వహించడంలో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే పాఠశాలలపై శాఖ పరమైన చర్యలు తీసుకోవలసి ఉంటుందని వెంకటరత్నం హెచ్చరించారు. విద్యార్థులు కూడా ఉదయం వేళల్లో పాఠశాలకు రావడం, మధ్యాహ్నం తిరిగి ఇంటికి వెళ్లడంలో ఎండ వేడిమి, వడగడుపులకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ,విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ చిన్నారులు ఆరోగ్యాల పట్ల అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాలల నుంచి తిరిగి ఇంటికి వచ్చిన తరువాత విద్యార్థులు సాయంత్రం ఐదు గంటల లోపు ఇల్లు దాటి బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు వారికి ఆటపాటలకు కాలక్షేపానికి వసరమైన ఏర్పాట్లు చేయాలని ఎంఈఓ కోరారు.

# మాది స్కీముల ప్రభుత్వం మీది స్కాముల ప్రభుత్వం

**శాసన మండలలో ఎమ్మెల్సీ తూమాటి ధ్వజం**



**కందుకూరు పెన్ పవర్, మార్చి 13**

మాది స్కీముల ప్రభుత్వం మీది స్కాముల ప్రభుత్వం అని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు శాసనమండలి లో ధ్వజమెత్తారు. వైజాగ్ లో గతంలో 4300 ఎకరాలు 250 ఏరియాల్లో అక్రమాలు జరిగాయని 2019- 24 మధ్యలో కేసులు బుక్ అయ్యాయని అది స్కాము అని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీలు తీసుకుని వస్తే అవి నేడు ప్రైవేటు వారికి కట్టబెట్టాలని చూస్తున్నారు అది స్కాం అని అన్నారు. మద్యం మీద ఇతర రాష్ట్రాల వారు మన రాష్ట్రాన్ని దోచుకోకుండా ప్రభుత్వమే మద్యం పాలసీని తీసుకుని వచ్చిందని, ఇది చాలా మంచి పాలసీ అని అన్నారు. గత ఎన్నికల ముందు వైజాగ్ కోర్టు ద్వారా డ్రగ్స్ భారీ ఎత్తున రవాణా అవుతున్నాయని ఆరోపణలు చేశారు. ఇప్పుడు వారికి క్లీన్ చిట్ ఇచ్చారు. ఇది స్కాం కాదా అని అన్నారు. పోర్టుల్లో ప్రైవేటు కంపెనీలకు వాటా పెట్టింది గతంలో మీరేనని అది స్కాం కాదా అధ్యక్ష అని అన్నారు. గత ప్రభుత్వంలో స్కిల్ డెవలప్మెంట్ లు కూడా ఎంతో స్కామ్ జరిగిందని, అది మా గవర్నమెంట్ లో ప్రభుత్వమే బాధ్యత తీసుకుందని ఎమ్మెల్సీ మాధవరావు సభ ముందుంచారు. పోర్టులు కట్టిన చరిత్ర మాది అని, తెలుగుదేశం 40 ఏళ్ల చరిత్రలో ఒక్క పోర్టు అయిన కట్టిందా అని అన్నారు. ఒక్క పోర్టు కూడా కట్టకపోగా రామాయపట్నం పోర్టు అరవింద్ వాళ్ళ దగ్గర నుంచి బెదిరించి వేరే వాళ్ళకి కట్టబెట్టారని ఇది స్కామని మా ప్రభుత్వం లో స్కీములు ఉండేవని శాసన మండలి లో మాట్లాడారు. మీరు అద్భుతమైన రాజధాని కడతామని చెప్పినా కూడా గుంటూరు ప్రజలు నమ్మక మీకు ఎన్ని సీట్లు ఇచ్చారని అన్నారు. ప్రజలు నమ్మక గతంలో మీకు 23 సీట్లు ఇచ్చారని ఎద్దేవా చేశారు. మూడు రాజధానుల వల్ల మాకు 11 సీట్లు వచ్చాయని మాట్లాడడం కరెక్ట్ కాదని అన్నారు. శాసనమండలిలో ప్రభుత్వంపై తూమాటి ఫైర్ అయ్యారు. గత ప్రభుత్వ పాలనలో అవినీతి లేదని, ఇప్పటి పాలనలోనే అవినీతి జరుగుతున్నదంటూ తూమాటి మాధవరావు గురువారం శాసనమండలిలో తీవ్రస్థాయిలో ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రూ7.50 నుంచి రూ2.50 కి తగ్గించి విద్యుత్ కొనుగోలు చేయడం స్కామ్ అవుతుందా.? అంటూ నిలదీశారు. పోలవరాన్ని ఏటీఎం లా చంద్రబాబు వాడుకున్నారంటూ..2019 ఎన్నికల సమయంలో ప్రధాని మాట్లాడింది నిజం కాదా.. అంటూ ఎద్దేవా చేశారు.

# 17 లోగా అధికారులు సమగ్ర సమాచారం అంద చేయాలి - జిల్లా కలెక్టర్ ఆదేశం





**ఎస్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 13**

ఈ నెలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగే కలెక్టర్ల కాన్ఫరెన్స్ కు శాఖల వారిగా సమాచారాన్ని ఈ నెల 17వ తేదీలోగా తనకు సమర్పించాలని అన్ని శాఖల ఉన్నతాధికారులను కలెక్టరు ఏ. తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఈ నెల 24, 25వ తేదీలలో ఈ కాన్ఫరెన్స్ ఉన్నందున అన్ని శాఖల జిల్లా అధికారులతో గురువారం ఆమె ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. కాన్ఫరెన్స్ లో పిపిటి ద్వారా వివిధ అంశాలను ముఖ్యంగా జిల్లాలోని పరిస్థితులను బట్టి టాప్-5 శాఖలకు సంబంధించిన వివరాలను, ప్రస్తుత సమస్యలు మూడు నెలలలోగా వాటి పరిష్కారానికి చేపట్టవలసిన చర్యలను వెల్లడించాల్సి ఉన్నందున సమగ్ర సమాచారాన్ని తనకు అందించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మూడో శనివారు సందర్భంగా ఈ నెల 15వ తేదీన నిర్వహించే స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులను, ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించడంపై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించేలా ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా చేపట్టాలన్నారు. ఈ సమావేశం లో సిపిఓ డి. వెంకటేశ్వర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నాట్స్ తెలుగు సంబరాలకు నారాయణరెడ్డికి ఆహ్వానం

**చంద్రశేఖరపురం పెన్ పవర్ మార్చి 13**

అమెరికా లోని ఫ్లోరిడా నగరంలో జూలై 4,5,6 తేదీలలో జరిగే నాట్స్ అమెరికా తెలుగు సంబరాలకు హాజరు కావాలని మాజీ సొసైటీ అధ్యక్షులు బోయళ్ల నారాయణరెడ్డి కి ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్ )అధ్యక్షులు పాములపాటి మదన్ మోహన్ ఆహ్వాన పత్రికను అందజేశారు. నాట్స్ ఆధ్వర్యంలో అమెరికా తెలుగు సంబరాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నామని తప్పని సరిగా హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఎస్ పురం ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య , గ్రంధి హేమ సుందరం తదితరులు పాల్గొన్నారు.



## 10 వ తరగతి పరీక్షలకు అన్నీ ఏర్పాట్లు పూర్తయ్యాయి
## బాపట్ల జిల్లా విద్య శాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం

**పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 13:**

జిల్లాలో 103 కేంద్రాలలో 16,799 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఈ నెల 17 నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశాలతో అవసరమైన అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బాపట్ల జిల్లా విద్యా శాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బాపట్ల జిల్లా లో మొత్తం 16,799 (8482 విద్యార్థులు, విద్యార్థినిలు 8317) విద్యార్థులు103 పరీక్ష కేంద్రలలో పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రం లో విద్యార్థులకు కావలసిన త్రాగు నీరు, విధ్యుత్, టాయిలేట్, మెడికల్ సౌకర్యం మొదలగు వసతులు కల్పించినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి వారి హాటికెట్ పై ఆర్ టీ సి బస్ లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, సకాలంలో బస్సులు త్రిప్పే విధంగా తగు సూచనలు చేశామని తెలిపారు. కలెక్టర్ అదేశానుసారం సమస్యాత్మక కేంద్రల వద్ద 144 సెక్షన్ విధించి సి సి కెమెరాలు కూడా ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రం నుండి 100 మీటర్ల పరిధిలో ఎలాంటి జిరాక్స్ షాప్ లు ఉండకూడదదన్నారు.



# పెన్ పవర్
## గుంటూరు । బాపట్ల । పల్నాడు

# 10 వ తరగతి పరీక్షలకు అన్నీ ఏర్పాట్లు పూర్తయ్యాయి
# బాపట్ల జిల్లా విద్య శాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం

## పక్కా గృహాల నిర్మాణాలలో ప్రభుత్వం లక్ష్యాలను చేరుకోడానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి:

**పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 13**

గృహ నిర్మాణాలపై సంబంధిత శాఖ అధికారులతో గురువారం ఆయన స్థానిక కలెక్టరేట్ లో సమీక్ష నిర్వహించారు. పక్కా గృహాల నిర్మాణ లక్ష్యాలలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. 2019 నుండి 2024 మధ్యకాలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు గృహాలు మంజూరై వివిధ దశలో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్నటువంటి వారికి ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందజేస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. గృహాల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న 1.8 లక్షలు సరిపోక, వారి వద్ద వెసులుబాటు లేక ఆగిపోయిన గృహాలు జిల్లాలో సుమారు 16 వేల 85 ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో బీసీ, ఎస్సీ వర్గాలకు 50 వేలు చొప్పున, ఎస్టి వర్గాలకు 75 వేలు చొప్పున అదనపు ఆర్థిక సహాయం అందజేస్తుందని ఆయన తెలిపారు. ఎస్సీ,బీసీ వర్గాలకు మొత్తంగా 2.3 లక్షలు, ఎస్టి వర్గాలకు 2.5 లక్షలు మంజూరు చేయబడుతుందని ఆయన తెలిపారు. ఎవరికైతే ఇళ్ళు మంజూరు చేయబడ్డాయో ప్రతి మహిళకు సెర్ప్ నుండి లక్ష రూపాయలు రుణం ఇవ్వబడుతుందని అన్నారు. మొత్తంగా ఎస్సీ, బీసీ వర్గాలకు 3.3 లక్షలు, ఎస్టి వర్గాలకు 3.5 లక్షలు మంజూరు చేయబడుతుందని అన్నారు. ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించే విధంగా మీడియా ద్వారా తెలియజేయడమైనదని అన్నారు. ప్రజా ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని వారి సహాయంతో వారి వద్దకు వచ్చే ప్రజలకు అవగాహన కల్పించే అవకాశం ఉంటుందన్నారు. ఎం. ఎస్. ఓలు, సి ఎస్ ఓ లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు సచివాలయ సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. మండల స్థాయిలో రాజకీయ నాయకులను సంప్రదించి సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది జి ఎస్ డబ్ల్యూ ఎస్ వారీగా 16 వేల 85 మంది లబ్ధిదారుల గృహాలకు వెళ్లి వారితో సంప్రదించి వారి యొక్క గృహాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అదనపు ఆర్థిక సహాయం గురించి వారికి తెలిపి వారిలో చైతన్యం తీసుకు వచ్చి, గృహాల నిర్మాణం పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. పీఎం ఏవై 1.0 పథకం కింద గృహాల నిర్మాణానికి ఎంపికై అసంపూర్ణ నిర్మాణంలో ఉన్నటువంటి ఎస్సీ,ఎస్టీ, బిసి వర్గాల లబ్ధిదారుల వివరాలను జి ఎస్ డబ్ల్యూ ఎస్ వారి డేటా ఆధారంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పోర్టల్ లో పెట్టడం జరిగిందన్నారు. జి ఎస్ డబ్ల్యూ ఎస్ డేటాలో లేని కొన్ని పేర్లను ప్రత్యేకంగా లబ్ధిదారులను కలిసి వారి కుల ధ్రువీకరణ ఆధారంగా అప్లోడ్ చేయాలన్నారు. అప్లోడ్ చేసినట్లయితే జి ఎస్ డబ్ల్యూ డేటాలో వారి వివరాలను సర్దుబాటు చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు గాను ప్రభుత్వం ఒక యాప్ ను ఏర్పాటు చేయడమైనదని ఆయన అన్నారు. ప్రతి సచివాలయ సిబ్బంది ఆయా లబ్ధిదారుని ఇంటి వద్దకు వెళ్లి వారిని ఫోటో తీయాలన్నారు. ఆ లబ్ధిదారులతో రెండు ప్రశ్నలకు సమాధానాలు అడగాలని అన్నారు. ప్రభుత్వం అందించే అదనపు ఆర్థిక సహాయం తో గృహాలు కట్టుకుంటారా లేదా అని అడగాలన్నారు. అందుకు లబ్ధిదారులు అవును అంటే వారికి అదనపు నిధులు మంజూరు అవుతాయని అన్నారు. లేదు అంటే వారికి అదరపు నిధులు మంజూరు కాబడవని తెలిపారు. ఇందులో సవరణ ఎంపిక కూడా ఉందని తెలిపారు. ఈ సర్వే ఈనెల 15వ తేదీ నుండి చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతి ఇంజనీరింగ్ అసిస్టెంట్ గాని సచివాలయ సిబ్బంది గాని యాప్ ద్వారా ఫోటోలు తీయాలన్నారు. గృహాల నిర్మాణంలో పునాది, లెంటల్, రూఫ్, స్లాబ్ లెవెల్, ప్రతి లెవెల్ లో ఒక్కొక్క అధికారికి బాధ్యతలు అప్పగించబడ్డాయని ఆయన అన్నారు. మొత్తంగా, పిడి హౌసింగ్ ను పర్యవేక్షణ అధికారిగా నియమించారని ఆయన అన్నారు. లబ్ధిదారులు అదనపు నిధుల మంజూరులో ఎంపిక అయినట్లయితే ఆ లబ్ధిదారుని ఇంటి పురోగతి ఆయా అధికారుల పై ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి ఆ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. 10 డిసెంబర్ 24న పూర్తయిన గృహాలకు నగదు చెల్లింపు చేయడమైనదని అన్నారు. పూర్తయిన గృహాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. ఆ గృహాలకు లోపల బయట ప్లాస్టింగ్, ఫ్లోరింగ్, కిటికీలు, తలుపులు ఉన్నట్లయితే వారిని కూడా ఫోటోలు తీసి యాప్ లో అప్లోడ్ చేయాలన్నారు. వారికి కూడా ప్రభుత్వ అదనపు ఆర్థిక సహాయం మంజూరు చేయబడుతుందని ఆయన అన్నారు. ప్రభుత్వం మే 2025 నాటికి 8 వేల 299 ఇళ్ళను పూర్తి చేయుటకు జిల్లాకు లక్ష్యంగా ఇచ్చారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ లక్ష్యాలను గడువు నాటికి పూర్తి చేయుటకు ఎం.ఎస్.ఓ లు, ఎంపీడీవోలు, ఏఈలు, డి ఇ లు, ప్రత్యక్షత శ్రద్ధ వహించి కెపిఐ లో వృద్ధి సాధించాలని ఆయన అన్నారు. పీఎం ఏ వై 2.0 కింద బాపట్ల జిల్లా యు డి ఎ లో ఉన్నందున కొత్తగా నిర్మించుకునే ఇండ్లకు 2.5 లక్షలు మంజూరు చేయబడుతుందని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రజలకు టామ్ టామ్ ల ద్వారా, సమావేశాల ద్వారా ప్రచారం చేసి వారు ఇండ్ల కొరకు దరఖాస్తు చేసుకునే విధంగా కృషి చేయాలని ఎంపీడీవోలకు ఆయన సూచించారు.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గృహ నిర్మాణాలలో పని దినాలు కల్పించాలన్నారు. నిర్దేశించిన మాదిరిగా 90 పని దినాలు చూపి లబ్ధిదారులకు కూలి సొమ్ము చెల్లించాలన్నారు. గృహ నిర్మాణాల పర్యవేక్షణ పై నోడల్ అధికారిగా జిల్లా సంయుక్త కలెక్టర్ ను నియమించడమైనదని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎమ్. ఎస్ ఓ లు, ఎంపీడీవోలు, పిడి హౌసింగ్ అందరూ క్షేత్రస్థాయిలో వెళ్లి పర్యవేక్షించాలన్నారు. వారంలో ఒకరోజు సంయుక్త కలెక్టర్ సమీక్ష నిర్వహిస్తారని అయన అన్నారు. సంయుక్త కలెక్టర్ పర్యవేక్షణలో ఎవరైనా లక్ష్యాలను పూర్తి చేయుటలో అలసత్వం వహించిన ఎడల వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోబడతాయని అధికారులను ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఈఇలు, డిఈలు, ఏఈ లు తదితరులు పాల్గొన్నారు.





## బాపట్ల జిల్లా ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ తుషార్ డూడి

### అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా
### జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాము



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 13**

ఇతరులకు ఇబ్బంది కలుగకుండా ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి. రణగొణ ధ్వనులను సృష్టిస్తూ ద్విచక్ర వాహనాలను నడిపితే ఉపేక్షించబొము అవాంఛనీయ ఘటనలను ప్రేరేపిస్తే కఠిన చర్యలు తీసుకుంటాము బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఇతరులకు ఇబ్బంది కలుగకుండా ప్రశాంత వాతావరణంలో హోలీ పండుగ జరుపుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి జిల్లా ప్రజలకు సూచించారు. రేపు జరగబోయే హోలీ పండుగను పురస్కరించుకొని గురువారం జిల్లా ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు జిల్లా ఎస్పీ తెలిపారు. హోలీ పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. ఎక్కడ ఏటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిఘా కోసం డ్రోన్ లను వినియోగిస్తున్నామన్నారు. ప్రధాన కూడళ్లు, ముఖ్యమైన ప్రదేశాలలో, దేవాలయాల వద్ద మసీదుల వద్ద పోలీస్ పికెట్ లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రణగొణ ధ్వనులు సృష్టిస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించే వాహన చోదకులను ఉపేక్షించబోమని హెచ్చరించారు. అవాంఛనీయ ఘటనలను ప్రేరేపించే విధంగా వ్యవహరించిన, ఇతరులను రెచ్చగొట్టే విధంగా, మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యాఖ్యలు చేసిన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియా పై నిఘా ఉంచామని తెలిపారు. అసంబద్ధ వదంతులను వ్యాపింప చేస్తే వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. హోలీ సందర్భంగా రంగులను చల్లుకునే సమయంలో ఇతరులకు బాటసారులకు, వాహన దారులకు ఇబ్బందులు కలగకుండా వారిపై రంగులు పడకుండా వ్యవహరించాలన్నారు. ప్రతి ఒక్కరూ మత సామరస్యాన్ని పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో హోలీ పండుగ జరుపుకోవాలని జిల్లా ప్రజలకు ఎస్పీ సూచించారు. ఏదైనా అవాంఛనీయ ఘటన చోటు చేసుకున్న, అత్యవసరంగా పోలీస్ సహాయం కావలసి ఉన్న వెంటనే టోల్ ఫ్రీ నెంబర్లు డయల్ 100/112 లకు (లేదా) స్థానిక పోలీసులకు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా వుంటాయని తెలిపారు.

## షెడ్యూల్డ్ కులాల వారి ఆదాయ మరియు జీవనోపాధి మెరుగుదల కొరకు
## రెండవ రోజు విజయవంతంగా జరిగిన సహజ సబ్బుల తయారీ శిక్షణ



**పెను పవర్ బ్యూరో బాపట్ల మార్చి 13:**

ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల, బాపట్ల వారు - షెడ్యూల్డ్ క్యాస్ట్ సబ్ ప్లాన్ 2024-2025 సహకారంతో బాపట్ల జిల్లా ఈతేరు గ్రామంలో రెండవ రోజు అనగా గురువారం నాడు సహజ సబ్బుల తయారీ శిక్షణా కార్యక్రమం విజయవంతంగా జరిగింది. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం సర్దార్ బేగ్ అధ్యక్షతన డాక్టర్ ఇ గౌతమి ప్రధాన పరిశోధకురాలు మరియు సహ ప్రధాన పరిశోధకులు డాక్టర్ ఎస్ బ్లెస్సి సాగర్- శ్రీమతి కె సౌజన్య సహజ సబ్బుల తయారీ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సహజ సబ్బుల తయారీ శిక్షణా కార్యక్రమమం రెండవ రోజులో భాగంగా ప్రధాన పరిశోధకురాలు డాక్టర్ ఇ గౌతమి మాట్లాడుతూ వంద మంది గ్రామ ప్రజలకు శిక్షణను ఇస్తారని మరియు వారు స్వయంగా సబ్బులను తయారు చేయొచ్చునని తెలిపారు. కృత్రిమంగా చేసిన సబ్బులు వాడకుండా సహజంగా సబ్బుల తయారీ చేసుకుని చర్మవ్యాధులు రాకుండా చూసుకోవచ్చునని బ్లిస్ బ్లూమ్ హెర్బల్స్ లక్ష్మి సోము తెలిపారు. గృహిణులకు ఒక యూనిట్ పెట్టడానికి చదువు గాని లేదా ఆర్థిక స్థోమత గాని అవసరం లేదు అని తెలిపారు. యూనియన్ బ్యాంకు మేనేజర్ బెల్లంపల్లి నాందేవ్ మాట్లాడుతూ ఆసక్తి ఉన్న మహిళలకు బ్యాంకు లోన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 124 మంది గ్రామస్తులు పాల్గొని సహజ సబ్బుల తయారీ శిక్షణ పొందడం జరిగింది. షెడ్యూల్డ్ కులాల వారి ఆదాయ ఉత్పత్తి మరియు జీవనోపాధి మెరుగుదల కొరకు రెండవ రోజు జరిగిన ఈ శిక్షణా కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, యూనియన్ బ్యాంక్ ఎల్డీఎం శివకృష్ణ, ఈతేరు గ్రామ ప్రజలు మరియు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ముల్లమాంబ జయంతి కార్యక్రమం



**కందుకూరు పెన్ పవర్ మార్చి 13**

తొలి తెలుగు కవయిత్రి ముల్లమాంబ జయంతి కార్యక్రమాన్ని స్థానిక యు ఆర్ మెమోరియల్ కంటి హాస్పిటల్ నందు కందుకూరు పట్టణ శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాలివాహన సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు అద్దంకి సుబ్బారావు, కందుకూరు పట్టణ శాలివాన సంఘ అధ్యక్షులు కలికివాయి కృష్ణ, ఉపాధ్యక్షులు ఆముదాలపల్లి మాల్యాద్రి, ప్రముఖ కంటి వైద్యులు ఉప్పుటూరి వెంకయ్య, పలువురు శాలివాహన ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాలివాన సంఘం ఉపాధ్యక్షులు అద్దంకి సుబ్బారావు మాట్లాడుతూ కవయిత్రి మొల్లమాంబ యొక్క గొప్పతనం గురించి ఆమె సంస్కృతంలో ఉన్న వాల్మీకి రామాయణాన్ని తెలుగులో అనువదించిన విధానాన్ని గురించి వివరించారు. ఈ సందర్భంగా మొల్లమాంబ జయంతిని రాష్ట్ర పండుగగా అధికారకంగా నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ధన్యవాదాలు తెలియజేశారు.

# వైభవంగా మునగపాడు చౌడమ్మ తిరుణాళ్ల





**కొనకనమిట్ల పెన్ పవర్ మార్చి 13**

మండలంలోని మునగపాడు గ్రామంలో చౌడమ్మ తిరునాళ్ళ అంగరంగ వైభవంగా గురువారం నిర్వహించారు. చౌడమ్మ గుడిని ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. వేద పండితులు పసుపు, కుంకుమ, గాజులు వివిధ పూలతో, నిమ్మకాయలతో అమ్మవారిని వినూత్నంగా ముస్తాబు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు చుట్టూ పక్కల గ్రామాల వారు ఉదయం నుంచి గుడి దగ్గర బారులు తీరారు. అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి ,పొంగళ్ళు, నైవేద్యాలు పెట్టీ పలువురు మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్ళకు పొదిలి, తర్లుపాడు, మార్కాపురం మండలాల నుండి అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ ఆధ్వర్యంలో4, వైసిపి ఆధ్వర్యంలో 3 విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. ప్రభలపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తిరునాళ్ళలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పొదిలి సీ.ఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో, ఎస్.ఐ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

# ప్రజలకు అండగా జనసేన

## - జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చిట్టెం ప్రసాద్






**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు మార్చి 13**

గత 11 సంవత్సరాలుగా పేద ప్రజలకు అండగా, ప్రజా సమస్యల పరిష్కారానికి వెరవక ఏ పోరాటానికైనా సిద్ధంగా నిలిచి గెలిచి కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యం అయి నేడు ప్రజాభిమానాన్ని పొందుతున్న జనసేన పార్టీ 11 వసంతాలు పూర్తి చేసుకోవడంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై అశేష ప్రజానీకానికి ఉన్న నమ్మకమే అని జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చిట్టెం ప్రసాద్ అన్నారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం ఒంగోలులోని జనసేన పార్టీ కార్యాలయంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు షేక్ రియాజ్ ఆదేశాల మేరకు జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు చిట్టెం ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ కేక్ కట్ చేసి జండా ఆవిష్కరణ చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి ఆవిర్భావ సభ పిఠాపురంలో జరుగుతుందని ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రియాజ్, కంది రవిశంకర్ ల ఆధ్వర్యంలో బస్ లు ఏర్పాటు చేయడం జరిగిందని, పెద్ద ఎత్తున పిఠాపురం కు ఒంగోలు నియోజకవర్గం నుండి తరలి వెళ్తున్నామని చిట్టెం ప్రసాద్ తెలియజేశారు. పార్టీ కార్యదర్శి చనపతి రాంబాబు మాట్లాడుతూ అధికారం రాకముందు ఎలా అయితే ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల మీద పోరాడేమో అలానే ఇప్పుడు కూడా రానున్న రోజుల్లో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని బడుగు బలహీన వర్గాల అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ప్రకాశం జిల్లా జనసేన పార్టీ నాయకులు రాయని రమేష్, కళ్యాణ్ ముత్యాల, పిల్లి రాజేష్, పల్ల ప్రమీల, మనోజ్ రాయల్, జనసేవ శ్రీనివాస్, ఆకుపాటి ఉష, మాదాసు సాయి నాయుడు, సుంకర కళ్యాణి, తన్నీరు ఉష, ఆలా నారాయణ, షేక్ ముంతాజ్, నరసింహారావు, నాగరాజు, శ్రీహరి, అనిత, సాయి ఉంగరాల, నరహరి సాంబయ్య, సుధీర్, ఇమ్మడిశెట్టి శ్రీను, ఇందుర్తి మస్తాన్ రావు, చెన్ను నరేష్, వీర మహిళలు నక్క ప్రమీల, వై అనూష, బండారు గిరి, శాలు, శ్రీను, మనోజ్, వెంకటేష్, బ్రహ్మయ్య, వెలుగు సాయి కృష్ణ, దీపు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మీ జవాన్ కుటుంబాలకు ఇంటి పన్ను చెల్లింపులో వెసులుబాటు

**గత ఏడాది వరకు ఉన్న ఇంటి పన్ను బకాయి చెల్లించే వారికి ఈ ఏడాది నుంచి ఇంటి పన్ను రద్దు.**

**కొమరోలు పంచాయితీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి బ్రహ్మయ్య వెల్లడి.**



**కొమరోలు పెన్ పవర్ మార్చి 13**

కొమరోలు మండలంలోని సైనికులు మాజీ సైనికుల కుటుంబాలకు ఇంటి పన్ను చెల్లింపులో వెసులుబాటు కల్పిస్తున్నట్లుగా కొమరోలు గ్రామపంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దేవరశెట్టి బ్రహ్మయ్య తెలిపారు. 2024 -25 ఆర్థిక సంవత్సరం వరకు గల ఇంటి పన్ను బకాయిలను చెల్లించే ఆర్మీ కుటుంబాలకు 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి ఇంటి పన్ను చెల్లించే అవసరం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని తెలిపారు. కావున కొమరోలు మండలంలోని ఆర్మీ కుటుంబాలకు చెందిన గృహ వినియోగదారులు తమ ఇంటికి సంబంధించిన పన్ను బకాయిలను సకాలంలో చెల్లించి ప్రభుత్వము కల్పిస్తున్న వెసులుబాటు సౌకర్యాన్ని పొందాలని ఆయన తెలిపారు. ఇంటి పన్ను బకాయి చెల్లించిన వారికి చెల్లింపు రసీదు తో పాటు ఈ ఆర్థిక సంవత్సరం నుంచి చెల్లించవలసిన పన్ను రద్దు చేస్తున్నట్లుగా ధృవీకరణ పత్రాన్ని కూడా అందజేస్తామని తెలిపారు. గతంలో కూడా ఈ విధానం అమలులో ఉండేదని ,అయితే చాలామంది సైనికులు, మాజీ సైనికుల కుటుంబాలు ప్రతి సంవత్సరము ఇంటి పన్నులు చెల్లిస్తున్నామని వాపోతున్నట్లుగా ఆయన చెప్పారు. అయితే ఒక్కొక్క సైనికుడు, మాజీ సైనికునికి ఒక ఇంటికి మాత్రమే పన్ను చెల్లింపులో వెసులుబాటు ఉంటుందని బ్రహ్మయ్య తెలిపారు.

# హోలీ పండుగ శుభాకాంక్షలు

## జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్




**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 13**

ప్రకాశం జిల్లా ప్రజలందరికీ ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ హోళీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరూ మత సామరస్యం పాటిస్తూ సంతోషకర వాతావరణంలో హోళి పండగ జరుపుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా, ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించకుండా ఇబ్బంది కలిగించకుండా పండుగ జరుపుకోవాలన్నారు. సంప్రదాయ పండుగలు ఏవైనా ప్రజలు కలిసిమెలిసి ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలి అన్నారు. జిల్లాలోని ముఖ్యమైన పట్టణాలు, ప్రదేశాలు, కాలనీలు, రహదారులపై సిసికెమెరాలు ఉండటంతో పాటు డ్రోన్ కెమెరాల నిఘా ఉన్నదని, వాహనాల తనిఖీలు నిర్వహిస్తామని, మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని ఎస్పీ తెలిపారు. ఎవరైనా కించపరిచేలా లేదా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం లేదా ఏవేని సమస్యలకు కారణమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి పండుగ పర్వదినాల సందర్భంగా ముఖ్యంగా యువత ఆదర్శంగా ఉండాలన్నారు. ద్విచక్ర వాహనాలపై వేగంగా, సైలెన్సర్లు తోలగించి పెద్ద శబ్దాలు చేసుకుంటూ వెళ్ళరాదన్నారు. ఎదుటివారిని ఇబ్బంది కలిగించవద్దని, మహిళల పట్ల మర్యాదగా ఉండాలని తెలిపారు. ప్రార్థనా మందిరాల వద్ద రంగులు చల్లవద్దు అన్నారు. పండుగ వేళ ఎవరైనా గొడవలు పడినా, అసత్య ప్రచారం చేసినా, ఇతరుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, మహిళలను వేధింపులకు గురిచేసిన కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలి అని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించాలి

## పొదిలి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

**పొదిలి, పెన్ పవర్ మార్చి 13**

పొదిలి నగర పంచాయతీ పరిధిలోని ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించాలని పొదిలి మునిసిపల్ కమిషనర్ పి శ్రీనివాసులు కోరారు గురువారం నాడు ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఇంటి పన్నులు, నీటి పన్నులు చెల్లించే వారి సౌకర్యార్థం సెలవు దినాలు అయినా ఆదివారం, పండగ రోజుల్లో కూడా కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు నగర పంచాయతీ కార్యాలయంలోని క్యాష్ కౌంటర్ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు పనిచేస్తుందన్నారు అలాగే అనధికారికంగా ఉన్న కుళాయి కనెక్షన్లను తొలగించడం జరుగుతుందని, అందువల్ల అటువంటి కనెక్షన్లు ఉన్నవారు పంచాయతీ కార్యాలయంలో తగిన రుసుము చెల్లించి, రసీదు పొందడం ద్వారా తమ అనధికార కనెక్షన్లను క్రమబద్ధీకరణ చేసుకోవాలని కమిషనర్ శ్రీనివాసులు సూచించారు ప్రజలు తమ పన్నుల బకాయిలను సకాలంలో చెల్లించడం ద్వారా నగర పంచాయతీ నిర్వహణకు సహకరించాలని కమిషనర్ శ్రీనివాసులు కోరారు.




On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 13:**

బాపట్ల:నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి వారి కుటుంబానికి కొంతమేర చేదోడుగా నిలిచామని ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షుడు మద్దిబోయిన గోపి అన్నారు. బాపట్ల పట్టణం త్రవ్వగలవ రోడ్డు మహాలక్ష్మి చెట్టు వద్ద నివసిస్తున్న అల్లూరు పూర్ణ రాడ్ బెండింగ్ కార్మికుడిగా పనిచేస్తూ అనారోగ్య కారణంతో మృతి చెందడంతో ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు గురువారం నిరుపేద కుటుంబానికి అధిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు గోపి మాట్లాడుతూ పేదరికం అనుభవిస్తూ అనారోగ్య భారీన పడిన కుమారుడిని ఉన్న డబ్బులతో వైద్య చికిత్స అందించినప్పటికీ తీవ్ర అనారోగ్యంతో మృతి చెంది పేదరికంలో ఉన్న బాధితులు కుటుంబానికి తమ ఆర్గనైజేషన్ సభ్యుల సహాయ సహకారాలతో కొంత ఆర్థిక నగదు అందించామని తెలిపారు.ఇలాంటి బాధిత కుటుంబాలను ఆర్గనైజేషన్ తరపున ఆదుకోవడానికి తామెప్పుడూ ముందుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి, ట్రెజరర్ జోగి సువర్ణరాజు, సభ్యులు విన్నకోట శ్రీనివాసరావు,పులిపాటి రాజు,బీమా కోటేశ్వరరావు, షేక్ సుభాని, యాశం రాజా రమేష్, బండ్రెడ్డి అంకమ్మరావు, తన్నీరు గోపి తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర మాజీ సైనికుల ఎన్నికలలో స్టేట్ ప్రెసిడెంట్ గా తాండ్ర సాంబశివరావు, ప్రధానకార్యదర్శి గా సూరెడ్డి శివ కుమార్ లు పోటీ చేస్తూ నామినేషన్ దాఖలు



పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 13:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొట్టమొదటి సారి ఎన్నికల ద్వారా రాష్ట్ర స్థాయి అసోసియేషన్ ఏర్పాటు కోసం జరుగుతున్న మాజీ సైనికుల ఎన్నికలలో స్టేట్ ప్రెసిడెంట్ అభ్యర్థిగా బాపట్ల జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు ప్రధాన కార్యదర్శి గా ఆంధ్రప్రదేశ్ నావల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ సూరెడ్డి శివ కుమార్లు పోటీ చేస్తూ తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారిగా నియమింపబడిన కే గోవిందరావు కు అందజేశారు. రాష్ట్రంలో తొలిసారి జరుగుతున్న మాజీ సైనికుల ఎన్నికలను విజయవాడ లోనీ ఫ్రీడం ఫైటర్స్ బిల్డింగ్ లో ఈ నెల 23 వ తేదీన నిర్వహించబడతాయి అని, మార్చి 7 వ తేదీన నోటిఫికేషన్ విడుదల కాగా 13 మార్చి 2025 తో నామినేషన్ లు వేయుటకు చివరి తేదీ గా నిర్ణయించినట్లు సమాచారం. కాగా, స్టేట్ ప్రెసిడెంట్ మరియు సెక్రటరీ అభ్యర్దులు గా ఈరోజు నామినేషన్ దాఖలు చేసిన తాండ్ర మరియు సూరెడ్డి లకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాజీ సైనికులు మరియు మాజీ సైనిక సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియ జేస్తున్నట్లు సమాచారం.

## కూటమి ప్రభుత్వం నాగాంజనేయులు సేవలు వినియోగించుకోవాలి

**మిజోరం సెంట్రల్ యూనివర్శిటీ ఈసి హెడ్ గా ఎంపికైన చీరాల సుపరిచితులు నాగంజనేయులు.**

**నాగంజనేయులను ఘనంగా సన్మానించిన జనసేన వేటపాలెం మండల అధ్యక్షులు ఉగ్గిరాల మార్కండేయులు..**

**చీరాల, పెన్ పవర్, మార్చ్ 13**

పంచల వేంకట నాగంజనేయులు అంచలంచెలుగా ఎదిగి ఉన్నత స్థానాలు అధిరోహించాలని వేటపాలెం జనసేన మండల అధ్యక్షులు ఉగ్గిరాల మార్కండేయులు,టీడీపి సీనియర్ నాయకులు గుద్దంటి చంద్రమౌళి అన్నారు. గురువారం చీరాల అంబేద్కర్ భవన్ లో మిజోరం సెంట్రల్ యూనివర్శిటీ ఈసి హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ గా మిజోరం రాష్ట్ర కామన్ ఎంట్రన్స్ టెస్ట్ కన్వీనర్ గా ఎంపికైన పంచల వేంకట నాగంజనేయులును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చీరాలకు సుపరిచితులైన వేంకట నాగంజనేయులు మిజోరం రాష్ట్రంలో ఉన్నత స్థానాలకు వెళ్ళడం అభినందనీయమన్నారు.. కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి చెందిన నగంజనేయులు క్రమశిక్షణ పట్టుదల ను గుర్తించి మన రాష్ట్రంలో యూనివర్శిటీకి వైస్ ఛాన్సలర్ గా నియమించి ఆయన సేవలు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ జిలానీ, యు మోహిన్ చంద్,బొడ్డు అనిల్ కుమార్, విటివై కుమార్,దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలానీ,కృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలామ్ తదితరులు పాల్గొన్నారు.





# గాలికుంటు వ్యాధి మరియు బ్రూసెల్లిసిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం







**పెన్ పవర్ కారంపూడి మార్చి 13:-**

జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం లో భాగంగా గాలికుంటు వ్యాధి మరియు బ్రూసెల్లిసిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం జిల్లాలో జరుగుతోంది. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు జిల్లా ఉపసంచాలకులు డాక్టర్ పి. రామారావు గారు కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్శనలో పశుసంవర్ధక సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. ఇప్పటివరకు 350 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయడం జరిగింది. కారంపూడి మండలంలో మొత్తం 11,650 పశువులకు టీకాలు వేయాల్సి ఉండగా, ప్రస్తుతం 3,029 పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల మండలం ఇన్చార్జ్ సహాయ సంచాలకులు డాక్టర్ వెన్న శ్రీనివాస్ రెడ్డి, కారంపూడి ఇన్చార్జి పశువైద్యులు డాక్టర్ దిలీప్, ఒప్పిచర్ల పశుసంవర్ధక సహాయకురాలు కౌసర్, పశువైద్య సిబ్బంది బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

**పశుపోషకులకు విజ్ఞప్తి.**

పశుపోషకులు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకా లు వేయించుకోవాలి. లేకపోతే, పశువులు వ్యాధి బారిన పడిన పుడు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొని, పాల ఉత్పత్తి తగ్గడంతో పాటు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉంది. ఎటువంటి అపోహలకు గురి కాకుండా టీకాలు వేయించుకో వాలని సూచించారు. ఈ టీకాల కార్యక్రమం ఈనెల 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు ఉచితంగా అందుబాటులో ఉంది. పశువైద్య సిబ్బంది మీ గ్రామాలకు వచ్చినప్పుడు సహకరించి, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

**జిల్లా స్థాయి గణాంకాలు**

పల్నాడు జిల్లాలో 4,59,600 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 88,259 పశువులకు టీకాలు అందించారు. బ్రూసెల్లిసిస్ వ్యాధి నివారణ కోసం 14,600 పెయ్య దూడలకు టీకాలు వేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 4,935 దూడలకు టీకాలు అందించారు.

**గాలికుంటు వ్యాధి లక్షణాలు**

తీవ్రమైన జ్వరం, నీరసం, నోటి చుట్టూ, కాళ్ల మధ్య గీతల వద్ద గాయాలు, ఎండ తట్టుకోలేకపోవడం, పాల ఉత్పత్తి తగ్గిపోవడం, పాలు త్రాగే దూడల్లో మరణాలు సంభవించడం, బ్రూసెల్లిసిస్ వ్యాధి లక్షణాలు, గేదెలలో జ్వరం, బలహీనత గర్భస్రావం, గర్భం నిలవకపోవడం మగ పశువుల్లో వృషణాల వాపు ఈ వ్యాధి పశువుల ద్వారా మనుషులకు కూడా వ్యాపించే ప్రమాదం ఉంది. నివారణకు టీకా మాత్రమే మార్గం, దీనికి చికిత్స లేదు. పశుపోషకుల సహకారం అవసరంపశువైద్య సిబ్బంది మీ ఇంటివద్దకు వచ్చి టీకాలు వేయించడానికి సహాయపడతారు.

# ఫౌండేషన్ సేవలు అభినందనీయ- జ్ఞానేశ్వరరావు








**పెన్ పవర బ్యూరో బాపట్ల మార్చి**

నేడు ఈపూరు మండలంలోని కొండ్రముట్ల గ్రామంలోగల జిల్లాపరిషత్ ప్రాథమిక పాఠశాల నందు యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో వారి సహకారంతో పదోవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి (ప్యాడ్, జామెంటరీ బాక్స్, పెన్నులు, పెన్షళ్ళు, స్కెల్ )పంపిణి చేసారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముప్పాళ్ల జ్ఞానేశ్వరరావు, మాజీ సర్పంచ్ గంగవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు. ముప్పాళ్ల జ్ఞానేస్వరరావు మాట్లాడుతూ యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం అని అన్నారు, నేటి సమాజంలో చదువుకున్న వారే రంగంలోనైనా ప్రతిభను కనపరుస్తారని మనిషికి గౌరవం గుర్తింపు చదువు వలనే లభిస్తుందని అయన అన్నారు, ప్రతి ఒక్కరు బాగా చదివి మంచి మార్కులు సాధించాలని, అమ్మాయలు లా కోర్స్ వైపు అడుగులు వేయాలని అక్కడ ఎన్నో అవకాశాలు మీ కోసం ఎదురు చూస్తున్నాయి అని అయన అన్నారు, మాజీ సర్పంచ్ గంగవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బాగా చదువుకుని, చదువుకున్న పాఠశాలకు,అమ్మ నాన్న లకు గౌరవం తీసుకుని రావాలని అయన అన్నారు. కార్యక్రమం లో ఫౌండేషన్ ప్రెసిడెంట్ పమిడిపల్లి అనిల్ రాజ్, సభ్యులు మనోహర్,

# విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి








**వేటపాలెం, పెన్ పవర్, మార్చ్ 13**

మనోవికాసం- లోక్ కళాకార్ దివస్ పురస్కరించుకొని మార్చి 11, 12, 13 తేదీలలో చీరాల నియోజకవర్గ పరిధిలో "బాలల నైపుణ్యాల వర్క్ షాపు"వేటపాలెం మండలంలోని మండల ప్రాథమిక పాఠశాల (ఓ.ఆర్.యస్.) నందు బాల,బాలికలకు చిత్రలేఖనం, చేతి వ్రాత, వక్తృత్వం , ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహించడం జరిగింది. మొత్తం ఎనిమిది పాఠశాలల బాల, బాలికలు పోటీలలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి వేటపాలెం మండల విద్యాశాఖ అధికారులు జె సుబ్బయ్య, ఐ పురుషోత్తం ముఖ్య అతిథులుగా విచ్చేసి విజేతలకు బహుమతులను ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఓ. ఆర్. యస్. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి మంజులాదేవి, ఉపాధ్యాయులు కోడె శ్రీనివాసరావు, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యాపిల్ గ్రేస్, దేశాయిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె మల్లేశ్వరి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు శివకుమారి, డి సరళ, జి వెంకటేశ్వర్లు, బి వెంకటేశ్వర్లు, బి పద్మ పాల్గొన్నారు.

# చలో పిఠాపురం జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయండి?



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 13:**

జయ కేతనం చలో పిఠాపురం చిత్రాడ లో జరుగు జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసి కుమారి కోరారు.?పటేల్ నగర్ లోని పార్టీ కార్యాలయంలో చలో పిఠాపురం పోస్టర్ ను జనసేన పార్టీ నాయకులు అఖండ ఫౌండేషన్ చైర్మన్ విన్నకోట సురేష్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు తొ కలసి ఆవిష్కరించారు. ?ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనసేనా పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు 14 వ తేదీన పిఠాపురం చిత్రాడ లో జరగబోయే జనసేన పార్టీ 12 వ ఆవిర్భావ సభ కి బాపట్ల నియోజకవర్గ నుంచి పార్టీ సభ్యులకు, మండల అధ్యక్షులు, మండల కార్యవర్గ సభ్యులు, గ్రామ అధ్యక్షులు,గ్రామ పార్టీ నాయకులు, పట్టణ పార్టీ నాయకులు, జన సైనికులు; వీర మహిళలు ప్రతి ఒక్కరు పాల్గొని జనసేన పార్టీ ఆవిర్భావ సభ వియవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ జనసేన పార్టీ సీనియర్ నాయకులు కారుమూరి ఆంజనేష్, కర్లపాలెం మండల అధ్యక్షులు గొట్టిపాటి శ్రీకృష్ణ,మహేష్,?మడసాని బాలాజీ, కామిశెట్టి సాయి,దాసరి వినోద్,టీ సాగర్, ?శివ పార్వతి, సిహెచ్ వంశీ సిహెచ్ సాయి డి బాల కోటేశ్వరరావు డి కిషోర్ తదితరులు చలో పిఠాపురం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వినూత్నంగా సైంటిస్ట్ దేవోభవ పోటీలు

**చీరాల, పెన్ పవర్, మార్చ్ 13**

13వ తేదీ చీరాల కస్తూరిబా గాంధీ మునిసిపల్ గరల్స్ హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు సైంటిస్ట్ దేవోభవ అనే అంశంపై రాపిడ్ ఫైర్ రౌండ్ మోడల్ లో శాస్త్రవేత్తలను గుర్తించే పోటీలను సైన్సు ఉపాధ్యాయులు ప్రభాకర్ రావు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల వలన విద్యార్థులలో జ్ఞాపకశక్తి, సృజనాత్మకత పెరుగుతాయని ఉపాధ్యాయులు ప్రభాకరరావు అన్నారు. పోటీల విజేతలకు బహుమతులను అందించడమైనది.



# రాష్ట్ర స్థాయి పెయింటింగ్ లో పార్వతీపురం ఐటీడిప ప్రథమ స్థానం...





**కురుపాం, పెన్ పవర్, ఫిబ్రవరి – 13,** విశాఖపట్నంలో 12 వ తేది న జరిగిన జన్ జాతీయ గౌరవ దివాస్ గిరిజన స్వాభిమాన వేడుకలు 2025 స్టేట్ లెవెల్ ట్రైబల్ పెయింటింగ్ అండ్ ఆర్ట్ కాంపిటేషన్ లో పార్వతీపురం ఐటిడిఏకు ప్రథమ స్థానం బహుమతి గెలుపొందింది. సీనియర్ విభాగంలో మొదటి బహుమతి మండంగి. బాలచంద్రుడు తాడికొండ గ్రామం అతనికి(10000) పదివేల రూపాయలు నగదు ప్రశంస పత్రం, షీల్డ్ అందజేశారు. బాలచంద్రుడిది మన ఎమ్మెల్యే కురుపాం జగదీశ్వరి గారి స్వగ్రామం. జూనియర్ విభాగంలో ద్వితీయ బహుమతి హారిక రాజేష్ 9 వ తరగతి జి టి డబ్ల్యూ హెచ్ ఎస్ టెక్కుబాయి. 5000 నగదు బహుమతి ప్రశంస పత్రం షీల్డ్ అందజేశారు. స్పెషల్ బహుమతి హారిక గౌతమ్ కి 1000 రూపాయలు షీల్డ్ ప్రశంస పత్రం అందజేశారు. కన్జ లెసన్ బహుమతి హారిక అన్విత ఏపీ మోడల్ స్కూల్ కురుపాం ఆమెకు వెయ్యి రూపాయలు ప్రశంస పత్రం అందజేశారు అని లై జన్ ఆఫీసర్%ఽ% డ్రాయింగ్ టీచర్ రుగడ శ్రీనివాసరావు తెలియజేశారు. బహుమతులను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మందారా రాణి అందజేశారు.

## సంతారి సబ్ సెంటర్ ను సందర్శించిన డిఎం అండ్ హెచ్ ఓ సి జమాల్ బాషా..





**హుకుంపేట పెన్ పవర్ మార్చ్13.** ఉప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో గల సంతారి సబ్ సెంటర్ మరియు. లోచలపుట్టు గ్రామాలను డిఎం అండ్ హెచ్ ఓ. సి.జమాల్ బాషా ఈ నెల 12న సందర్శించారు. ఎన్సీడీసీడీ. క్యాన్సర్ సర్వేలు సిబ్బంది ఏవిధంగా చేస్తున్నారు స్థానిక ప్రజలు అడిగి తెలుసుకున్నారు. మరియు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని. ప్రజలకు తెలియజేశారు. రానున్న రోజుల్లో వాతావరణంలో మార్పుల వల్ల అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని. వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు ఎలా తీసుకోవాలో ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంతారి ఏఎన్ఎం మరియు ఆరోగ్య కార్యకర్తలు మరియు ఎన్సీడీసీడీ నోడల్ అధికారి పాడేరు డివిజన్ బాకూరు భూపతి రాజు తదితరులు పాల్గొన్నారు.

## గ్రావెల్ రోడ్డుకు శంకుస్థాపన



**హుకుంపేట, పెన్ పవర్ మార్చి 13:** అరకు నియోజకవర్గం,హుకుంపేట మండలం,కొట్నాపల్లి గ్రామ పంచాయతీ పరిధి లోపోలం,సాలెపుగొంది గ్రామాలకు,15వ మండల ప్రజా పరిషత్ నిధులతో మంజూరైన గ్రావెల్ రోడ్డుకు శంకుస్థాపన చేసి భూమి పూజ కార్యక్రమం చేసారు. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశాలతో హుకుంపేట ఎంపీపీ కూడ రాజ బాబు ప్రత్యేక చొరవతో స్థానిక నాయకులతో కలిసి హుకుంపేట వైసీపీ మండల అధ్యక్షులు పాంగి అనిల్ ప్రారంభోత్సవం చేశారు.
ఈ సందర్భంగా హుకుంపేట వైసీపీ మండల అధ్యక్షులు పాంగి అనిల్ మాట్లాడుతూ..
రోడ్డు నాణ్యతలో ఎక్కడా రాజీ పడకుండా.. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్ ను కోరారు ఈ కార్యక్రమంలో.హుకుంపేట మండలం సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు , కొట్నాపల్లి గ్రామ పంచాయితీ సర్పంచ్ కాకరి బొంజుబాబు.కొట్నాపల్లి గ్రామపంచాయతీ సెగ్మెంట్ ఎంపీటీసీ సంబే.బాలకృష్ణ.వైసీపీ ఉపాధ్యక్షులు కాకరి వెంకటరావు.కార్యకర్తలు శివాజీ.కొండబాబు ,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మొల్ల జయంతి వేడుకలు



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్,శ్రీకాకుళం, మార్చి 13 :**తొలి తెలుగు కవయిత్రి మొల్ల జయంతి వేడుకలను జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి జిల్లా బీసీ సంక్షేమ అధికారి అనురాధ, డీఎస్ఓ, సంఘ నాయకులు, పెద్దలు ఘన నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ విలువలతో కూడిన కవిత్వాన్ని సమాజానికి అందించడంలో కవయిత్రి మొల్ల ప్రత్యేకతని కొనియాడారు. రామాయణాన్ని వివిధ భాషల్లో ఎందరో రచించారని, వాల్మీకి మహర్షి రచించిన రామాయణాన్ని మొల్లమాంబ తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో తెలుగుభాషలో రచించడం గర్వించదగ్గ విషయమని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వీర స్వామి, ఎర్రన్న, స్వామి, మల్లేసు, సూర్యనారాయణ, గణపతి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలు తెలియని వారు చట్టసభల్లోకి వెళ్ళటం దురదృష్టకరం:ఆదివాసీ పార్టీ



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 13 :**చట్టాలు తెలియని వారు చట్ట సభలల్లోకి వెళ్ళడం దురదృష్టకరమని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో శాసనాలు తయారు చేసే దేవాలయంతో సమానమైన చట్టసభల్లోకి చట్టాలపై కనీస అవగాహన లేనివారు సభ్యులుగా వెళ్ళడం,వారికి తెలియకుండానే వారి పార్టీ నాయకులు ఇచ్చిన స్క్రిప్ట్ ను చదవడం పరిపాటిగా మారిందని,గతంలో గిడ్డి ఈశ్వరి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నేతలు ఇచ్చిన స్క్రిప్ట్ ను చదవానని మీడియా ముఖంగా ఒప్పుకొన్నారు.గిడ్డి ఈశ్వరి లాంటి నాయకురాలే స్క్రిప్ట్ పై ఆధారపడ్డారంటే శిరీష ఏమాత్రమని,స్పీకర్ అయ్యన్న పాత్రుడు కూడా శిరీషదేవి మాట్లాడడానికీ ఎందుకు ఎక్కువసార్లు అవకాశం ఇస్తున్నారంటే ఇదే కారణమని, 1/70 భూబదాలయింపు నిషేధచట్టం సవరణ చేయాలని అయ్యన్న వ్యాఖ్యలకు వ్యతిరేకంగా రాష్ట్రంలో ఏజెన్సీ బంద్ వరకు ఆదివాసీలు వెళ్తే సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సున్నితమైన అంశం వివాదం కాకుండా ఆదివాసీ చట్టాలను రక్షిస్తామని,గౌరవిస్తామని ప్రకటించిన విషయం విదితమే.ఇలాంటి సమయంలో దేవాలయం లాంటి శాసనసభలో అచ్చమైన కోయ ఆదివాసీ ఆడబిడ్డతో ఆదివాసీ చట్టాలను ఉల్లంఘించే పరిస్థితి ఆదివాసేతరులు తీసుకొచ్చారు.పాపం శిరీషదేవికే కాదు చాలా మందికి తెలియని విషయం భూబదాలయింపు నిషేధచట్టం (ఎల్టీఆర్ చట్టం)14 ఆగస్టు 1917 న 1/17 భూబదాలయింపు నిషేధచట్టం బ్రిటిష్ ప్రభుత్వమే తీసుకొచ్చిందని,స్వాతంత్ర్యం అనంతరం భారత్ ప్రభుత్వం 04 ఏప్రిల్ 1959 న 1/59 భూబదాలయింపు నిషేధచట్టం మరియు 22 డిసెంబర్ 1970 న 1/70 భూబదాలయింపు నిషేధ చట్టం తీసుకొని రావడం జరిగిందని, నాన్ ట్రైబల్స్ వారి అతి తెలివి తేటలతో 1952సం.కు ముందు నుండి ఏజెన్సీలో ఉంటున్న నాన్ ట్రైబల్స్ కు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎమ్మెల్యే శిరీషదేవితో శాసన సభలో మాట్లాడించడం జరిగింది,కానీ షెడ్యూల్డ్ ప్రాంతంలో ఎల్టీఆర్ చట్టం 1917 నుండే ఉందని, ప్రభుత్వం కూడా గిరిజనేతరులతో సమానమని సమత జడ్జిమెంట్ లో సుప్రీం కోర్టు చెప్పిన విషయం కూడా గుర్తు పెట్టుకోవాలని,ఆదివాసీలకు ప్రధానంగా వారు ఎన్నుకున్నా ప్రతినిధులు చాలా ప్రమాదం పొంచి ఉందని,గతంలో గిరిజనేతరులకు ఒకటిన్నర సెంట్ల భూమిని ఇవ్వాలని వైయస్సార్ కాంగ్రెసు పార్టీ ఏడుగురు ఆదివాసీ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి కార్యాలయానికి లేఖ వ్రాయడం జరిగింది.మొన్నటికి మొన్న పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రత్యేక ఉప కలెక్టర్ (గిరిజన సంక్షేమం)రద్దు చేయించినట్లు మాట్లాడారు,రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి గిరిజనేతరులకు ఇళ్ల స్థలాలు ఇవ్వమనడం, రేపు ఏ ఎమ్మెల్యే ఏమి మాట్లాడుతారోనని ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు,కానీ చట్టపరంగా గిరిజనేతరులకు సూది మేపేంత స్థలం కూడా షెడ్యూల్డ్ ప్రాంతంలో లేదన్న విషయం ఆదివాసీ ప్రజాప్రతినిధులు,ఆదివాసీలు,పాలకులు,గిరిజనేతరులు,ఏజెన్సీలో పని చేసే ఉద్యోగులు తెలుసుకోవాలని ఆయన అన్నారు.

## కలెక్టరేట్ లో కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు

### మొల్ల చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్ మార్చి 13:**విశాఖపట్టణం కలెక్టరేట్ లో కవయిత్రి, మొల్ల రామాయణం రచయిత్రి అయిన ఆతుకూరి మొల్లమాంబ జయంతి వేడుకలు గురువారం జరిగాయి. కుమ్మరి శాలివాహన సంఘం డైరెక్టర్ చిరంజీవులతో కలిసి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె జీవిత విశేషాలను గుర్తు చేసుకున్నారు. మొల్ల రచనా శైలి సరళమైనదని, ఆమె జీవితం అనుసరణీయమైనదని ప్రశంసించారు. జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, బీసీ సంక్షేమ శాఖ అధికారిణి బి. శ్రీదేవి, కుమ్మరి శాలివాహన సంఘం సభ్యులు, అధికారులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గారు గిరిజనేతరుల పక్షం వహించడం మీకు న్యాయమనిపిస్తుందా!

**జై భీమ్ వెల్ఫేర్ సొసైటీ ఏఎస్ఆర్ జిల్లా ఇన్చార్జ్**
**వేములపూడి రామకృష్ణ(ఆర్ కే)**

**చింతపల్లి/గూడెం కొత్తవీధి, పెన్ పవర్ మార్చి 13:** రాష్ట్ర శాసనసభలో గిరిజనేతరులకు పక్కా గృహాలు నిర్మించుకోవడానికి అర్హత కల్పించాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి వాక్యానించటం సరైన విధానం కాదని ఇది ముమ్మాటికి గిరిజన చట్టాలు హక్కులను ఉల్లంఘించటమే అవుతుందని జై భీమ్ వెల్ఫేర్ సొసైటీ అల్లూరి సీతారామరాజు జిల్లా కన్వీనర్ వేములపూడి రామకృష్ణ తెలిపారు.ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేస్తూ గిరిజన ప్రజల యొక్క కష్టాలు వారి బాధలు చట్టసభల్లో మాట్లాడి పరిష్కార మార్గం చూపించవలసిన ఎమ్మెల్యే గిరిజనేతరుల పక్షాన మాట్లాడటం సరైన పద్ధతి కాదని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే గారు ఇది మీకు న్యాయం అనిపిస్తుందా అని ప్రశ్నించారు. ఇది ముమ్మాటికి ఓటు వేసి గెలిపించిన గిరిజనులను మోసగించడమే అవుతుందని అన్నారు. గిరిజన ప్రాంతంలో ఎన్నో సమస్యలు ఉండగా వాటిని మాట్లాడకుండా గిరిజనేతరులకు ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో హక్కు కల్పించమని అడగటం 1/70 చట్టాన్ని ధిక్కరించడమే అవుతుందని అన్నారు. మారుమూల గిరిజన గ్రామాలలో రహదారులు లేక రోగులను డోలి కట్టుకొని ఆసుపత్రికి తరలిస్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయని, ఈ వేసవి కాలంలో అనేక గ్రామాలలో మంచినీటి సమస్య ఏర్పడుతుందని, స్పెషల్ డిఎస్సీ, గిరిజన నిరుద్యోగులకు ఉపాధి కల్పన వంటి సమస్యలను వదిలివేసి గిరిజనేతరుల పక్షంగా మాట్లాడటం ఎవరిని సంతోష పెట్టడానికని ప్రశ్నించారు. 1/70 చట్టాన్ని సవరించాలని స్పీకర్ అయిన చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడిన మాటలకు 1/70 చట్టానికి కట్టుబడి ఉన్నామనే మాటలలో నిజం ఎంత ఉందని ప్రశ్నించారు. జీవో నెంబర్ 3 కి ప్రత్యమ్యాయం తీసుకొస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ వైపుగా ఆలోచన చేయటం మానేసిందని, గిరిజన ప్రాంతంలో ఉన్న సమస్యలపై దృష్టి సారించి, సమస్యలకు పరిష్కారం చూపించాలని అన్నారు.



## విశాఖ ఉక్కు నూతన ఆపరేషన్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ పురుషోత్తమన్ ను మర్యాదపూర్వకంగా కలిసిన స్టీల్ టి ఎన్ టి యు సి యూనియన్ నాయుకులు



**గాజువాక పెన్ పవర్, మార్చి 13:**నూతనంగా నియమితులు అయిన ఆపరేషన్ డైరెక్టర్ ని చిరు సత్కరిస్తూ ప్లాంట్ లో ఎన్నో రోజులుగా మెయింటైనెన్స లేకపోవడం వల్ల కొన్ని ముఖ్యమైన విభాగాల్లో కొన్ని యాక్సిడెంట్స్ జరిగాయని దీన్ని నివారించేందుకు తగ్గిన మెయింటెనెన్స్ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు . అదేవిధంగా కాంట్రాక్ట్ కార్మికుల్ని తొలగించరాదని వినతి పత్రం అందజేశారు. ఉక్కు కర్మాగార ప్రగతిలో కాంట్రాక్ట్ కార్మికుల పాత్ర చాలా ముఖ్యమైనదని మరియు కర్మాగారంలో వివిధ ప్రదేశాల్లో స్క్రాప్ మెటీరియల్ పడి ఉంది దాన్ని సేకరించి అమ్మినట్లయితే వేలకోట్ల రూపాయలను ఆర్జించవచ్చుఅని, తద్వారా ప్రొడక్షన్ ని పెంచవచ్చు సూచన చేశారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర టి ఎన్ టి యు సి ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్ బాబు స్టీల్ టి ఎన్ టి యు సి యూనియన్ ప్రధాన కార్యదర్శి నమ్మి సింహాద్రి అధ్యక్షుడు గుమ్మడి నరేంద్ర కుమార్ టి ఎన్ టి యు సి యూనియన్ కార్యవర్గ సభ్యులు పెద్దాడ సోమినాయుడు పోట్ల శ్రీను అరుగుల మణికుమార్ మండవ రఘు ప్రసాద్ గొర్లె మధు గండేపల్లి రాము మడగల జగదీష్ తదితరులు పాల్గొన్నారు

## వార్డు లో కార్పొరేటర్ తిప్పలవంశి రెడ్డి పర్యటన





**గాజువాక పెన్ పవర్, మార్చి 13:**మహావిశాఖ నగరపాలక సంస్థ74వ వార్డు దయాల్ నగర్, పాత సంగంపాక గ్రామంలో 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి వార్డు లో పర్యటించారు .కార్యక్రమంలో భాగంగా నిర్మాణం లో ఉన్న కమ్యూనిటీ హాల్ పనులు పరిశీలించారు దానిలో భాగంగా త్వరలో సీ సీ రోడ్ మరియు కల్వర్టు పనులు ప్రారంభం అవుతాయన్నారు ఈకార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది, ఎన్ వై నాయుడు. దుర్గారెడ్డి. గ్రామ పెద్దలు, మహిళలు. యువకులు. గ్రామ కమిటీ వారు పాల్గొన్నారు.

# ఓడిపోయాక గుర్తొచ్చాయా... నాయనా సోషల్ మీడియాలో జగన్ పై సెటైర్లు

**గుంటూరు, మార్చి 13, పెన్ పవర్:** వైఎస్సార్సీపీ పార్టీ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ ప్రారంభోత్సవం నాడు అధ్యక్షుడు చేసే పనే కదా అనుకోవచ్చు. అలా అయితే ఇప్పుడు మాట్లాడుకోవలసిన పనేముంది. 2011, మార్చి 12న యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ అనగా వైఎస్సార్సీపీని ప్రారంభించారు. అంటే ఇప్పటికి 14 వార్షికోత్సవాలు జరిగాయి. అయితే వీటిలో ఇప్పటి వరకూ ఆ పార్టీ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు అయిన జగన్ మోహనరెడ్డి ఎన్నిసార్లు జెండా ఎగరేశారో తెలుసా? రెండు లేదా మూడుసార్లు మాత్రమే?ఓ రాజకీయ పార్టీకి ఆవిర్భావ దినోత్సవం అన్నది చాలా ముఖ్యమైంది. అలాగే పార్టీ మీటింగ్‌లు, అప్పుడప్పుడు పార్టీ ప్లీనరీలు వంటివి చేస్తుంటారు. తెలుగుదేశం పార్టీ తమ వార్షిక వేడుకలు మహానాడు పేరుతో జరుపుకుంటుంది. జనసేన తొలిసారిగా ప్లీనరీని జరుపుకోబోతోంది. వైఎస్సార్సీపీ ఇంతకు ముందు రెండుసార్లు ప్లీనరీని నిర్వహించింది. ఇవాళ విజయవాడలోని పార్టీ కార్యాలయంలో జగన్ మోహనరెడ్డి తమ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో పార్టీ జెండాను ఎగురేశారు. పార్టీ జెండాలను ఆయా పార్టీల అధ్యక్షులు తరచుగా ఏమీ ఆవిష్కరించరు కానీ ఆవిర్భావం రోజు మాత్రం తప్పనిసరిగా ఆ పనిచేస్తారు. కానీ 2011లో పార్టీని ప్రారంభించి హైదరాబాద్ జూబ్లిహిల్స్ లో కార్యాలయం ఏర్పాటు చేసినప్పుడు తొలిసారిగా ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆ తర్వాత ఉపఎన్నికల్లో విజయం తర్వాత పార్టీ అడ్రెస్ విజయవాడకు మారింది. అక్కడ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసినా జగన్ మోహనరెడ్డి మాత్రం పార్టీ కార్యాలయానికి ఎక్కువగా వెళ్లలేదు. ఈ పద్నాలుగేళ్లలో ఆయన జెండాను ఆవిష్కరించింది. పార్టీ కండువాను ధరించింది చాలా అరుదైన సందర్భాల్లో మాత్రమే. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి 2014లో హైదరాబాద్ లో శాసనసభ లో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంలో జగన్ మోహనరెడ్డి పార్టీ కండువాను ధరించారు. ఆ తర్వాత ఎప్పుడూ లేదు. 2019 ఎన్నికలకు ముందు గుంటూరులో నిర్వహించిన ప్లీనరీలో కూడా పార్టీ కండువా వేసుకోలేదు. 2019 ఎన్నికల్లో భారీ విజయం సాధించి అసెంబ్లీకి వచ్చేప్పుడు కూడా వేసుకోలేదు. ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు.. అంతకు ముందు చాలా తక్కువగా మాత్రమే పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆయన.. సీఎం అయిన తర్వాత ఇక పార్టీ కార్యాలయం వైపే చూడలేదు. చాలా సార్లు విజయవాడ కార్యాలయంలోనూ.. ఆ తర్వాత తాడేపల్లి బైపాస్ కార్యాలయాల్లోనూ సజ్జల రామకృష్ణారెడ్డి, ఇతర సీనియర్ నేతలే జెండాను ఆవిష్కరించారు. జగన్ మోహనరెడ్డికి జనంలో ఉన్న చరిష్మా వల్ల ఆయన తిరుగులేని మెజార్టీ సాధించారు కానీ.. ఆయన పార్టీని మాత్రం? జనరల్‌గా పార్టీని నడిపించే ప్రిన్సిపల్స్ ప్రకారం నడపలేదు.



వైఎస్సార్సీపీకి కూడా హై లెవల్ నాయకుల కమిటీ ఉంది కానీ వాళ్లు సమావేశం అయ్యేది తక్కువ. వాళ్లతో జగన్ మీటింగ్ పెట్టేది మరీ తక్కువ . ఇక పార్టీ కార్యవర్గం, విస్తృత స్థాయి సమావేశాలు, పార్టీ అనుబంధ విభాగాలు మీటింగ్స్ గురించి మాట్లాడుకోవడానికి ఏం లేదు. వైఎస్సార్సీపీలో రాజకీయ వ్యవహారాలు అప్పట్లో ఉన్న త్రిమూర్తులు సజ్జల, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి చూసుకునేవారు. విజయసాయిరెడ్డి పూర్తిగా ఉత్తరాంధ్రను.. వైవీ గోదావరి , రాయలసీమలను చూస్తే.. రాష్ట్ర వ్యాప్తంగా నాయకుల వ్యవహారాలను సజ్జల చూసేవారు. అలాగే పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వానికి– పార్టీకి మధ్య వారధిగా కూడా సజ్జలనే ఉన్నారు. ఇక జగన్ కుటుంబ ఆంతరంగిక బృందంలో చెవిరెడ్డి ఉంటూ.. పార్టీకి సంబంధించిన సర్వేలు, ఫీడ్‌బ్యాక్ మెకానిజం చూసేవాళ్లు. మొత్తం మీద పార్టీ సెటప్ ఇదే. అధికారంలోకి వచ్చిన తర్వాత అయితే ఆయన పూర్తిగా పార్టీకి అందుబాటులో లేరు. ముఖ్యమంత్రిగా రాష్ట్రం మొత్తానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యక్తి పార్టీ కార్యకలాపాల్లో ఉండకూడదని నిర్ణయించుకున్నారని వైసీపీ నేతలు కవర్ చేయడానికి ప్రయత్నిస్తారు కానీ అదంత సమంజసంగా అనిపించదు. వైఎస్ జగన్ పార్టీని వద్దనుకోలేదు. పైగా ఆయన ఇంత వరకూ చరిత్రలో లేని విధంగా ఆ పార్టీకి జీవితకాల అధ్యక్షుడిగానూ ప్రకటించుకున్నారు. అయితే ఎలక్షన్ కమిషన్ ఒప్పుకోలేదు అది వేరే సంగతి. జాతీయ పార్టీల్లో పార్టీ అధ్యక్షులుగా లేని సీఎంలు.. పార్టీ కార్యక్రమాలకు హాజరవుతారు. అంతెందుకు ప్రధాని నరేంద్ర మోదీ సైతం బీజేపీ జాతీయ ప్లీనరీలో పాల్గొంటారు. ఇతర మీటింగ్‌లకు వెళతారు. తెలంగాణ సీఎం రేవంత్ ఇప్పుడు అలాగే చేస్తున్నారు. చంద్రబాబు తెలుగుదేశం అధ్యక్షుడు, సీఎం కూడా ఆయన ఈ దఫా కూడా చాలాసార్లు పార్టీ ఆఫీసుకు వెళ్లారు. అంతకు ముందూ చేశారు. అంతెందుకు జగన్ తండ్రి, వైఎస్ రాజశేఖరరెడ్డి సైతం సీఎంగా పార్టీ కార్యక్రమాలకు అటెండ్ అయ్యారు. ఈ విషయంపై పార్టీలో చర్చ జరిగినా ఆ విషయాన్ని ధైర్యంగా జగన్ కు చెప్పగలిగే వాళ్లు అప్పట్లో లేరు. కేవలం జగన్ ఇమేజ్ మీదనే తాము గెలిచాం కానీ.. గ్రామ, మండల , జిల్లా స్థాయిలో పార్టీ కార్యకలాపాలు లేవని ఆ పార్టీ నేతలు అంటుండేవారు. పార్టీలో సీనియర్ నేతగా ఉన్న ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పార్టీ ఆర్గనైజేషన్ ను బలపరచడానికి కొంత ప్రయత్నం చేసినప్పటికీ.. అదేమీ సక్సెస్ కాలేదు. 2024లో ఘోరమైన ఓటమి తర్వాత పార్టీ అధినేత జగన్ మోహనరెడ్డిలో కొంత మార్పు వచ్చింది అనుకోవచ్చు. ఓడిపోయిన వెంటనే ఆయన పార్టీ నేతల మీటింగ్ పెట్టారు. ఇక నుంచి నేను మీ తోనే అని చెప్పారు. ఎక్కువగా పార్టీ నేతలను కలిశారు. ఐదేళ్లు పోరాటం చేద్దాం అని చెప్పారు. అంతే కాదు.. మొన్న అసెంబ్లీకి వైసీపీ కండువాను మెడలో వేసుకొని వచ్చారు. బహుశా ఈ 14 ఏళ్లలో ఆయన్ను పార్టీ కార్యకర్తలు ఓ 2–3 సార్లు మాత్రమే అలా కండువాతో చూసి ఉంటారు అంతే. ఇప్పుడు తరచుగా పార్టీ కార్యాలయానికి కూడా వస్తున్నారు. అయితే ఇప్పుడు ఆ కార్యాలయం ఆయన ఇంటి ప్రాంగణంలోనే ఉంది. ఒకప్పుడు సీఎం క్యాంప్ ఆఫీసుగా పనిచేసిన కార్యాలయాన్నే ఇప్పుడు వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యాలయంగా మార్చారు. ఆయన ఇప్పుడు తరచుగా అక్కడకు వస్తున్నారు నేతలతో మాట్లాడుతున్నారు. చాలా మారిపోయారు. ఆ మార్పులో భాగమే.. ఇప్పుడు పార్టీ జెండా ఎగరేయడం. ఓడిపోయాక కానీ పార్టీని పట్టించుకోవాలని తెలిసిరాలేదు అని కొంతమంది సణుగుతుంటే.. ఏదైతే ఏంటి మాకు కావలసింది ఇదే అని ఆ పార్టీ కార్యకర్తలు ఖుషీ అవుతున్నారు.

# తిరుమలలో నెయ్యి కష్టాలు

**తిరుమల, మార్చి 13, పెన్ పవర్:** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రసాదాలకు నెయ్యి సేకరణ రోజు రోజు కష్టంగా మారుతోంది. సరిపడా నెయ్యి అందుబాటులో లేకపోవడంతో ప్రసాదాల తయారీలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. మరోవైపు నెయ్యి కొరతను పసిగట్టిన అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇతర సంస్థల నుంచి నెయ్యి సేకరణకు చర్యలు తీసుకుంటున్నారు. తిరుమల శ్రీవారి ప్రసాదం (లడ్డూ) అంటే ఇష్టపడని వారు ఉండరు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా ఆ మాటకొస్తే ప్రపంచ వ్యాప్తంగా శ్రీవారి ప్రసాదానికి ప్రియులు ఉన్నారు. శ్రీవారి ప్రసాదమంటే అమృతంగా భావించిన వారు ఉన్నారు. ఆ ప్రసాదం దొరకడం కూడా పూర్వ జన్మ శుక్రుతమనుకునేవారు కూడా ఉన్నారు. ప్రపంచ అభిమానులు ఉన్న ఈ శ్రీవారి ప్రసాదం తయారీ చేయడానికి కీలకమైన పదార్థం నెయ్యి ఇప్పుడు తగినంత అందుబాటులో లేదు. నెయ్యి సేకరణ కష్టంగా మారింది. గత పది రోజులుగా టీటీడీ ఆధీనంలో ఉన్న తిరుమలతో పాటు తిరుపతి, పరిసర ఆలయాలకు సరిపడా నెయ్యి సరఫరా జరగటం లేదు. దీంతో శ్రీవారి ప్రసాదం తయారీలో ఇబ్బందులు తలెత్తున్నాయి. శ్రీవారి ప్రసాదం విషయంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పెద్ద ఎత్తున రగడ జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీవారి ప్రసాదం లడ్డూ తయారీకి వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని ప్రకటన చేశారు. దీంతో ఈ అంశం రాష్ట్రంలో సంచలనం అయింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్ ఏకంగా దీక్ష చేయడం, అలాగే తిరుమల వెళ్లి బహిరంగ సభ పెట్టి సనాతన ధర్మ పరిరక్షణను కీలక వ్యాఖ్యలు చేశారు. అలాగే మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కూడా తిరుమల వెళ్తానని ప్రకటించడం, అప్పుడు డిక్లరేషన్ అంశం తెరపైకి రావడం, ఆ తరువాత అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ఆయన తిరుమల పర్యటన రద్దు చేసుకున్నారు. టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తిరుమల వెళ్లి ప్రమాణం చేయడం, పోలీసులు అడ్డుకోవడం ఇలా కొన్ని రోజుల పాటు రాష్ట్రంలో ఇదే అంశం చర్చ జరిగింది. అయితే చివరికి సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవడంతో రాష్ట్రంలో చర్చకు ఫుల్‌స్టాప్ పడింది. ప్రస్తుతానికి సీబీఐ నేతృత్వంలోని సిట్ విచారణ జరుపుతుంది. ప్రస్తుతం శ్రీవారి ప్రసాదం లడ్డూ తయారీకి వాడే నెయ్యి కొరత ఏర్పడింది. తిరుమలలో రోజూ ప్రసాదాల తయారీకి 14 టన్నుల నెయ్యి అవసరం అవుతుంది. ప్రస్తుతం టీటీడీకి కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (కేఎంఎఫ్), ఢిల్లీకి చెందిన ఆల్ఫా కంపెనీలు నెయ్యి సరఫరా చేస్తున్నాయి. కెఎంఎఫ్ నుంచి వచ్చే ఒక్కోక్క లారీలో 40 నుంచి 50 టన్నుల నెయ్యి ఉంటుంది. దీని నాణ్యతను ల్యాబ్‌లో నిర్ధారించేందుకు దాదాపు రోజున్నర (36 గంటల) పడుతుంది. గతంలో టీటీడీ నెయి నిల్వ కేంద్రంలో ముందస్తుగా 40 నుంచి 50 టన్నుల నెయ్యి నిల్వ చేయడంతో కొరత సమస్య రాలేదు. కానీ ప్రస్తుతం అలా జరగటం లేదు. ముందస్తు నిల్వ కింద నెయ్యిని నిల్వ చేయటం లేదు. ఇటీవలి ఒక రోజు నెయ్యి సరఫరా ఆలస్యమైంది. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు లడ్డూ తయారీకి సంబంధించిన బూందీ పోటు తయారీ ఆగింది. వేసవిలో భక్తులు రద్దీ ఉంటుంది. దీంతో లడ్డూ ప్రసాదాలు తయారీకి భారీగా నెయ్యి అవసరం ఏర్పడుతుంది. అయితే ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేయకపోతే ఇబ్బందులు తప్పేలా లేవని టీటీడీ ఉద్యోగులు చెబుతున్నారు. తిరుపతిలోని స్థానిక ఆలయాల్లోనూ నెయ్యి సరఫరా తగ్గడంతో తిరుచానూరు ఆలయం నుంచి కొద్ది మేర పంపుతున్నారు. సరఫరాదారుల సంఖ్య పడిపోవడంతో కూడా నెయ్యి కొరతకు ఒక కారణమని టీటీడీ ఉద్యోగి చెప్పారు. అయితే టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ (సేకరణ) డిప్యూటీ ఈవో ప్రసాద్ నెయ్యి కొరతపై స్పందిస్తూ త్వరలోనే ఇతర సంస్థల నుంచి నెయ్యి సేకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అప్పటి వరకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అయితే శ్రీవారి ప్రసాదాలకు ఎటువంటి లోటు లేకుండా చేయాలని భక్తులు అంటున్నారు.

# టీడీపీకి ట్రబుల్ షూటర్ కావలెను...

**విజయవాడ, మార్చి 13, పెన్ పవర్:** ఏపీ రాజకీయాలు గమనిస్తున్న వాళ్లకి స్పష్టంగా ఒక విషయం అయితే అర్థమవుతోంది. టీడీపీలో నెమ్మదిగా సీనియర్లను పక్కన పెడుతూ యువరక్తాన్ని పార్టీలోకి ఎక్కించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వంలోని కీలక పదవులు వాళ్లకే దక్కుతున్నాయి. 2024 ఎన్నికల్లో గెలిచాక అధిక శాతం మంత్రి పదవులు యువకులకు కొత్తగా ఎమ్మెల్యేలగా ఎన్నికైన వాళ్లకు దక్కాయి. ప్రస్తుత జనరేషన్‌కి ఇది కరెక్టే. కానీ దీనిలో ఒక చిన్న ఇబ్బంది కూడా కనిపిస్తోంది. చాలామంది సీనియర్లు సైలెంట్ అయిపోవడంతో కీలకమైన అంశాల్లో ఇంకా చెప్పాలంటే ఇబ్బందికరమైన పరిస్థితి ఎదురైనప్పుడు నిర్ణయాలు తీసుకోవడంలో తడబాటు కనిపిస్తోంది. సంక్షోభాన్ని పరిష్కరించి పరిస్థితులను పార్టీకి అనుకూలంగా మార్చే ట్రబుల్ షూటర్స్ కరవైపోయారు. ఏదైనా ఇబ్బంది కరమైన పరిస్థితి ఎదురైనప్పుడు పరిష్కరించాలంటే దానికి కచ్చితంగా సీనియారిటీ కావాలి. ప్రత్యర్థి పార్టీలు ఏదైనా అంటే కౌంటర్ ప్రెస్‌మీట్ పెట్టి ఇటువైపు నుంచి మరో తిట్టే వాళ్లే ఉంటున్నారు. కానీ ఆ విమర్శలను పార్టీకి అనుకూలంగా మార్చే నైపుణ్యం సీనియారిటీతోనే వస్తుంది. ప్రస్తుత టిడిపిలో అది లోపించిందన్న అభిప్రాయం ఉంది. ఒకప్పుడు చంద్రబాబుకి అండగా ఎర్రన్నాయుడు, కడియం శ్రీహరి, అశోక్ గజపతిరాజు, యనమల రామకృష్ణుడు, లాల్ జన్ బాషా లాంటి నేతలు ఉండేవారు. తర్వాత కాలంలో దేవినేని ఉమా, తలసాని శ్రీనివాస్ యాదవ్, మోత్కుపల్లి నరసింహులు ఇలా లిస్టు పెద్దగానే ఉండేది. ఇప్పుడు పార్టీలో ఉన్నవాళ్లు ఎక్కువ మంది వ్యాపారస్థులు, యువకులు కావడంతో ఆ ట్రబుల్ షూటర్ స్థానం లోపించిందన్న మాటలు పార్టీ నుంచే వినిపిస్తున్నాయి. టిడిపి ఇటీవల కాలంలో రెండు ఘటనల్లో సీనియరిటీ లేమిని ఎదుర్కొంది. మొదటిది గ్రూప్ 2 ఎగ్జామ్స్‌కు సంబంధించిన ఇష్యూ. రెండోది గుంటూరు మిర్చి యర్డు అంశం. గ్రూప్ 2 ఎగ్జామ్స్‌కు సంబంధించి ఉన్న ఇబ్బందులను, రిజర్వేషన్ వివాదాన్ని నారా లోకేష్ దృష్టికి సరైన సమయంలో అధికారులు తీసుకెళ్లలేదని అంటారు. ఆ తర్వాత జరిగిన తతంగం అందరికీ తెలిసిందే. తాము ఇచ్చిన జీవో 77కు విరుద్ధంగా తామే ఇచ్చిన నోటిఫికేషన్ కావడంతో విపక్ష వైసిపి దీనిలో పెద్దగా కలుగజేసుకోలేదు. కానీ టిడిపికి చాలా ఇబ్బంది కలిగించే పరిణామాలే గ్రూప్ 2 పరీక్ష నిర్వహణలో ఉన్నాయి. దాదాపు 90 వేలమంది అభ్యర్థులకు సంబంధించిన అంశం కావడంతో వారిలో ఎంత మందిలో ఇంకా దీనిపై వ్యతిరేకత ఉందో బయటకు తెలియని పరిస్థితి. ఈ ఇష్యూని డీల్ చేయడంలో కూటమి ఫెయిల్యూర్ అనే చెప్పాలి. రెండోది గుంటూరు మిర్చి యార్డ్‌లో జగన్ నిరసనకు వెళ్లిన అంశం. మిర్చి రేటు పెంపు అంశంలో తన నిరసన తర్వాతే కేంద్రంతో మాట్లాడిన టిడిపి ప్రభుత్వం ఆచరణలోకి తెచ్చిందని ఆ క్రెడిట్ తమదేనని వైసిపి ఓన్ చేసుకుంది. దీనిపై ఒకటి రెండు ప్రెస్ మీట్‌లు పెట్టి జగన్‌ని విమర్శించడం మినహా పెద్దగా చేసింది ఏమి లేదు. ఇలాంటి అంశాల్లోనే సీనియారిటీ అనేది పనికొస్తుంది. జరిగిన ఇష్యూలోని అన్ని వివరాలను పార్టీకి అనుకూలంగా మార్చుకుంటూ ప్రజల్లో అవగాహన పెంచడం సీనియర్ల వల్ల మాత్రమే అయ్యే పని. 'కాంగ్రెస్‌లో సీనియర్ మోస్ట్ లీడర్, తమిళనాడుకు మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కామరాజ్ రూపొందించిందే కామరాజ్ ప్లాన్. దీని ప్రకారం సీనియర్లు ప్రభుత్వ పదవులు నుంచి దిగిపోయి పార్టీకి పరిమితం కావాలి యంగ్ జనరేషన్ మంత్రి పదవిలో ఉండాలి. స్వయంగా తానే ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోయి 1963లో ఈ ప్లాన్ ప్రకటించారు. నిజానికి ఇది లాల్ బహదూర్ శాస్త్రి, తర్వాత ఇందిరాగాంధీని ప్రధానులు చేయడానికి మొరార్జీ దేశాయ్‌ని దెబ్బ కొట్టడానికి తీసుకొచ్చిన ప్లాన్ అనే విమర్శలు కూడా ఉన్నాయి. కానీ ఇందిరా గాంధీకి తర్వాత కాలంలో ఇది ఎంతో ఉపయోగపడింది. మరి ఇలాంటి సమయంలో సీనియర్లు అందర్నీ పక్కన పెట్టేయడం టిడిపి వేస్తున్న సరైన స్టెప్పో కాదో భవిష్యత్ రాజకీయాలే నిర్ణయిస్తాయి.

# విజయసాయి అప్రూవర్ గా మారుతున్నారా...

**విజయవాడ, మార్చి 13, పెన్ పవర్:** వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి మనసులో తాను లేనన్న విషయం తెలియగానే మనసు విరిగిపోయిందని వైసీపీలో తను ఒక్కొక్క మెట్టు దిగుతున్న కొద్దీ కొంతమంది ఒక్కొక్క మెట్టు ఎదుగుతూ జగన్ చుట్టూ ఒక కోటరీ లా తయారయ్యారని " వైసిపి మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి అన్నారు. పార్టీ నుంచి బయటికి వెళ్లిపోతున్న టైంలో అధినాయకత్వంపై ఎలాంటి విమర్శలు చేయని సాయి రెడ్డి విజయవాడలో సిఐడి ముందు విచారణకు హాజరైన సమయంలో మీడియా ముందు తన వేదనంతా బయట పెట్టేశారు. కాకినాడ పోర్టులో వాటాలను విజయసాయిరెడ్డి, అల్లుడి సోదరుడు శరత్ చంద్రరెడ్డి,వైవీ సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్‌రెడ్డి బలవంతంగా లాగేసుకున్నారని పోర్టు యజమాని ఐఎ రావు సిఐడికి ఫిర్యాదు చేశారు. దీంతో కేసు పెట్టి సీఐడీ నోటీసులు అందజేసింది. మొదట్లో చంద్రబాబు నాయుడిపై విజయ సాయిరెడ్డి నిప్పులు చెరిగారు. అది గతం ఇప్పుడు ఆయన వైసీపీ మాజీ నేత. అందుకే కానీ బుధవారం విచారణకు హాజరైన తర్వాత ఆయన శైలి మారిపోయింది. ప్రధానంగా వైసిపి హైకమాండ్‌ని టార్గెట్ చేస్తూ సంచలన కామెంట్స్ చేశారు. కాకినాడ పోర్టు వివాదంలో తన పాత్ర లేదని చేసిందంతా వైవి సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డి అని చెప్పారు. వాళ్లు అమెరికా వెళ్ళినప్పుడు కేసు వేసిన కె.వి రావు ఇంట్లోనే ఉండేవారిని ఆరోపించారు విజయసాయిరెడ్డి. అలాగే ఈ కేసుకు సంబంధం లేని మద్యం స్కాంపై కూడా మాట్లాడుతూ అప్పటి జగన్ ప్రభుత్వం అడ్వైజర్ కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి కనుసన్నల్లోనే వ్యవహారం నడిచిందని బాంబు పేల్చారు. ఆ కేసులో కూడా విజయసాయిరెడ్డి సహా వైసీపీకి చెందిన చాలా ముఖ్యమైన వాళ్ళ పేర్లు ఉన్నాయి. దీనిపై సిట్ వేశారు ప్రస్తుతం విచారణ సాగుతోంది. త్వరలోనే కొన్ని పెద్ద తలకాయల అరెస్టులు తప్పవని అంటున్నారు. వైసీపీ నుంచి ఎవరైనా తనపై విమర్శలు చేస్తే చాలా విషయాలు మాట్లాడతా అంటూ విజయసాయిరెడ్డి వార్నింగ్ పంపించారు. దీనితో విజయసాయిరెడ్డి త్వరలో అప్రూవర్‌గా మారతారా అంటూ ఏపీ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది. విచిత్రంగా సాయి రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేసినా పార్టీ నుంచి పెద్ద లీడర్లు ఎవరూ ఇంతవరకూ స్పందించలేదు. దాంతో విజయసాయి రెడ్డి దగ్గర పార్టీకి చెందిన చాలా రహస్యాలు ఉన్నాయన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. పార్టీ వదిలి తాను వెళ్తాను అన్నప్పుడు "తనకు విశ్వసనీయత లేదని, భయపడ్డానని, ప్రలోభాలకు లొంగి పోయానని " జగన్ అన్నారు. కానీ తనకు అలాంటివేవీ లేవని.. సిబిఐ,ఈడీ కేసులు ఉన్నా భయపడలేదని చెప్పుకొచ్చారు విజయసాయి రెడ్డి. జగన్ చుట్టూ ఏర్పడిన కోటరీ ఆయనకు వాస్తవాలు తెలియకుండా చేస్తుందని ఆరోపించారు. నాయకుడు చెప్పుడు మాటలు వినడం మొదలుపెడితే పార్టీకి ప్రజలకు తీవ్ర నష్టమని హెచ్చరించారు. గత మూడున్నర ఏళ్లుగా అవమానాలు ఎదుర్కొంటూ వచ్చానని సాయిరెడ్డి అన్నారు. సజ్జల రామకృష్ణ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ఒకోను ఉద్దేశించి విజయ సాయిరెడ్డి ఈ కామెంట్స్ చేశారని సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతోంది. విజయ సాయి రెడ్డిని ఉత్తరాంధ్ర ఇంచార్జ్ బాధ్యతల నుంచి తప్పించి వైవి సుబ్బారెడ్డిని పంపించారు. ఢిల్లీలోనూ వైవి సుబ్బారెడ్డికి ప్రాధాన్యత పెంచారు. సీఎం క్యాంపు కార్యాలయంలో మొత్తం సజ్జలదే హవా కావడం తనను దూరం పెట్టారనేది విజయసాయి రెడ్డి అభిప్రాయం. అధినాయకుడు జగన్ దగ్గరే తనకు విలువ లేదని తెలిసి మనసు విరిగిపోయిందని ఆయన మొదటిసారిగా మీడియా ముందు బాధ వెళ్లబుచ్చారు. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే త్వరలోనే విజయ సాయి రెడ్డి తనపై నమోదైన కేసుల్లో అప్రూవర్‌గా మారే అవకాశం లేకపోలేదని అంటున్నారు. అదే గనుక జరిగితే వైసీపీలో పెద్ద తలకాయలకు చాలా ఇబ్బందులు తప్పవని అప్పుడే రాజకీయ వర్గాల్లో చర్చలు ఊపందుకున్నాయి.

# పవన్ కళ్యాణ్ శాఖలో లోకేష్ చొరవ

**విజయవాడ, మార్చి 13, పెన్ పవర్:** నారా లోకేష్ క్షమాపణ చెప్పారు. నల్లమల లోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం కాశీనాయన సత్రాన్ని అటవీ అధికారులు కూల్చేశారు. నిరంతర అన్నదానం జరిగే కట్టడాలు కూడా ఇందులో ఉన్నాయి. టైగర్ జోన్ ఏర్పాటు, అటవీ శాఖ నిబంధనల వల్ల ఫారెస్ట్ అధికారులు నల్లమల అటవీ ప్రాంతంలోని కాశీనాయన ఆశ్రమాన్ని కూల్చేశారు. దీనిపైనే నారా లోకేష్ క్షమాపణ చెబుతూ ప్రజల మనోభావాల్ని విజ్ఞప్తులను అధికారులు దృష్టిలో పెట్టుకుని ఉంటే బాగుండేదని.. ఈ ఘటన కు కారణమైన అధికారులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అలాగే కూల్చేసిన కట్టడాలని తిరిగి తాను నిర్మిస్తానని భక్తులకు హామీకు ఇచ్చారు. నారా లోకేష్ ప్రకటన భక్తులకు ఊరట కలిగించిన మాట వాస్తవమే కానీ ఆ శాఖ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి చెందింది కావడం విశేషం. అటవీ శాఖ బాధ్యతలు ప్రస్తుతం ఆయన నిర్వహిస్తున్నారు. కాశీనాయన కట్టడాలని కూల్చేయొద్దు అంటూ పవన్ కళ్యాణ్ కి ఇప్పటికే చాలా వినతులు అందాయి. కానీ ఆయన నుండి స్పందన రాలేదు. ఇప్పుడు విద్యా, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ఎంటర్ కావడం తో భక్తులకు ఊరట కలిగింది. కానీ ఇలా జనసేనకు చెందిన మంత్రిత్వ శాఖలో నారా లోకేష్ ఎంట్రీ ఇవ్వడం ఏపీ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. గతంలో హోంశాఖ బాధ్యతలు టిడిపి సరిగా నిర్వహించడం లేదంటూ హోం మంత్రి అనితను పవన్ కళ్యాణ్ బహిరంగంగానే విమర్శించిన ఘటన ఇంకా ఎవరూ మరువలేదు. తాను గనుక హోంశాఖ తీసుకుంటే పరిస్థితి వేరేలా ఉంటుందని కూడా పవన్ కళ్యాణ్ అప్పట్లో ప్రత్యర్థులకు వార్నింగ్ ఇచ్చారు. కానీ ఇలా వేరే మంత్రిత్వ శాఖ గురించి బహిరంగంగా పవన్ కళ్యాణ్ మాట్లాడడం పై అప్పట్లో పెద్ద చర్చే జరిగింది. ఇప్పుడు ఆయనకు సంబంధించిన శాఖలో నారా లోకేష్ ఎంట్రీ ఇవ్వడంపై అది కూడా జనసేన ప్లీనరీకి ఒక్కరోజు ముందు ఈ పరిణామం జరగడంతో ఏపీ రాజకీయాలు కొత్త చర్చ మొదలైంది. కానీ ఇంత ముఖ్యమైన విషయంలో పవన్ కళ్యాణ్ ఎందుకు స్పందించలేదు అనేది కాశీనాయన భక్తులకు అర్థం కావడం లేదు. ఉమ్మడి నెల్లూరు జిల్లా బెడుసుపల్లిలో 1895లో పుట్టిన కాశీ రెడ్డి బాల్యంలోనే ఆధ్యాత్మిక చింతనలో పడ్డారు. దేశంలోని అనేక తీర్థాలు పుణ్యక్షేత్రాలు సందర్శించి కాశి నాయనగా మారారు. ఆయన పేరు మీద రాష్ట్రంలో అనేక ఆశ్రమాలు వెలసాయి. కడప జిల్లాలోని బద్వేలు సమీపంలో ఉన్న ఆశ్రమం అతి ముఖ్యమైనది. ఇక్కడ నిత్య అన్నదానం జరుగుతూ ఉంటుంది. దానికి సంబంధించిన ఏర్పాట్లు తాను బతికి ఉండగానే కాశి నాయన 104 ఏళ్ల వయస్సు లో 1999లో దేహం చాలించారు. ఆయన పేరు మీద అప్పటి ప్రభుత్వం ఒక మండలాన్ని కూడా ఏర్పాటు చేసింది. రాయలసీమ ప్రాంతంలో కాశీనాయనకు ఎంతో మంది భక్తులు ఉన్నారు. ఇప్పుడు అటవీ నిబంధనల పేరుతో ఆయన ఆశ్రమాన్ని అన్నదాన సత్రాన్ని అటవీ అధికారులు కూల్చేయడం పై ఆందోళన మొదలైంది. ప్రస్తుతం లోకేష్ ఎంట్రీ ఇవ్వడంతో ఆ ఆందోళన సద్దుమణిగినా అది పవన్ కళ్యాణ్ కు చెందిన శాఖ కావడంతో జనసేన దీనిపై ఎలా స్పందిస్తుందో చూడాలి అంటున్నారు రాజకీయ పరిశీలకులు.

# మళ్లా పాత నేతలకు లైన్ క్లియర్

**రాజమండ్రి, మార్చి 13, పెన్ పవర్:** భారతీయ జనతా పార్టీలోని సీనియర్ నేత సోము వీర్రాజు ఎమ్మెల్సీగా ఎన్నికవుతున్నారు. మరో రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటించనున్నారు. అయితే సోము వీర్రాజు సరే.. మరో కీలక నేత జీవీఎల్ నరసింహారావు మాటేంటి? అన్న చర్చ పార్టీలో నడుస్తుంది. వీర్రాజు మాదిరిగానే త్వరలోనే జీవీఎల్ కు కూడా పదవి దక్కుతుందన్న అంచనాలు పార్టీలో ఊపందుకున్నాయి. సోము వీర్రాజు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాసనమండలిలో కాలు మోపినట్లుగానే జీవీఎల్ నరసింహారావును కూడా కీలకపదవి వరించడానికి సిద్ధంగా ఉందన్న ప్రచారం ఊపందుకుంది. నిజానికి బీజేపీలో సోము వీర్రాజు, జీవీఎల్ నరసింహరావు, విష్ణువర్ధన్ రెడ్డి వంటి నేతలు యాంటీ టీడీపీగా ముద్రపడ్డారు. వీరికి పదవులు కూటమి ప్రభుత్వంలో లభించవని అందరూ భావించారు. ఒకవేళ బీజేపీ కేంద్ర నాయకత్వం ప్రతిపాదించినా అందుకు చంద్రబాబు అంగీకరించరని తెలుగు తమ్ముళ్లతో పాటు బీజేపీలోని మరొక వర్గం కూడా గట్టిగా విశ్వసించింది. ఎందుకంటే ప్రో జగన్ గా ముద్రపడిన ఈ నేతలకు పదవుల విషయంలో చంద్రబాబు మోదీ, అమిత్ షా ల వద్ద అభ్యంతరం చెబుతారని అంచనా వేసింది. అయితే చంద్రబాబును ఒప్పించి కేంద్ర నాయకత్వం నేరుగా సోము వీర్రాజును ఎమ్మెల్సీగా ఎంపిక చేయడానికి సిద్ధమయింది. అంటే బీజేపీ కేంద్ర నాయకత్వం ఈ బ్యాచ్ ను వదులుకునేందుకు సిద్ధంగా లేదన్న విషయం స్పష్టంగా అర్థమవుతుంది. కేంద్రంతో నిధుల అవసరం కూడా ఉండటంతో చంద్రబాబు కూడా ఏమీ చేయలేని పరిస్థితి. ఇక సోము వీర్రాజుకు పదవి వచ్చింది కాబట్టి తర్వాత నేత జీవీఎల్ నరసింహారావు అని అంటున్నారు. తొలి నుంచి పార్టీలో ఉంటూ ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న నేతలకు ప్రాధాన్యం ఇవ్వాలని బీజేపీ కేంద్ర నాయకత్వం నిర్ణయించుకున్నట్లు తెలిసింది. మిత్రపక్షంలో ఉన్నప్పటికీ తమ మాట చెల్లుబాటు అయ్యేలా ఢిల్లీ నుంచి అధినాయకత్వం పావులు కదుపుతున్నట్లే కనపడుతుంది. రానున్న కాలంలో ఖాళీ అయ్యే ప్రతి ఎమ్మెల్సీ, రాజ్యసభ పదవుల్లో బీజేపీ తన భాగాన్ని కోరుకుంటుంది. అందులో ఎటువంటి సందేహం లేదు. రానున్న కాలంలో ఖాళీ అయ్యే పదవుల్లో జీవీఎల్ నరసింహారావుకు కూడా పదవి లభించడం ఖాయమని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. మరి ఏం జరుగుతుందో చూడాలి. బీజేపీ అధ్యక్ష పదవి నుంచి పురంద్రీశ్వరిని తప్పించి ఆమె స్థానంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్ ను ఎంపిక చేయాలన్న ఉద్దేశ్యంతో అధినాయకత్వం ఉందని తెలిసింది.

# వీళ్ళు మళ్ళీ కలిశారు: హండ్రెడ్ లీగ్‌లో కూడా ఒకే గూటికి చేరిన దిగ్గజాలు





**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్, న్యూజిలాండ్ స్టార్ క్రికెటర్ కేన్ విలియమ్సన్ మధ్య విడదీయలేని బంధం ఉందేమో అనిపిస్తుంది. వీరిద్దరూ కలిసి ముచ్చటగా మూడోసారి ఆడనున్నారు. ఐపీఎల్, పాకిస్థాన్ సూపర్ లీగ్ తర్వాత ఇంగ్లాండ్ లో జరగబోయే ది హండ్రెడ్ లీగ్ కలిసి ఆడేందుకు సిద్ధమయ్యారు. బుధవారం (మార్చి 13) ది హండ్రెడ్ లీగ్ లో ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్‌ను లండన్ స్పిరిట్ తీసుకుంది. అంతకముందు లండన్ స్పిరిట్ విలియంసన్ తో ఒప్పందం కుదుర్చుకుంది. వీరిద్దరూ మరోసారి కలిసి ఆడడం విశేషం.

ఇటీవలే 2025 పాకిస్థాన్ సూపర్ లీగ్ లో కరాచీ కింగ్స్ తరపున ఈ జోడీ సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. అంతకముందు ఐపీఎల్ లో సన్ రైజర్స్ తరపున వార్నర్, విలియంసన్ సేవలను మర్చిపోలేం. ఈ ద్వయం ఎన్నో సీజన్ లు హైదరాబాద్ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించారు. కెప్టెన్ గా, బ్యాటర్ గా ఇద్దరిది అద్భుతమైన ప్రస్తానం. న్యూజిలాండ్ సెంట్రల్ కాంట్రాక్ట్ వదులుకున్న తర్వాత విలియంసన్ ప్రపంచ లీగ్ లు ఆడేందుకు ఆసక్తి చూపిస్తున్నాడు. మరోవైపు వార్నర్ అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత ఫ్రాంచైజీ క్రికెట్ ఆడతానని స్పష్టం చేశాడు. వీరిద్దరూ 2025 ఐపీఎల్ మెగా ఆక్షన్ లో అమ్ముడు పోకపోవడం విచారకరం. 2025 పాకిస్థాన్ సూపర్ లీగ్ లో ప్లాటినం డ్రాఫ్ట్‌లో 44 మంది ఆటగాళ్లలో వార్నర్ కూడా ఉన్నాడు. రిటైర్మెంట్ తర్వాత బిగ్ బాష్ లీగ్ ఆడుతూ బిజీగా ఉన్న వార్నర్ త్వరలో జరగబోయే పాక్ లీగ్ లో తొలిసారి కనిపించబోతున్నాడు. న్యూజిలాండ్ వెటరన్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ ప్లాటినం రౌండ్‌లో అమ్ముడుపోలేదు. అయితే అతన్ని డైమండ్ రౌండ్‌లో కరాచీ కింగ్స్ దక్కించుకుంది.

వార్నర్ బిగ్ బాష్ లీగ్ తో అద్భుతమైన ఫామ్ లో ఉన్నాడు. ఎనిమిది ఇన్నింగ్స్‌లలో 54 సగటుతో 324 పరుగులు చేశాడు. సిడ్నీ థండర్ తరపున ఆడుతున్న వార్నర్.. మూడు అర్ధ సెంచరీలు చేశాడు. ఐపీఎల్ లో అమ్ముడుపోని వార్నర్.. పాకిస్థాన్ సూపర్ లీగ్ లో భారీ ధరకు కొనుగోలు చేయడం విశేషం. మరోవైపు విలియంసన్ సౌతాఫ్రికా టీ20 లీగ్ లో దర్బన్ సూపర్ జెయింట్స్ తరపున ఆడాడు. దర్బన్‌లో ప్రిటోరియా క్యాపిటల్స్‌తో జరిగిన తన మొదటి మ్యాచ్‌లో 40 బంతుల్లో 60 పరుగులు చేసి రాణించాడు. ఐపీఎల్ లో విలియంసన్ ను ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేయకపోగా.. పాకిస్థాన్ సూపర్ లీగ్ లో అతనికి ఊరట దక్కింది.

**లండన్ స్పిరిట్ మెన్**

జేమీ స్మిత్, జేమీ ఓవర్టన్, లియామ్ డాసన్, డేవిడ్ వార్నర్ (ఆస్ట్రేలియా) , డేనియల్ వొరాల్, కేన్ విలియమ్సన్ (న్యూజిలాండ్), రిచర్డ్ గ్లీసన్, ల్యూక్ వుడ్, ఓల్లీ స్టోన్, ఆష్టన్ టర్నర్ (ఆస్ట్రేలియా), ఓల్లీ పోప్, జాఫర్ చోహన్, కీటన్ జెన్నింగ్స్, వేన్ మాడ్సెన్

# 45 మందిలో ఒక్కరిని కూడా కొనలేదు.. హండ్రెడ్ డ్రాఫ్ట్‌లో పాకిస్థాన్ ప్లేయర్లకు బిగ్ షాక్






**హైదరాబాద్ పెన్ పవర్:** ఆగస్టు 5న ప్రారంభం కానున్న ది హండ్రెడ్ 2025 ఎడిషన్ లో పాకిస్థాన్ ఆటగాళ్లకు ఊహించని షాక్ తగిలింది. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ఆదరణ పొందిన ఈ లీగ్ డ్రాఫ్ట్ లో ఒక్క పాకిస్థాన్ ఆటగాడిని కూడా తీసుకోలేదు. గత కొంతకాలంగా పాక్ ఆటగాళ్ల నిలకడ లేమి తనమే ఇందుకు కారణమని తెలుస్తుంది. పాకిస్థాన్ స్టార్ ఆటగాళ్లకు సైతం హండ్రెడ్ లీగ్ లో నిరాశ తప్పలేదు. నసీమ్ షా, ఇమాద్ వసీంతో పాటు సూపర్ ఫామ్ లో ఉన్న ఓపెనర్ సైమ్ అయూబ్ తో సహా మొత్తం 45 మంది పాకిస్తానీ ఆటగాళ్ళు డ్రాఫ్ట్ కోసం తమ పేరును నమోదు చేసుకున్నారు. అయితే ఎనిమిది ఫ్రాంచైజీలలో ఏ ఒక్కరు కూడా వీరిని తీసుకోవడానికి ఆసక్తి చూపించలేదు. 2024 సీజన్ లో ది హండ్రెడ్‌లో అత్యంత ఖరీదైన పాకిస్తానీ ఫాస్ట్ బౌలర్ నసీమ్ షా (%ూఖ=% 36.2 మిలియన్లకు పైగా) కు ఎంపికయ్యాడు. ఇమాద్ వసీం, సైమ్ అయూబ్‌లు (%ూఖ=% 23.5 మిలియన్ల) షాదాబ్ ఖాన్, హసన్ అలీ, మహ్మద్ హస్నైన్‌లు (%ూఖ=% 22.7 మిలియన్లు) ఈ లీగ్ ఆడారు. ఛాంపియన్స్ ట్రోఫీలో సొంతగడ్డపై ఒక్క విజయం లేకుండా పరువు పోగొట్టుకున్న పాకిస్థాన్.. ఇప్పుడు ప్రపంచ లీగ్ ల్లో కూడా ఆ జట్టు ఆటగాళ్లను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆగస్టు 5 నుండి ఆగస్టు 31 వరకు ఈ టోర్నమెంట్ జరుగుతుంది. లార్డ్స్, ది ఓవల్, ఎడ్జ్‌బాస్టన్ వేదికలలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్‌ను లండన్ స్పిరిట్ తీసుకోగా.. ఇంగ్లాండ్ అత్యుత్తమ ఫాస్ట్ బౌలర్ బౌలర్ జేమ్స్ ఆండర్సన్ ను ఎవరూ కొనలేదు. అండర్సన్ ఐపీఎల్ లో కూడా ఏ జట్టు వేలంలో తీసుకోలేదు. ఫ్రాంచైజీ క్రికెట్ ఆడడానికి సిద్ధమన్న ఈ ఇంగ్లాండ్ పేసర్ కు నిరాశే మిగిలింది. ఆండ్రీ ఫ్లింటాఫ్ కొడుకు రాకీ ఫ్లింటాఫ్ ను కొనడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఆఫ్ఘనిస్తాన్ స్పిన్నర్ నూర్ అహ్మద్ తో పాటు ఇటీవలే ఛాంపియన్స్ ట్రోఫీలో అద్భుతంగా రాణించిన న్యూజిలాండ్ బ్యాటర్ రచిన్ రవీంద్ర మాంచెస్టర్ ఒరిజినల్స్ తరపున ఆడనున్నారు.

# లక్నోకి ఊరట.. కేవలం బ్యాటర్‌గానే ఆడతానన్న ఆసీస్ ఆల్ రౌండర్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ కు ముందు లక్నో సూపర్ జయింట్స్ కు గుడ్ న్యూస్. ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ మిచెల్ మార్ష్ ఐపీఎల్ ఆడతానని కన్ఫర్మ్ చేశాడు. ఈ విషయాన్ని అతను గురువారం (మార్చి 13) ప్రకటించాడు. మార్ష్ వస్తున్నాడని సంతోషించే లోపే లక్నోకు బిగ్ షాక్ షాక్ ఇచ్చాడు. అతను కేవలం బ్యాటర్ గానే కొనసాగుతానని చెప్పడం విశేషం. దీంతో లక్నోకు కాస్త ఉపశమనం కలిగినట్టయింది. 33 ఏళ్ల ఈ ఆసీస్ ఆల్ రౌండర్ లక్నో తరపున ఇంపాక్ట్ ప్లేయర్ గా బరిలోకి దిగే అవకాశం ఉంది. ఐపీఎల్ 2025 మెగా ఆక్షన్ లో మార్ష్ ను రూ. 3.4 కోట్లకు లక్నో జట్టు సొంతం చేసుకుంది. వెన్నుముక గాయంతో ఇబ్బంది పడుతున్న మార్ష్.. పూర్తిగా కోలుకున్నట్టు సమాచారం. గత మూడు సీజన్ లు గా మార్ష్ ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఆడాడు. అయితే అతను చాలాసార్లు గాయం కారణంగా జట్టుకు దూరం కావాల్సి వచ్చింది. ఢిల్లీ కంటే ముందు మార్ష్ గతంలో ఐపీఎల్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్, రైజింగ్ పూణే సూపర్‌జెయింట్స్, పూణే వారియర్స్, డెక్కన్ ఛార్జర్స్ తరపున ఆడాడు. నివేదిక ప్రకారం మార్ష్ మార్చి 18న లక్నో జట్టుతో కలవనున్నాడు. ఈ ఆల్ రౌండర్ తనకు ఎంతగానో తెలిసిన జస్టిన్ లాంగర్‌తో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. జనవరి 7న బిగ్ బాష్ లీగ్‌లో పెర్త్ స్కార్చర్స్ తరపున మార్ష్ చివరిసారిగా మ్యాచ్ ఆడాడు. గత కొంతకాలంగా మార్ష్ ఫార్మాట్ ఏదైనా ఘోరంగా విఫలమవుతున్నాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో 7 ఇన్నింగ్స్ లో 73 పరుగులు చేసి చివరి టెస్టుకు జట్టులో స్థానం కోల్పోయాడు. అనుభవం దృష్టిలో పెట్టుకొని ఛాంపియన్స్ ట్రోఫీలో అవకాశం దక్కినప్పటికీ గాయంతో దూరమవ్వాల్సి వచ్చింది. మార్ష్ ఓపెనర్ గా బరిలోకి దిగే అవకాశం ఉంది. ఈ సీజన్ లో లక్నో జట్టును టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ నడిపించనున్నాడు. మార్చి 24 న ఢిల్లీ క్యాపిటల్స్ తో లక్నో సూపర్ జయింట్స్ తమ తొలి మ్యాచ్ ఆడనుంది.

# పవన్ కళ్యాణ్ హీరోయిన్ స్టైలిష్ అవతార్



దిశా పటానీ యొక్క ఇన్‌స్టాగ్రామ్ ఫ్యాషన్ గేమ్ పాయింట్‌లో ఉంది



కృతి సనన్ అద్భుతమైన బ్లాక్ డియోర్ లుక్



కన్నడ మూవీ 'పోర్కి' తో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ ప్రణిత సుభాష్. రెండో సినిమానే తెలుగులో చేసింది. 'ఎమ్ పిల్లో ఎమ్ పిల్లాడో' సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా నిరాశ పరిచిన అందంతో ఆకట్టుకుని గుర్తింపు సొంతం చేసుకుంది. ఆ వెంటనే సిద్దార్థ్ హీరోగా నటించిన 'బావ' సినిమాలోనూ పల్లెటూరు అమ్మాయిగా నటించి పక్కింటి అమ్మాయి ఇమేజ్‌ను సొంతం చేసుకుంది. ఆకట్టుకునే అందంతో పాటు నటనతో అలరించడం వల్ల హీరోయిన్‌గా మంచి పేరు సొంతం చేసుకుంది. అయితే లక్ కలిసి రాక పోవడంతో స్టార్ హీరోయిన్‌గా ఇమేజ్‌ను దక్కించుకోవడంలో విఫలం అయింది. పవన్ కళ్యాణ్ అత్తారింటికి దారేది సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా నటించడం ద్వారా మంచి పాపులారిటీని సొంతం చేసుకున్న ప్రణిత ఆ వెంటనే ఎన్టీఆర్‌తో కలిసి ఒక సినిమాలో నటించింది. స్టార్ హీరోల సినిమాల్లోనూ నటించిన ప్రణితకి సరైన బ్రేక్ దక్కలేదు. దాదాపు పదేళ్ల పాటు ఇండస్ట్రీలో వరుసగా సినిమాలు చేస్తూ వచ్చిన ప్రణిత ఈమధ్య కాలంలో కాస్త స్లో అయింది. పెళ్లి చేసుకుని తల్లి అయిన తర్వాత కూడా సినిమాల్లో నటించేందుకు ఈమె రెడీగా ఉంది. గత సంవత్సరం ఈమె నటించిన రెండు సినిమాలు ప్రేక్షకలు ముందుకు వచ్చాయి. ప్రస్తుతం కూడా ఒకటి రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నట్లు సమాచారం అందుతోంది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి 15 ఏళ్లు దాటినప్పటికీ అందం విషయంలో ఇంకా కొత్త హీరోయిన్స్‌కి పోటీ అన్నట్లుగా ఉంటుంది. మూడు పదుల వయసులో పడ్డా కూడా ప్రణిత ఆకట్టుకుంటుంది. 20 ఏళ్ల పడుచు అమ్మాయి మాదిరిగానే ఇప్పటికీ అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ముఖ్యంగా ఈమె స్టైలిష్ డ్రెస్‌లో ట్రెండీ డ్రెస్‌ల్లో ఎక్కువగా అలరిస్తూ ఉంటుంది. ప్రతి సందర్భంలోనూ ప్రణీత సుభాష్ షేర్ చేసే ఫోటోలు వైరల్ అవుతూ ఉంటాయి. తాజాగా ఈమె మరోసారి స్టైలిష్ అవతార్‌లో కనిపించింది. విభిన్నమైన ఔట్ ఫిట్‌లో డిఫరెంట్ లుక్, స్టైల్‌తో అలరించిన ఈ అమ్మడు మరోసారి అలరించింది. క్యూట్ లుక్‌తో స్కిన్ షో చేయకుండానే ప్రణిత చూపు తిప్పనివ్వడం లేదంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రణిత అందంకు స్టార్ హీరోలకు జోడీగా ఇప్పటికి వరుసగా సినిమాలు చేయాల్సి ఉంది. సమంత స్థాయిలో స్టార్‌డంను సొంతం చేసుకోవాలి. కానీ ఆ స్థాయిలో ప్రణితకు ఆఫర్లు రాలేదు. లక్ కలిసి రాకపోవడంతో ఈమెకు దక్కాల్సిన గౌరవం, గుర్తింపు దక్కలేదు అనేది కొందరి అభిప్రాయం. ముందు ముందు అయినా ప్రణిత తన అందంతో అలరించి సీనియర్ స్టార్ హీరోలకు జోడీగా అయినా నటించే అవకాశాలు దక్కించుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com